


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 118 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ మంగళవారం 10 మార్చి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 118 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD TUE 10 MARCH 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur

# గచ్చిబౌలి స్టేడియంను అంతర్జాతీయ ప్రమాణాలతో పునర్నిర్మించాలి

- మెగా ఈవెంట్లలో పతకాలు సాధించడమే లక్ష్యమన్న సీఎం
- యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్శిటీని సిద్ధం చేయాలని ఆదేశం
- ఒలింపిక్స్, కామన్వెల్త్ క్రీడలకు ఆతిథ్యం ఇచ్చేలా ఉండాలన్న రేవంత్



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణను అంతర్జాతీయ క్రీడా కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యం దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక అడుగులు వేశారు. ఒలింపిక్స్ వంటి మెగా ఈవెంట్లలో రాష్ట్ర క్రీడాకారులు పతకాలు సాధించడమే ధ్యేయంగా 'యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ'ని సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో క్రీడాశాఖపై నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షలో సీఎం భవిష్యత్తు ప్రణాళికలను ఖరారు చేశారు.ప్రధానంగా గచ్చిబౌలి స్టేడియంను అంతర్జాతీయ ప్రమాణాలతో పునర్నిర్మించాలని సీఎం సూచించారు. అక్కడ ఇండోర్, అవుట్‌డోర్ స్టేడియాలతో పాటు యూనివర్సిటీ కాంప్లెక్స్, అత్యాధునిక హాస్టల్ భవనాలు, వివిధ క్రీడల శిక్షణా కేంద్రాలను అభివృద్ధి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. దీనికి సంబంధించి పలు ఆర్కిటెక్చర్ నమూనాలను పరిశీలించిన ఆయన, భవిష్యత్తులో ఒలింపిక్స్, కామన్వెల్త్ క్రీడలకు తెలంగాణ ఆతిథ్యం ఇచ్చేలా మౌలిక సదుపాయాలు ఉండాలని స్పష్టం చేశారు.కేవలం గచ్చిబౌలి మాత్రమే కాకుండా, హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియం, కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియం, సరూర్ నగర్ ఇండోర్ స్టేడియాలను ద
కూడా ఆధునికీకరించాలని నిర్ణయించారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వాకిటి శ్రీహరి సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. తెలంగాణ క్రీడాకారుల ప్రతిభను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడమే ఈ స్పోర్ట్స్ యూనివర్సిటీ ప్రధాన ఉద్దేశమని ప్రభుత్వం వెల్లడించింది.



## రాహుల్ బంధు కింద రేవంత్ రెడ్డి రూ.1000 కోట్లు పంపిస్తున్నారు

- కేసీఆర్ హయాంలో డిసెంబర్ నెలలో రైతుబంధు పడేదన్న కేటీఆర్
- ఇప్పుడు కోతల సమయం వచ్చినా రైతుబంధు పడలేదన్న కేటీఆర్
- రుణమాఫీ చేశానని అనుకుంటున్నానని రేవంత్ రెడ్డి చెప్పడం విడ్డూరమని వ్యాఖ్య

**హైదరాబాద్ పెన్ పవర్:**'రాహుల్ బంధు' పథకం కింద ప్రతి సంవత్సరం రూ.1000 కోట్లు ఇచ్చి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన పదవిని కాపాడుకుంటున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. సిరిసిల్లలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, కేసీఆర్ హయాంలో డిసెంబర్ నెలలో రైతుబంధు పడేదని, కానీ ఇప్పుడు కోతల సమయం వచ్చినా కాంగ్రెస్ ప్రభుత్వం వేయలేదని విమర్శించారు.
రేవంత్ రెడ్డి ప్రభుత్వ పాలనలో రైతుబంధును నిలిపివేసి 'రాహుల్ బంధు' పేరుతో కొత్త పథకం తెచ్చారని ఎద్దేవా చేశారు. తన పదవిని కాపాడుకోవడం కోసం రేవంత్ రాహుల్ బంధు పథకం కింద గాంధీ కుటుంబానికి వెయ్యి కోట్ల రూపాయలు ఇస్తున్నాడని ఆరోపించారు. అందుకే కేసీఆర్ ముందే చెప్పారని,

మిగతా 2లో



## అవి ప్రభుత్వ హత్యలే

- రాజమండ్రి కల్తీ పాల ఘటనలో 11 మంది మృతి
- ప్రభుత్వ నేరపూరిత నిర్లక్ష్యమే కారణమని షర్మిల తీవ్ర ఆరోపణ
- 11 ఏళ్లుగా లైసెన్స్ లేకుండానే వ్యాపారం జరిగిందని విమర్శ
- మృతుల కుటుంబాలకు రూ. 25 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్
- బాధితులను పరామర్శించని జగన్‌పై కూడా విమర్శలు

మిగతా 2లో



## జమిలి ఎన్నికల వల్ల రాష్ట్ర ఎన్నికల ప్రాధాన్యత తగ్గుతుంది

- కేంద్ర ప్రభుత్వం చేతుల్లోకి అధికారాలన్నీ వెళతాయన్న స్టాలిన్
- అసలు సమస్య కంటే దారుణమైన పరిణామాలకు దారితీస్తుందని ఆందోళన
- జమిలి ఎన్నికలతో జాతీయస్థాయి పార్టీలకే ప్రయోజనమని ఆందోళన

మిగతా 2లో

## తెలంగాణలో సారా దుకాణాలను తెరవాలి

- గతంలో సారా తాగిన వారు 115 ఏళ్ల వరకు బతికారన్న అనిరుధ్ రెడ్డి
- ఇప్పుడు కల్తీ లిక్కర్ తాడి 80 ఏళ్లకే చనిపోతున్నారని వ్యాఖ్య
- సారాను ఎందుకు నిషేధించారో ప్రభుత్వం క్లారిటీ ఇవ్వాలన్న అనిరుధ్

మిగతా 2లో



## ఆడబిడ్డల కన్నీళ్లు మీకు మంచిది కాదు



### ప్రభుత్వానికి కవిత వార్నింగ్

- ఖమ్మం వెలుగుమట్ల నిర్వాసితులను పరామర్శించిన కవిత
- టూరిస్ట్‌గా రాలేదు, సమస్య పరిష్కారమయ్యేవరకూ పోరాడతానని వెల్లడి
- కూల్చిన చోటే ఇళ్లు కట్టివ్వాలని ప్రభుత్వానికి డిమాండ్
- పేదల పక్షాన నిలబడి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తానని స్పష్టీకరణ

మిగతా 2లో



## పెన్షన్లు ఇవ్వడానికి నిధులు లేవని సాకులు చెబుతున్నారు


- విద్యార్థినులకు ఎలక్ట్రిక్ స్కూటర్లు ఇస్తామన్న రేవంత్ వ్యాఖ్యలపై బండి సంజయ్ విమర్శలు
- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయన్న సంజయ్
- మూసీ ప్రాజెక్టు కోసం వేల కోట్లు ఎక్కడి నుంచి వస్తున్నాయని ప్రశ్న

**హైదరాబాద్ పెన్ పవర్:**కాలేజీ విద్యార్థినులకు ఎలక్ట్రిక్ స్కూటర్లు పంపిణీ చేస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ప్రకటన రాష్ట్ర రాజకీయాల్లో కొత్త చర్చకు దారితీసింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రజా భవన్‌లో జరిగిన కార్యక్రమంలో సీఎం ఈ కీలక

మిగతా 2లో

## ఇరాన్‌కు రష్యా పూర్తి అండగా ఉంటుంది

- పశ్చిమాసియాలో గరిష్ట స్థాయికి చేరిన ఉద్రిక్తతలు
- ఇరాన్‌కు వ్యూహాత్మక మద్దతును ప్రకటించిన పుతిన్
- ఇరాన్ నేతల మృతి పట్ల తీవ్ర సంతాపం



**పెన్ పవర్ డెస్క్:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తీవ్ర స్థాయికి చేరిన వేళ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఇరాన్‌కు తన మద్దతును ప్రకటించారు. ఇజ్రాయెల్, అమెరికాలతో సాగుతున్న ఘర్షణల్లో మిత్రదేశమైన ఇరాన్‌కు మాస్కో అండగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. ఇరాన్ నూతన సుప్రీం లీడర్‌గా బాధ్యతలు చేపట్టిన ముజ్తబా ఖమేనీకి పుతిన్ అభినందనలు తెలుపుతూ, ప్రస్తుత సంక్షోభ పరిస్థితుల్లో దేశాన్ని సమర్థవంతంగా నడిపించగలరని ఆశాభావం వ్యక్తం చేశారు. సరిహద్దుల్లో ఎదురవుతున్న సాయుధ

మిగతా 2లో

# రాజ్యసభ సభ్యులుగా వేం నరేందర్ రెడ్డి, అభిషేక్ సింఘ్వీ ఏకగ్రీవం



- రాజ్యసభ సభ్యులుగా తెలంగాణ నుంచి ఎన్నికైన వేం నరేందర్ రెడ్డి, అభిషేక్ సింఘ్వీ
- ఇద్దరికీ ధృవపత్రాలు అందించిన రిటర్నింగ్ అధికారి
- సమస్యలను పరిష్కరించి కేంద్రంపై ఒత్తిడి తీసుకువస్తామన్న వేం నరేందర్ రెడ్డి

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ సమస్యలను రాజ్యసభలో, ఢిల్లీలో వినిపిస్తానని రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికైన వేం నరేందర్ రెడ్డి అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ తరఫున రాజ్యసభ సభ్యులుగా అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇద్దరికీ రిటర్నింగ్ అధికారి ధృవపత్రాలను

మిగతా 2లో

# ఈశాన్య రాష్ట్రాల ప్రజలకు ఢిల్లీ సేఫ్ కాదు బీజేపీ ఎంపీ సంచలన వ్యాఖ్యలు

- జాతి వివక్ష, దాడుల ఘటనల పట్ల ఆందోళన వ్యక్తం చేసిన ఎంపీ
- బలమైన, చట్టపరమైన చట్రాలు అవసరమన్న బీజేపీ ఎంపీ
- అట్రాసిటీ లాంటి చట్టాన్ని తీసుకురావాలని విజ్ఞప్తి



**హైదరాబాద్ పెన్ పవర్:**అరుణాచల్ ప్రదేశ్‌కు చెందిన బీజేపీ ఎంపీ తపిర్ గావో సంచలన వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీలోని ఈశాన్య రాష్ట్రాల ప్రజల భద్రతపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తమ ప్రజలకు ఢిల్లీ సురక్షితం కాదని ఆయన అన్నారు. దేశ రాజధానిలో జాతి వివక్ష, దాడుల సంఘటనలు ఆందోళనకరమని పేర్కొన్నారు.

మిగతా 2లో

## లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన సైబర్ క్రైమ్ ఎస్సైలు

- రెడ్ హ్యాండెడ్‌గా దొరికిన ఎల్బీనగర్ సైబర్‌క్రైమ్ ఎస్సైలు
- ఒక కేసు విషయంలో లక్ష రూపాయల లంచం డిమాండ్ చేసిన వైనం
- ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేసిన బాధితుడు

మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

# అస్తిత్వం కోసం ఇరాన్ పోరాటం

దశాబ్దాల పాటు పశ్చిమ దేశాల కళ్లలో కారంకొడుతూ.. మధ్యప్రాచ్యంలో ఒక తిరుగులేని శక్తిగా ఎదిగిన ఇరాన్ నేడు ఉనికి కోసం పోరాడుతున్నది. మొదటినుంచి అంతర్జాతీయ రాజకీయాల్లో ఇరాన్ రెండు అంశాలపై ఆధారపడింది. ఒకటి తన వద్ద ఉన్న అపారమైన క్షిపణి సంపత్తి.. రెండోది అగ్రరాజ్యాలైన రష్యా, చైనాల వెన్నుదన్ను.. కానీ, ఎవరూ ఊహించని విధంగా అమెరికా, ఇజ్రాయెల్ దాడి చేయడం.. సుప్రీం లీడర్ ఖమేనీ నేలకొరగడంతో ఇరాన్ కోలుకోలేని విధంగా దెబ్బతింది. ఆ దేశంపై వైమానిక దాడులు జరుగుతున్నా.. ఇరాన్ మిత్ర దేశాలు మౌనంగా ఉండటం.. ఇరాన్ ప్రజలనే కాదు ప్రపంచాన్నే ఆశ్చర్యపరుస్తోంది. రష్యా, చైనాతో పాటు మిత్ర దేశమైన భారత్ కూడా మౌనంగా ఉండటానికి కారణాలు ఏంటి? ఉక్రెయిన్ యుద్ధంలో చిక్కుకున్న రష్యాకు ఇరాన్ డ్రోన్లు, క్షిపణులు సరఫరా చేసిన మాట వాస్తవం. ఇప్పుడు ఇరాన్ కష్టాల్లో ఉన్నా.. రష్యా నేరుగా రంగంలోకి దిగడం లేదు. దీనికి ప్రధాన కారణం, ఇజ్రాయెల్‌తో రష్యాకు ఉన్న రహస్య దౌత్య సంబంధాలు.. సిరియాలో రష్యా ప్రయోజనాలు దెబ్బతినకుండా ఉండాలంటే ఇజ్రాయెల్ మద్దతు అవసరం. అందుకే పుతిన్ 'మధ్యవర్తి' పాత్ర పోషిస్తున్నారే తప్ప, ఇరాన్ తరపున యుద్ధం చేయడం లేదు. యుద్ధం మొదటిరోజు చేసిన గంభీర ప్రకటనలు కాస్తా మూడు, నాలుగు రోజులకు మధ్యవర్తి పాత్రకు పరిమితమయ్యాయి. రష్యా అధ్యక్షుడు పుతిన్, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుతో యుద్ధం వల్ల జరుగుతున్న నష్టాలపై వివరించినా.. ఇజ్రాయెల్ మాత్రం ఇరాన్‌లో చివరి క్షిపణిని ధ్వంసం చేయడంతో పాటు హౌతి, హెజ్బొల్లాలను నిర్వీర్యం చేసే వరకు దాడులు కొనసాగిస్తామని స్పష్టం చేసింది. దీంతో ఈ యుద్ధం ఏప్రిల్ నెల మధ్య వరకు ఆగేలా లేదు.

చైనాకు ఇరాన్ ఒక చౌక చమురు వనరు మాత్రమే.. ఇరాన్‌తో 25 ఏళ్ల ఒప్పందం చేసుకున్నప్పటికీ, అమెరికా తో నేరుగా సైనిక ఘర్షణకు దిగడం చైనాకు ఇష్టం లేదు.. చైనా ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం ఒడిదుడుకుల్లో ఉంది. అమెరికా ఆంక్షలకు భయపడి, చైనా బ్యాంకులు ఇరాన్‌తో లావాదేవీలను నిలిపివేస్తున్నాయి. చైనా ఇరాన్ విషయంలో ఒక్క అడుగు ముందుకు వేసినా.. ప్రపంచవ్యాప్తంగా చైనా ఆస్తులను సీజ్ చేసేందుకు అమెరికాకు తాళం ఇచ్చినట్టు అవుతుంది. ఇరాన్ సార్వభౌమాధికారాన్ని, దేశ భద్రతకు భంగం కలిగించడాన్ని తాము సహించమని మొదటిరోజు చేసిన తీవ్రమైన ప్రకటన కాస్తా మూడు, నాలుగు రోజులకే చల్లబడింది. అయితే, అమెరికా మాత్రం చైనా రంగంలోకి దిగితే ఎక్కడ పరిస్థితి మారుతుందోనన్న భయంతో అఫ్గాన్ – పాక్ యుద్ధానికి తెర లేపింది. ఎందుకంటే చైనా ఇరాన్ సరిహద్దుల మధ్య అఫ్గాన్, పాక్ దేశాలు ఉంటాయి. ఆయుధాలు, ఇతర సామగ్రి సరఫరా చేసేందుకు సముద్ర జలాలు అంత సురక్షితం కాకపోవడంతో రోడ్డు మార్గాన చేరే వేసే అవకాశం ఉంటుంది. అందుకే అమెరికా ఇరాన్ యుద్ధానికి ముందు అఫ్గాన్, పాక్ మధ్య ఘర్షణ వాతావరణం సృష్టించింది. భారత్‌కు అటు ఇజ్రాయెల్ అత్యంత సన్నిహిత రక్షణ మిత్రుడు, ఇటు ఇరాన్ చారిత్రక.. వ్యూహాత్మక భాగస్వామి. ఉగ్రవాద వ్యతిరేక పోరాటంతో పాటు సాంకేతిక పరిజ్ఞానం విషయంలో భారత్ ఇజ్రాయెల్‌కు మద్దతుగా ఉంటుంది. మరోవైపు ఇరాన్‌లోని చాబహార్ ఓడరేవు భారత్‌కు ఇరాన్ ద్వారా ఆఫ్ఘనిస్తాన్, రష్యాకు దారిని ఇస్తుంది. అందుకే భారత్ ఇరాన్ యుద్ధం విషయంలో వ్యూహాత్మక మౌనాన్ని పాటిస్తున్నది. ఇప్పుడు భారత్‌కు అన్నింటికంటే ముఖ్యమైనది.. ఇండియా మిడిల్ ఈస్ట్, యూరప్ ఎకనామిక్ కారిడార్ (ఐఎంఈసీ). ఇది భారత్ కలల ప్రాజెక్టు.. ఇది పూర్తయితే మిడిల్ ఈస్ట్ దేశాలతో పాటు యూరప్ వరకు భారత్ తన వ్యాపారాన్ని విస్తరిస్తుంది. ఇది ఇజ్రాయెల్ మీదుగా కొనసాగుతుండటంతో ఆ దేశం పూర్తి మద్దతు అవసరం ఉన్నది. అందుకే భారత్ ఇప్పటివరకు ఏ పక్షం వహించకుండా, 'చర్చల ద్వారానే పరిష్కారం' అని చెప్తూ వస్తున్నది. యుద్ధం వల్ల సమీకరణాలు మారితే ఈ ప్రాజెక్ట్ ఆగిపోయే ప్రమాదం ఉంది. ఈ కారిడార్‌ను కాపాడుకోవడానికి అమెరికా, సౌదీ అరేబియాతో భారత్ కలిసి పని చేయాల్సి ఉంటుంది. మరోవైపు యుద్ధం తర్వాత ఇరాన్‌లో పాలన గాడితప్పి.. చైనాపై ఆ దేశం ఆధారపడినా భారత్ కలలకు గండిపడే అవకాశం ఉన్నది. అందుకే ఈ వ్యవహారాన్ని భారత్ అత్యంత సున్నితమైన అంశంగా భావిస్తున్నది. మార్చి మూడో వారంలో లేదా ఏప్రిల్ మొదటి వారంలో భారత్ ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య మధ్యవర్తి పాత్ర పోషించే అవ కాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అందుకే గురువారం ఇరాన్ హోర్ముజ్ జలసంధి నుంచి భారత్, చైనాలకు చమురు సరఫరాకు అంగీకరించింది. ఇరాన్ విషయంలో భారత్ మిత్ర ధర్మం పాటించకపోవడానికి మరో ముఖ్యమైన కారణం.. అరబ్ దేశాల్లో ప్రవాస భారతీయులు. వీరు దాదాపు 90 లక్షల మంది ఉన్నారు. యుద్ధంలో ఒకవైపు నిలబడితే వారందరి జీవనోపాధిని ఫణంగా పెట్టడమే అవుతుంది. ఒక్క రాజకీయ నిర్ణయం కోటి మంది కుటుంబాల్లో కల్లోలం రేపే ప్రమాదం ఉన్నది. భారత్‌కు మిత్రదేశం ఏది? అని దేశంలో ఎవరిని అడిగినా ముందుగా రష్యా అనే చెప్తారు. కానీ, ఇదంతా ఒకప్పటి మాట.. ఇప్పుడు ఏ దేశమైనా సొంత కాళ్లపై నిలబడాల్సిందే.. సొంత కండబలంతో శత్రువుకు బుద్ధి చెప్పా ల్సిందే. కష్టకాలంలో ఎవరో వస్తారని ఎదురు చూసే రోజు లు ఇప్పుడు కావని అర్థం చేసుకోవాలి. అగ్రరాజ్యాల నీడలో ఎదిగే శక్తులు, తుఫాను వచ్చినప్పుడు ఆ నీడ మాయమ వుతుందని గ్రహించాలి. ఇరాన్ యుద్ధం ముగింపు ఎలా ఉన్నా, 'అంతర్జాతీయ స్నేహం' అనే మాటకు ఇప్పుడు అర్థం పూర్తిగా మారిపోయింది. మూడో ప్రపంచ దేశాలన్నీ ఈ పరిమాణాలను ఓ గుణపాఠంలా తీసుకోవాలి.

# పెన్షన్లు ఇవ్వడానికి నిధులు లేవని సాకులు చెబుతున్నారు

- మొదటి పేజీ తరువాయి

ప్రకటన చేయగా, దీనిపై కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ 'ఎక్స్' వేదికగా తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ప్రభుత్వ ప్రాధాన్యతలు ఎటు వెళుతున్నాయో అర్థం కావడం లేదని ఆయన మండిపడ్డారు. బండి సంజయ్ తన విమర్శల్లో ప్రధానంగా కాలేజీ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రస్తావించారు. ఓవైపు వేల కోట్ల ఫీజులు పెండింగ్‌లో ఉన్నాయని, దీని కారణంగా విద్యార్థులు ఇబ్బందులు పడుతుంటే... మరోవైపు, అవేమీ పట్టించుకోకుండా ఉచిత ఈవీ స్కూటర్లు ఇస్తామని వాగ్దానాలు చేయడం ప్రజలను వంచించడమేనని ధ్వజమెత్తారు. దళితులు, గిరిజనులకు పంపిణీ చేయడానికి భూములు లేవని చెబుతున్న ప్రభుత్వం, జర్నలిస్టులు, మూసీ బాధితులకు ఫ్యూచర్ సిటీలో స్థలాలు ఎలా ఇస్తుందని ఆయన ప్రశ్నించారు. పెన్షన్లు ఇవ్వడానికి నిధులు లేవని సాకులు చెబుతున్నారని... మరి, మూసీ ప్రాజెక్టు కోసం వేల కోట్లు ఎక్కడి నుంచి వస్తున్నాయని నిలదీశారు. రాష్ట్రంలో పాలన గాడి తప్పిందని బండి సంజయ్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రజలకు దోమల బెడద పెరిగిందని... ప్రజలు తమ పని తాము చేసుకుంటున్నా, కాంగ్రెస్ నేతలు దోమల్లా వచ్చి ఇబ్బంది పెడుతున్నారని ఘాటు వ్యాఖ్యలు చేశారు.

# తెలంగాణలో సారా దుకాణాలను తెరవాలి

జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఈరోజు సచివాలయంలో మీడియా ప్రతినిధులతో నిర్వహించిన చిట్ చాట్‌లో చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. రాబోయే బడ్జెట్ అసెంబ్లీ సమావేశాల్లో తాను ఒక 'బాంబు' పేల్చబోతున్నానని చెప్పారు. గతంలో స్వచ్ఛమైన సారా తాగిన వారు 115 ఏళ్ల వరకు ఆరోగ్యంగా బతికేవారని, కానీ ఇప్పుడు లిక్కర్ తాగి 80 ఏళ్లకే చనిపోతున్నారని ఆయన అన్నారు. శాస్త్రీయంగా చూస్తే సారా ఆరోగ్యానికి హానికరం కాదని ఆయన వాదించారు. అసలు తెలంగాణలో సారాను ఎందుకు నిషేధించారో ప్రభుత్వం క్లారిటీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో 'జీరో అవర్'లో ఈ అంశాన్ని లేవనెత్తుతానని, సారా దుకాణాలను మళ్లీ తెరవాలని కోరతానని చెప్పారు. మధ్యప్రదేశ్, ఒడిశా వంటి రాష్ట్రాల్లో ప్రభుత్వాలే అధికారికంగా సారా దుకాణాలను నడుపుతున్నాయని, అదే తరహాలో తెలంగాణలో కూడా ఎందుకు అమలు చేయకూడదని ఆయన ప్రశ్నించారు.

# ఆడబిడ్డల కన్నీళ్లు మీకు మంచిది కాదు

ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో ఇళ్ల కూల్చివేతల బాధితులను తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఇవాళ పరామర్శించారు. ఇళ్లు కోల్పోయి కన్నీరు పెట్టుకుంటున్న మహిళలను చూసి ఆమె చలించిపోయారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. ఆడబిడ్డల దుఃఖం, వారి కన్నీళ్లు ప్రభుత్వానికి మంచిది కాదని హెచ్చరించారు.

"నేను టూరిస్ట్‌ను కాదు. మీ సమస్యకు పరిష్కారం చూపేవరకూ ఇక్కడే ఉండి పోరాడతా" అని కవిత బాధితులకు భరోసా ఇచ్చారు. జిల్లా కలెక్టర్, మంత్రులు తక్షణమే వెలుగుమట్లకు వచ్చి బాధితులతో మాట్లాడి, వారి సమస్యలకు పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. పేదల ఇళ్లపై బుల్డోజర్లు పంపడం అన్యాయమని మండిపడ్డారు. కొన్ని రాజకీయ పార్టీలు ఈ దుఃఖాన్ని కూడా రాజకీయం కోసం వాడుకుంటున్నాయని ఆమె ఆరోపించారు. గతంలో

బీఆర్ఎస్ వాళ్లు కూడా ఇళ్లు కూల్చడానికి ప్రయత్నాలు చేశారని కవిత అన్నారు. ఎక్కడైతే ఇళ్లు కూల్చివేశారో అక్కడే తిరిగి స్థలాలు ఇచ్చి, ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకు, సమస్యకు శాశ్వత పరిష్కారం దొరికేంత వరకు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తానని కవిత స్పష్టం చేశారు.

# రాహుల్ బంధు కింద రేవంత్ రెడ్డి రూ.1000 కోట్లు పంపిస్తున్నారు

- మొదటి పేజీ తరువాయి

ఆలోచించి జాగ్రత్తగా ఓటు వేయాలని సూచించారని తెలిపారు. రేవంత్ రెడ్డి మూడుసార్లు రైతుబంధును ఎగ్గొట్టారని విమర్శించారు. "నేను రుణమాఫీ చేశానని అనుకుంటున్నా, రైతుబంధు వేశానని అనుకుంటున్నా" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల అన్నారని, అసలు ఆయన ముఖ్యమంత్రేనా అని నిలదీశారు. మరి ముఖ్యమంత్రిగా మీరెందుకు ఉన్నారని ప్రశ్నించారు. రైతుబంధు వేస్తే, రుణమాఫీ ఇస్తే మీకు తెలియకుండా ఉండటమేమిటని అన్నారు. హైదరాబాద్‌లో దోమలు బాగా పెరిగిపోయాయని, కానీ నగరంలో చెత్తను మాత్రం తీయడం లేదని విమర్శించారు.

# శ్రమజీవుల పని ప్రదేశం భద్రమేనా!

మహబూబ్‌నగర్ జిల్లాలోని ఎస్ఎల్‌బిసి సొరంగం పనుల్లో నిమగ్నమై ప్రమాదం జరగడంతో ఎనిమిది మంది విగత జీవులు అయ్యారనే వార్త విని అందరం షాక్‌కు గురి అయ్యాం. భద్రీనాథ్ సమీపాన మంచును తొలగించే పనిలో నిమగ్నమైన 55 మంది సిబ్బంది గ్రేసియర్ విరిగిపడిన ఘటనలో 55 మంది మంచులో చిక్కుకున్నట్లు, అందులో 50 మందిని కాపాడినట్లు, నలుగురు మరణించి ఉంటారని, మరో ఐదుగురి ఆచూకీ దొరకలేదని తెలిసి విచారం వ్యక్తం చేశాం. ఈ విధమైన దుర్ఘటనలు తరుచుగా జరగడం సర్వసాధారణం కావడం సోచనీయం. ఇలా పని ప్రదేశాల్లో లేదా పరిశ్రమల్లో పని చేస్తున్న శ్రామికులు భద్రత కొరవడిన కారణంగా పలు సందర్భాల్లో ప్రమాదాలకు గురికావడం లేదా ప్రాణాలు సహితం కోల్పోవడం జరుగుతున్నది. పని ప్రదేశాల్లో ఇలాంటి ప్రాణాపాయ సంఘటనలను నివారించడానికి వృత్తిపరమైన భద్రత అంశాల పట్ల అప్రమత్తంగా ఉండాలని భావించి 04 మార్చి 1966న "నేషనల్ సేఫ్టీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా" ఏర్పడటానికి గుర్తుగా 1972 నుంచి ప్రతి ఏట "జాతీయ భద్రత వారోత్సవం" లేదా "నేషనల్ సేఫ్టీ వీక్"ను 04 నుంచి 10 మార్చి వరకు నిర్వహించడం ఆనవాయితీగా మారింది. 2026 జాతీయ భద్రత వారోత్సవాల ఇతివృత్తంగా "భద్రత పెంపొందించడానికి అవగాహన, సాధికారత కల్పన, భద్రతలో నిమగ్నం చేద్దాం" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహించడం జరుగుతోంది. వృత్తిపరంగా పని చేసే పరిశ్రమల్లో ప్రమాదాలు జరుగకుండా, ప్రమాదాలు జరిగినపుడు స్వల్ప నష్టాలు కూడా నమోదు కాకుండా ఉండడానికి కార్మికులకు అవసరమైన భద్రత పట్ల అవగాహన కల్పించడం, భద్రతా చర్యలను పెంచడం, ఉద్యోగులు, పౌర సమాజానికి కనీస అవగాహన కల్పించడమే లక్ష్యంగా జాతీయ భద్రత దినోత్సవం జరుపుకోవడం కొనసాగుతున్నది. జాతీయ భద్రత వీరోత్సవంతో పాటు "జాతీయ భద్రత దినోత్సవం"(నేషనల్ సేఫ్టీ డే)"ను కూడా 04 మార్చి రోజున నిర్వహిస్తున్నారు. వికసిత్ భారత్ లక్ష్యాలను సుసాధ్యం చేయడానికి వృత్తిపరమైన భద్రత కనీస అవసరం అని తెలుసుకుందాం. వృత్తిపరమైన భద్రత చర్యలు, ప్రమాదాల నివారణ జాగ్రత్తలు, సంబంధిత వర్గాలకు అవగాహనతో పాటు అవసర శిక్షణ కార్యక్రమాలను చర్చించడానికి జాతీయ భద్రత వారోత్సవాల వేదికలు

గత 55 ఏండ్లుగా ఉపయోగపడుతున్నాయి. నేటి డిజిటల్ యుగంలో పని ప్రదేశాలను సురక్షిత కేంద్రాలుగా మార్చడానికి నడుం బిగిద్దాం, స్వల్ప గాయాలు కూడా నమోదు కాని పరిస్థితులను కల్పిద్దాం.

# ఈశాన్య రాష్ట్రాల ప్రజలకు ఢిల్లీ సేఫ్ కాదు బీజేపీ ఎంపీ సంచలన వ్యాఖ్యలు

- మొదటి పేజీ తరువాయి

ఈ అంశాన్ని పార్లమెంటులో లేవనెత్తుతానని అన్నారు. ఈశాన్య ప్రాంతానికి చెందిన ప్రజల రక్షణకు బలమైన చట్టపరమైన చట్రాలు అవసరమని తెలిపారు. కేంద్ర ప్రభుత్వంతోపాటు బీజేపీ ప్రభుత్వం ఉన్న దేశ రాజధానిలో ఈశాన్య ప్రజలపై జరుగుతున్న దాడుల పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈశాన్య రాష్ట్రాల ప్రజలపై జాతి వివక్షత చూపడంతోపాటు దాడులు జరుగుతున్నాయని అన్నారు. ఢిల్లీలోనే కాదు, దేశవ్యాప్తంగా ఉన్న అన్ని మెట్రోపాలిటన్ నగరాల్లో కూడా ఈశాన్య ప్రాంతాల ప్రజలు జాతి వివక్ష, దాడులు, హత్యలను ఎదుర్కొంటున్నారని వాపోయారు. కేంద్ర హోంమంత్రిని కలిసి అట్రాసిటీ లాంటి చట్టాన్ని తీసుకురావాలని కోరతామని తపిర్ గావో అన్నారు.

# జమిలి ఎన్నికల వల్ల రాష్ట్ర ఎన్నికల ప్రాధాన్యత తగ్గుతుంది

వన్ నేషన్ వన్ ఎలక్షన్ (జమిలి ఎన్నికలు) వల్ల రాష్ట్ర ఎన్నికల ప్రాధాన్యత తగ్గిపోతుందని, కేంద్ర ప్రభుత్వం చేతుల్లోకి అధికారాలన్నీ వెళతాయని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ మండిపడ్డారు. జమిలి ఎన్నికల విధానంపై ఆయన స్పందిస్తూ, ఈ విధానం దేశానికి ఒక పరిష్కారం చూపిస్తుందేమో కానీ, అసలు సమస్య కంటే దారుణమైన పరిణామాలకు దారితీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. లోక్ సభకు, రాష్ట్రాలకు ఒకేసారి ఎన్నికలు జరపడమంటే భారతదేశ సమాఖ్య నిర్మాణం, ప్రజాస్వామ్య వైవిధ్యం దెబ్బతింటుందని అన్నారు. రాష్ట్రాలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు కాలరాసినట్లవుతుందని విమర్శించారు. జమిలి ఎన్నికలు జరిగితే జాతీయ స్థాయి పార్టీలకే ప్రయోజనం చేకూరుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాంతీయ సమస్యలు, ప్రజల మనోభావాలు పక్కకు వెళతాయని అన్నారు. కేవలం ఖర్చు తగ్గుతుందనే కారణంతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయకూడదని అన్నారు.

# అవి ప్రభుత్వ హత్యలే

రాజమండ్రిలో కల్తీ పాలు తాగి 11 మంది మరణించడంపై ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రంగా స్పందించారు. ఈ మరణాలను ప్రభుత్వ హత్యలుగా అభివర్ణించిన ఆమె, రాష్ట్ర ప్రభుత్వ నేరపూరిత నిర్లక్ష్యం, ఆహార భద్రతా వైఫల్యమే ఈ ఘోరానికి కారణమని ఆరోపించారు.

నేడు రాజమండ్రిలోని కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. ఇది ప్రమాదం కాదని, అధికారుల ఉదాసీనత వల్లే జరిగిందని అన్నారు. వరలక్ష్మి అనే పాల వ్యాపారి దాదాపు 11 ఏళ్లుగా ఎలాంటి లైసెన్స్ లేకుండా వ్యాపారం చేస్తున్నా, ఫుడ్ సేఫ్టీ అధికారులు చర్యలు తీసుకోకపోవడం దారుణమని విమర్శించారు. అధికారులకు తెలియకుండా ఇన్నేళ్లుగా అక్రమ వ్యాపారం ఎలా సాధ్యమైందని ఆమె ప్రశ్నించారు. ఇథిలీన్ గ్లైకాల్ కలిపిన పాలు తాగడం వల్లే పలువురు తీవ్ర అస్వస్థతకు గురయ్యారని, కొందరు వెంటిలేటర్‌పై ప్రాణాలతో పోరాడుతున్నారని షర్మిల ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పాలు, నెయ్యి, మద్యం, తాగునీరు సహా అన్ని నిత్యావసరాలు కల్తీమయం అవుతున్నా, సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రాజమండ్రి వంటి నగరానికి ఒక్కరే ఫుడ్ సేఫ్టీ అధికారి ఉండటం, ఆయన కూడా స్థానికంగా అందుబాటులో లేకపోవడం సిబ్బంది కొరతకు నిదర్శనమన్నారు. ఈ ఘటనకు ముఖ్యమంత్రి చంద్రబాబు నైతిక, పరిపాలనా బాధ్యత వహించాలని షర్మిల డిమాండ్ చేశారు. ఫుడ్ సేఫ్టీ విభాగంలో వెంటనే భారీగా నియామకాలు చేపట్టి, కఠిన తనిఖీలు నిర్వహించాలన్నారు. మృతుల కుటుంబాలకు ప్రకటించిన రూ. 10 లక్షల పరిహారాన్ని రూ. 25 లక్షలకు పెంచాలని కోరారు. బాధితులను మాజీ ముఖ్యమంత్రి జగన్ ఇప్పటివరకు పరామర్శించకపోవడం సరికాదని అన్నారు. సామాన్య ప్రజల పట్ల ఆయన వైఖరి ఏంటో దీని ద్వారా తెలు స్తోందని విమర్శించారు. ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కొని ఆహార భద్రతా నిబంధనలను కఠినంగా అమలు చేయకపోతే ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం అవుతాయని హెచ్చరించారు.

# ఇరాన్‌కు రష్యా పూర్తి అండగా ఉంటుంది

- మొదటి పేజీ తరువాయి

దురాక్రమ ణను తిప్పికొట్టడంలో ఇరాన్‌కు ముజ్తబా నాయకత్వం అవసరమని పుతిన్ పేర్కొన్నారు. ఇటీవల ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ ఖమేనీ సహా ఇతర అగ్రనేతల మృతిపై ఆయన తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ ఆంక్షలు, యుద్ధ మేఘాల మధ్య రష్యా-ఇరాన్‌ల మధ్య బలపడుతున్న ఈ వ్యూహాత్మక బంధం పశ్చిమాసియా రాజకీయ సమీకరణాలను వేగంగా మారుస్తోంది. రష్యా ఇస్తున్న ఈ బహిరంగ హామీ ఇరాన్‌కు అంతర్జాతీయ స్థాయిలో భారీ నైతిక బలాన్ని చేకూర్చనుంది.

# ఏపీ మద్యం కుంభకోణం కేసు.. ఈడీ దర్యాప్తు ముమ్మరం

- మొదటి పేజీ తరువాయి

ఈడీ విచారణకు హాజరయ్యారు. రెండు గంటల విచారణ తర్వాత కృష్ణమోహన్‌రెడ్డి వెళ్లిపోగా... ఇతర నిందితులను అధికారులు ప్రశ్నిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో మద్యం పాలసీని ఎలా రూపొందించారు? కేవలం నగదు రూపంలోనే లావాదేవీలు ఎందుకు నిర్వహించారు? అనే అంశాలపై ఈడీ అధికారులు ఆరా తీశారు. ముఖ్యంగా పాప్యులర్ బ్రాండ్లను కాదని, కొత్త బ్రాండ్లకు అనుమతులు ఇవ్వడం వెనుక ఉన్న కారణాలపై సమాచారాన్ని రాబట్టేందుకు ఈడీ అధికారులు ప్రయత్నించారు.. ఈ కుంభకోణం వల్ల ప్రభుత్వ ఖజానాకు సుమారు రూ. 4,000 కోట్ల నష్టం వాటిల్లిందని ఈడీ ప్రాథమికంగా అంచనా వేసింది. అక్రమ సొమ్మును షెల్ కంపెనీల ద్వారా మళ్లించి, తిరిగి నిందితుల ఖాతాల్లోకి చేరేలా ప్రణాళిక రచించినట్లు అధికారులు గుర్తించారు. ఇప్పటికే ఈ కేసులో నిందితులైన రాజ్ కెసిరెడ్డి, వాసుదేవరెడ్డి, చాణక్యలకు చెందిన రూ. 441 కోట్లకు పైగా విలువైన ఆస్తులను ఈడీ అటాచ్ చేసింది.

# రాజ్యసభ సభ్యులుగా వేం నరేందర్ రెడ్డి, అభిషేక్ సింఘ్వీ ఏకగ్రీవం

- మొదటి పేజీ తరువాయి

అందించారు. ఈ సందర్భంగా వేం నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, రాజ్యసభ సభ్యుడిగా అవకాశం కల్పించిన ఏఐసీసీ పెద్దలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ సమస్యలను రాజ్యసభలో, ఢిల్లీలో వినిపించి వాటిని పరిష్కరించే విధంగా కేంద్రంపై ఒత్తిడి తీసుకువస్తానని అన్నారు.

# లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన సైబర్ క్రైమ్ ఎస్సైలుద

- మొదటి పేజీ తరువాయి

ఎల్బీనగర్ సైబర్‌క్రైమ్ పోలీస్ స్టేషన్ కు చెందిన ఇద్దరు ఎస్సైలు ఏసీబీకి అడ్డంగా దొరికిపోయారు. ఒక కేసులో నిందితుడికి 41 నోటీసులు ఇచ్చేందుకు లంచం డిమాండ్ చేసి ఏసీబీ అధికారులకు చిక్కారు. వివరాల్లోకి వెళితే... ఎల్బీనగర్ సైబర్‌క్రైమ్ విభాగంలో పనిచేస్తున్న ఎస్ఐ బాబునాయక్, ఎస్ఐ ప్రమోద్ ఒక కేసు విషయంలో నిందితుడిని ఇబ్బంది పెట్టకుండా ఉండేందుకు, నోటీసులు ఇచ్చే ప్రక్రియను పూర్తి చేసేందుకు లక్ష రూపాయలను లంచంగా డిమాండ్ చేశారు. దీనిపై బాధితుడు అవినీతి నిరోధక శాఖ అధికారులను ఆశ్రయించడంతో వారు పక్కా ప్లాన్ వేశారు. ఫిర్యాదుదారు నుంచి ఆ లక్ష రూపాయల నగదును ఎస్ఐలు తీసుకుంటుండగా, మాటు వేసిన ఏసీబీ అధికారులు వారిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం ఎల్బీనగర్ సైబర్‌క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో ఏసీబీ బృందాలు విస్తృతంగా సోదాలు నిర్వహించాయి.

# గచ్చిబౌలిలో కల్తీ మాఫియా గుట్టు రట్టు.. రూ.21 లక్షల నకిలీ పదార్థాలు స్వాధీనం

**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ గచ్చిబౌలిలో పోలీసులు కల్తీ మాఫియా గుట్టురట్టు చేశారు. 5 వేల లీటర్ల కల్తీ వంటనూనె, 5 టన్నుల కల్తీ గోధుమ పిండి స్వాధీనం చేసుకున్నారు. మొత్తం రూ.21 లక్షల విలువ చేసే నకిలీ పదార్థాలను సీజ్ చేశారు. గచ్చిబౌలిలోని ఓ గోదాములో కల్తీ ఆహార పదార్థాలు ఉన్నట్లు సమాచారం అందుకున్న ఎస్ఓటీ పోలీసులు దాడులు నిర్వహించారు. నిత్యావసరాలు కల్తీ చేస్తున్న ఇద్దరిని అరెస్టు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



# పెన్ పవర్ తెలంగాణ రౌండప్

- కుత్బుల్లాపూర్ సమస్యలు కూన శ్రీశైలం గౌడ్ దృష్టికి తీసుకెళ్లండి: రేవంత్‌రెడ్డి..
- మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం..
- స్థానిక సమస్యలను సమన్వయంతో పరిష్కరించాలని సూచన..
- కూకట్‌పల్లి నల్లకుంట చెరువు ప్రారంభోత్సవంలో సీఎం వ్యాఖ్యలు..
- అభివృద్ధి పనుల్లో ప్రజల భాగస్వామ్యం అవసరమని సీఎం అభిప్రాయం..

# సీఎం రేవంత్‌రెడ్డి 'నోట'... శ్రీశైలంగౌడ్ 'మాట'



కూకట్‌పల్లి నల్లకుంట చెరువు కార్యక్రమంలో ప్రసంగిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి..



కూనా శ్రీశైలం గౌడ్.. కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే..

## సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ముఖ్యమంత్రి స్పీచ్ వీడియో..

**కుత్బుల్లాపూర్, పెన్ పవర్, మార్చి 9:** హైదరాబాద్ పరిధిలోని కూకట్‌పల్లి ప్రాంతంలో నల్లకుంట చెరువు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కుత్బుల్లాపూర్ సమస్యలపై చేసిన వ్యాఖ్యలు ఆ ప్రాంత కాంగ్రెస్ వర్గీయుల్లో చర్చనీయాంశంగా మారింది.. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఎలాంటి మౌలిక సదుపాయాలకు సంబంధించిన సమస్యలు ఉన్నా వాటిని స్థానిక మాజీ ఎమ్మెల్యే కూనా శ్రీశైలంగౌడ్ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని ప్రజలకు సూచించారు.. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ ప్రాంత అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని సీఎం పేర్కొన్నారు. రహదారులు, డ్రైనేజ్ వ్యవస్థ, తాగునీరు, కాలువల అభివృద్ధి వంటి మౌలిక సదుపాయాల విషయంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రజలకు ఎదురయ్యే సమస్యలను స్థానిక నాయకత్వం ద్వారా ప్రభుత్వానికి తెలియజేస్తే త్వరితగతిన పరిష్కరించేందుకు వీలు ఉంటుందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు..

## చెరువులు- నాలాల సంరక్షణపై ఫిర్యాదు చేయండి:సీఎం..

నగర అభివృద్ధిలో చెరువుల సంరక్షణ, పునరుద్ధరణకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. నగరంలో పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో చెరువులు కీలక పాత్ర పోషిస్తాయని, అందుకే వాటి అభివృద్ధి పనులను దశలవారీగా చేపడుతున్నామని చెప్పారు.. కూకట్‌పల్లి నల్లకుంట చెరువు అభివృద్ధి పనులు పూర్తయితే స్థానిక ప్రజలకు మెరుగైన వాతావరణం, వినోదం కోసం అవసరమైన సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు..

# 'అడ్డు' తొలిగింది.. 'రోడ్డు' పడింది..

"బాచుపల్లి-మల్లంపేట్" నడుమ 5 కిలోమీటర్లు తగ్గిన ప్రయాణ దూరం..!





- కోర్టు ఉత్తర్వులు ప్రకారం అడ్డుగోడను తొలగించిన హైడ్రా..
- ఔటర్ రింగ్ రోడ్డు ఎగ్జిట్-4 నిర్మాణంతో మల్లంపేట్‌లో ట్రాఫిక్ జామ్‌లు..
- అడ్డుగోడ తొలగిస్తే 3 కిలోమీటర్లేనట.. లేదంటే 8 కిలోమీటర్లు ప్రయాణం..
- మల్లంపేట్ ఓల్డ్ హైదరాబాద్ రోడ్డు నక్షలో ఉన్నప్పటికీ నిర్మాణానికి జాప్యం..
- ప్రణీత్ అంటీలియా వెంచర్ నిర్మాణ దశలో అధికారుల పర్యవేక్షణ నిర్లక్ష్యం..
- అధికారుల విధుల నిర్వహణ నిర్లక్ష్యం నేడు సమస్యగా మారిన వైనం..

-5 లో

# ప్రణీత్ ఆంటీలియాలో..! ఉద్రిక్తత..!

## భారీ పోలీసు భద్రత నడుమ ప్రహరీ గోడపై హైడ్రా బుల్డోజర్‌లు..!



- 'మల్లంపేట్-బాచుపల్లి' నడుమ 100 ఫీట్ల రోడ్డు కోసం హైడ్రా కూల్చివేత..
- ప్రణీత్ ఆంటీలియా గ్రేటెడ్ కమ్యూనిటీలో హైడ్రా చర్యలు..
- అంటీలియా గేటెడ్ కమ్యూనిటీ కాదని, పలువురి వాదన..
- ఓఆర్ఆర్ ఎగ్జిట్--4 దారి పేరుతో ప్రహరీ గోడ కూల్చివేతపై ఆరోపణలు..
- నోటీసుకు లాయర్ ద్వారా రిప్లై ఇచ్చినా పట్టించుకోలేదని బాధితుల వాదన..
- ముందస్తు సమాచారం లేకుండా చర్యలపై కాలనీ వాసుల ఆగ్రహం..
- రోడ్డెక్కి నిరసనకు దిగిన ప్రణీత్ అంటీలియా కమ్యూనిటీ సభ్యులు..

- బుల్డోజర్‌లను అడ్డుకున్న బాధితులకు.. పోలీసులకు- తోపులాట..
- చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా అధికారుల తీరు..
- దాదాపు 14 ఏళ్ళ తర్వాత ఇక్కడో రోడ్డు ఉన్నట్టు గుర్తుకు వచ్చిందని ఎద్దేవా..
- కాలనీ నిర్మాణ సమయంలో "ఈఆక్షలు, ఈరోడ్డు" ఎక్కడ పోయిందని ఆగ్రహం..
- అప్పుడు ప్రణీతతో దోస్తీ చేసినోళ్ళు..! ఇప్పుడు మరొకరి కోసం కుస్తీ..!
- కొందరు వెంచర్ నిర్మాణ దారుల లబ్ధి కోసమే ఈ చర్యలు అంటూ ఆరోపణలు..
- హైకోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ దౌర్జన్యంగా చర్యలు అంటున్న బాధితులు..

-4 లో



01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# వరంగల్‌కు 100.. నిజామాబాద్‌కు 51 ఈ-బస్‌ల మంజూరు



**హైదరాబాద్ పెన్ పవర్::** ప్రధానమంత్రి ఈ-బస్ సేవ పథకం కింద తెలంగాణకు 151 విద్యుత్తు బస్సులు మంజూరు చేసినట్లు కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ సహాయమంత్రి టోకన్ సాహు తెలిపారు. ఇందులో వరంగల్‌కు 100, నిజామాబాద్‌కు 51 మంజూరు చేసినట్లు చెప్పారు. సోమవారం రాజ్యసభలో కాంగ్రెస్ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ అడిగిన ప్రశ్నకు ఆయన బదులిచ్చారు. ఈ పథకం కింద నిధుల కేటాయింపు అన్నది ఈ-బస్‌లకు అనుబంధమైన మౌలిక వసతుల అభివృద్ధి కోసం రాష్ట్రస్థాయి స్టీరింగ్ కమిటీ ద్వారా ప్రతిపాదనలపై ఆధారపడి ఉంటుందన్నారు. దీనికి సంబంధించి తెలంగాణ ప్రభుత్వం

-6 లో

# ప్రణీత్ ఆంటీలియాలో..! ఉద్రిక్తత..!

## భారీ పోలీసు భద్రత నడుమ ప్రహరీ గోడపై హైడ్రా బుల్డోజర్‌లు..!


కాలనీవాసులని పోలీసులు తీసుకెళ్ళే దృశ్యం..


బాచుపల్లి ప్రణీత్ అంటీలియాలో రోడ్డుకు అడ్డుగా ఉన్న ప్రహరీగోడ తొలగిస్తున్న హైడ్రా..


హైడ్రా కూల్చివేతలు అడ్డుకున్న స్థానికులు.. పోలీసులు పక్కకు తీసుకెళ్తున్న దృశ్యం..

- బుల్డోజర్‌లను అడ్డుకున్న బాధితులకు.. పోలీసులకు- తోపులాట..
- చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా అధికారుల తీరు..
- దాదాపు 14 ఏళ్ళ తర్వాత ఇక్కడో రోడ్డు ఉన్నట్టు గుర్తుకు వచ్చిందని ఎద్దేవా..
- కాలనీ నిర్మాణ సమయంలో "ఈఆక్షలు, ఈరోడ్డు" ఎక్కడ పోయిందని ఆగ్రహం..
- అప్పుడు ప్రణీతతో దోస్తీ చేసినోళ్ళు..! ఇప్పుడు మరొకరి కోసం కుస్తీ..!
- కొందరు వెంచర్ నిర్మాణ దారుల లబ్ధి కోసమే ఈ చర్యలు అంటూ ఆరోపణలు..
- హైకోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ దౌర్జన్యంగా చర్యలు అంటున్న బాధితులు..

- 'మల్లంపేట్-బాచుపల్లి' నడుమ 100 ఫీట్ల రోడ్డు కోసం హైడ్రా కూల్చివేత..
- ప్రణీత్ ఆంటీలియా గ్రేటెడ్ కమ్యూనిటీలో హైడ్రా చర్యలు..
- అంటీలియా గేటెడ్ కమ్యూనిటీ కాదని, పలువురి వాదన..
- ఓఆర్ఆర్ ఎగ్జిట్-4 దారి పేరుతో ప్రహరీ గోడ కూల్చివేతపై ఆరోపణలు..
- నోటీసుకు లాయర్ ద్వారా రిప్లై ఇచ్చినా పట్టించుకోలేదని బాధితుల వాదన..
- ముందస్తు సమాచారం లేకుండా చర్యలపై కాలనీ వాసుల ఆగ్రహం..
- రోడ్డెక్కి నిరసనకు దిగిన ప్రణీత్ అంటీలియా కమ్యూనిటీ సభ్యులు..


అడ్డుకున్న ప్రణీత్ అంటీలియా మహిళను పోలీసులు పక్కకు తీసుకెళ్ళే చిత్రం..


రోదిస్తున్న ప్రణీత్ అంటీలియా కాలనీ మహిళ..




భారీ పోలీసుల మోహరింపు..

మేడ్చల్ జిల్లా బ్యూరో, మార్చి 9 (పెన్ పవర్): కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని బాచుపల్లి ప్రాంతంలో ఉన్న ప్రణీత్ ఆంటీలియాలో అడ్డుగా ఉన్న ప్రహరీగోడను హైడ్రా కూల్చివేతల్లో సోమవారం ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది.. బాధితుల ఆక్రందనలు- రోదనలు ఆకాశాన్ని అంటాయి.. ముందస్తుగా సమస్యను గుర్తించిన హైడ్రా అధికారులు.. పోలీస్ భద్రతా బలగాలను రంగంలోకి దింపారు.. ఆ తర్వాతే హైడ్రా బుల్డోజర్‌లు కూల్చివేతలకు ఉపక్రమించాయి.. అయితే ప్రణీత్ అంటీలియా కాలనీవాసులు బుల్డోజర్‌లను అడ్డుకుని కూల్చివేతల వద్ద బైటాయించారు. దీంతో పోలీసులకు, కాలనీ వాసులకు కొంత తోపులాట జరిగింది.. స్వల్పంగా ఉద్రిక్తత చోటుచేసుకుంది.. ప్రణీత్ అంటీలియా కమ్యూనిటీ వాసులు తీవ్రంగా ఆవేదన చెందారు.. మున్సిపల్ పరిధిలో ఉన్న తమ కాలనీకి సంబంధించిన అన్ని పన్నులు క్రమం తప్పకుండా చెల్లిస్తూ ఉన్నప్పటికీ..! ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా, హైడ్రా అధికారులు కమ్యూనిటీ ప్రహరీ గోడను కూల్చివేయడం అన్యాయమని వారు ఆరోపించారు.. కాలనీవాసుల వివరాల ప్రకారం, హైడ్రా అధికారులు ఉదయం అకస్మాత్తుగా కాలనీలోకి చేరుకుని ప్రహరీ గోడను యంత్రాలతో కూల్చివేశారు. కమ్యూనిటీ లోపలి నుంచి "ఔటర్ రింగ్ రోడ్" (ఓఆర్ఆర్) ఎగ్జిట్--4 వరకు రహదారి ఏర్పాటు చేయాల్సి ఉందని చెబుతూ ఈ చర్యకు పాల్పడ్డారని స్థానికులు పేర్కొన్నారు. ఈ చర్యతో కాలనీలో నివసిస్తున్న కుటుంబాలు తీవ్ర ఆందోళనకు గురయ్యాయని చెప్పారు..

## సమయం ఇవ్వకుండా చర్యలు తీసుకున్నారు: బాధితులు..


ఈ అంశంపై ఇప్పటికే శనివారం హైడ్రా అధికారులు కాలనీ అసోసియేషన్‌కు నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. అయితే ఆ నోటీసులకు స్పందిస్తూ తాము తమ లాయర్ ద్వారా అధికారులకు లిఖితపూర్వక సమాధానం పంపించినప్పటికీ, దానిని పరిగణనలోకి తీసుకోకుండా అధికారులు తొందరపడి చర్యలు చేపట్టారని ఆరోపించారు.. సమాధానం పరిశీలించేందుకు సమయం ఇవ్వకుండా ఈ విధంగా గోడను కూల్చివేయడం సరైనది కాదని కాలనీవాసులు అభిప్రాయపడ్డారు..

వెంచర్ నిర్వహకులకు, బిల్డర్‌లకు, అక్రమ నిర్మాణ దారులకు, అధికారులకు ఉన్న అవినాభావ సంబంధం ఎప్పటికీ విడదీయలేని బంధంగా పేర్కొనవచ్చు.. అందుకు బలమైన కారణాలు కోకొల్లలు.. వెంచర్ నిర్వహకుల పరిధిలో ఉన్నంతవరకు, "అటు అధికార యంత్రాంగం- ఇటు రాజకీయ నాయకుల" అండదండలు పుష్కలంగా లభిస్తాయి.. కొనుగోలు దారులకు "ప్లాట్‌లు" అప్పగించిన తర్వాతే అసలైన "పాట్లు" మొదలవుతాయని సోమవారం హైడ్రా కూల్చివేతలు స్పష్టతను ఇస్తున్నాయి.. ప్రణీత్ అంటీలియా తోపాటు- పక్కనే ఉన్న "శ్రీ లక్ష్మీ శ్రీనివాస కన్‌స్ట్రక్షన్"కు కూడా..! గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో, వెంచర్ నిర్వహకులు, బిల్డర్‌లకు అధికారులు.. రాజకీయ నాయకులు దోస్తీ చేసినోళ్ళు, ఇప్పుడు బాధితులతో కుస్తీ పడుతున్నారని ఆరోపణలు వస్తున్నాయి.. ఈ ఓల్డ్ హైదరాబాద్ రోడ్డు అప్పుడు ఎక్కడికి పోయింది..? ఈ రోడ్డు ఇప్పుడే కొత్తగా మొలిచిందా..? అంటూ బాధితులు ప్రశ్నిస్తున్నారు.. ప్రణీత్ అంటీలియా వెంచర్ నిర్మాణ సమయంలోనే అడ్డుకుని ఉంటే..! నేడు ఈ ఉద్రిక్తతలకు అవకాశం ఉండేదా..? బాధితులపై భారం పడేదా..? ఈ అడ్డుకోవడం అప్పుడే ఉంటే..? మరోచోట కొనుక్కునే వాళ్ళమని బాధితులు రోదించారు.. దీనంతటికీ అక్రమ వెంచర్ నిర్వాహకులకి సహకరించిన అధికారులు, రాజకీయ నాయకులే కీలక సూత్రదారులుగా బాధితులు ఆరోపిస్తున్నారు..


హైడ్రా కూల్చివేతలకు అంటీలియా వాసుల ధర్నా..

## కంటతడి పెట్టిన కాలనీ వాసులు..

ప్రహరీ గోడ కూల్చివేతపై ప్రణీత్ ఆంటీలియా కమ్యూనిటీ వాసులు పెద్ద సంఖ్యలో రోడ్డుపైకి వచ్చి నిరసన వ్యక్తం చేశారు.. అధికారులు కాలనీ వాసుల అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోకుండా చర్యలు తీసుకోవడం, అడ్డొచ్చిన వారిపై పోలీసులతో అడ్డుకోవడాన్ని మీడియాతో ప్రస్తావిస్తూ మహిళలు కంటతడి పెట్టారు.. ఇప్పటికైనా తమ కమ్యూనిటీకి సంబంధించిన హక్కులు, భద్రత విషయంలో అధికారులు ఒక స్పష్టతను ఇవ్వాలని, సమస్యకు తక్షణ పరిష్కారం చూపాలని కాలనీవాసులు డిమాండ్ చేశారు. అవసరమైతే చట్టపరమైన పోరాటాన్ని కూడా కొనసాగిస్తామని హెచ్చరించారు..



# 40 డిగ్రీలు దాటేసిన ఎండలు

**ఖమ్మం, మార్చి 9, పెన్ పవర్:** తెలంగాణలో భానుడు నిప్పుల వర్షం కురిపిస్తున్నాడు. చాలా ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటుతున్నాయి. నేడు కూడా పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు గరిష్ఠ స్థాయికి చేరుకుంటాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణశాఖ అధికారులు సూచిస్తున్నారు. ఈ ఏడాది ఎండలు మండిపోతాయని.. వడ గాలులు వీచే అవకాశం ఉన్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అంటున్నారు.తెలంగాణలో భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. మార్చి మెదటి వారంలోనే నిప్పుల వర్షం కురిపిస్తున్నాడు. భానుడి భగభగలు, తీవ్ర ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఉదయం 8 గంటల నుంచే సూర్యుడు సుర్రుమంటున్నాడు. పది తర్వాత రోడ్లపైకి రావాలంటేనే భయపడే పరిస్థితి ఏర్పడింది. ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుండి 3 డిగ్రీలు అధికంగా నమోదవుతున్నాయని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. నేడు (మార్చి 8) హైదరాబాద్ నగరంలో పాటు చాలా జిల్లాల్లో ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటుతాయని చెప్పారు.ఖమ్మం, మహబూబ్‌నగర్, నల్గొండ, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గరిష్ట ఉష్ణోగ్రతలు 33 డిగ్రీల సెంటిగ్రేడ్ నుంచి 40 డిగ్రీల సెంటిగ్రేడ్ వరకు నమోదయ్యే ఛాన్స్ ఉందని జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు. ఆకాశం పూర్తిగా నిర్మలంగా ఉండటం వల్ల సూర్యరశ్మి నేరుగా భూమిని తాకుతుందని.. మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు తీవ్రమైన ఉక్కపోత, వేడి ఎక్కువగా ఉంటుందన్నారు. ఆ సమయంలో బయటకు రాకుండా ఉంటేనే మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.తెలంగాణలోని ఉత్తర, తూర్పు జిల్లాల్లో ఎండ ప్రభావం మరీ ఎక్కువగా ఉండనుందని చెప్పారు. నిజామాబాద్, ఆదిలాబాద్, రామగుండం ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు ఇప్పటికే 36 డిగ్రీల మార్కును దాటాయని చెబుతున్నారు. నేడు ఈ జిల్లాల్లో పొడి గాలులు వీచే అవకాశం ఉందని.. ఇక్కడ కనిష్ట ఉష్ణోగ్రతలు కూడా సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతాయని చెబుతున్నారు. ఈ మేరకు ఎండ తీవ్రత నుంచి రక్షణ చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణిలు వడదెబ్బ తగలకుండా జాగ్రత్తగా ఉండాలంటున్నారు.ఆహారం విషయంలోనూ ప్రత్యేక శ్రద్ధ వహించాలని తేలికపాటి త్వరగా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవాలని పండ్ల రసాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వలంటున్నారు. దాహం వేయకపోయినా తరుచూ నీళ్లు తాగాలని తద్వారా శరీరం డీహైడ్రేషన్‌కు గురి కాదని అంటున్నారు. మసాలా ఫుడ్స్, మద్యం, సిగరెట్లకు దూరంగా ఉండాలని చెబుతున్నారు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

మల్లంపేట్‌లో ఓల్డ్ హైదరాబాద్ రోడ్డు పనులు ప్రణీత్ అంటీలియా వద్ద..



# 'అడ్డు' తొలిగింది... 'రోడ్డు' పడింది

సోమవారం ఓవైపు హైడ్రా కూల్చివేతలు..
మరోవైపు వెంటనే బీటి రోడ్డు నిర్మాణం..



- కోర్టు ఉత్తర్వులు ప్రకారం అడ్డుగోడను తొలగించిన హైడ్రా..
- ఔటర్ రింగ్ రోడ్డు ఎగ్జిట్-4 నిర్మాణంతో మల్లంపేట్‌లో ట్రాఫిక్ జామ్‌లు..
- అడ్డుగోడ తొలగిస్తే 3 కిలోమీటర్లేనట.. లేదంటే 8 కిలోమీటర్లు ప్రయాణం..
- మల్లంపేట్ ఓల్డ్ హైదరాబాద్ రోడ్డు నక్షలో ఉన్నప్పటికీ నిర్మాణానికి జాప్యం..
- ప్రణీత్ అంటీలియా వెంచర్ నిర్మాణ దశలో అధికారుల పర్యవేక్షణ నిర్లక్ష్యం..
- అధికారుల విధుల నిర్వహణ నిర్లక్ష్యం నేడు సమస్యగా మారిన వైనం..

## "బాచుపల్లి-మల్లంపేట్" నడుమ 5 కిలోమీటర్లు తగ్గిన ప్రయాణ దూరం..!

ప్రణీత్ అంటీలియాలో అడ్డంగా ఉన్న రోడ్డును తొలగిస్తున్న హైడ్రా బుల్డోజర్..



దుండిగల్ మండలం మల్లంపేట్‌లో ట్రాఫిక్ సమస్యకు హైడ్రా చెక్ పెట్టింది.. ఓల్డ్ హైదరాబాద్ రోడ్డుకు ప్రణీత్ ఆంటీలియాలో అడ్డుగా ఉన్న ప్రహరీగోడను తొలగిస్తే 3 కిలోమీటర్లు.. లేదంటే 8 కిలోమీటర్లు ప్రయాణించాల్సిన అవస్థలకు హైడ్రా చెక్ పెట్టింది.. తమది గేటెడ్ కమ్యూనిటీ అంటూ 40 ఫీట్ల రహదారిని మూసేసి నిర్మించిన ప్రహరీని హైడ్రా సోమవారం తొలగించింది. దీంతో 5 కిలోమీటర్లు అదనంగా ప్రయాణించాల్సిన భారం తగ్గించింది.. మల్లంపేట ప్రాంత నివాసితులకు ఊరట కలిగించింది.. ఔటర్ రింగు రోడ్డు ఎగ్జిట్ 4 నుంచి మల్లంపేట, బాచుపల్లి క్రాస్‌రోడ్స్ మీదుగా ప్రగతినగర్‌కు సులభంగా చేరుకునే మార్గం సుగమం చేసింది..

### హైకోర్టు మార్గదర్శకాల ప్రకారమే..

మల్లంపేటలో రహదారికి అడ్డంగా ప్రణీత్ ఆంటీలియా నిర్మించిన ప్రహరీపై హైడ్రాకు ఫిర్యాదు అందింది. రహదారికి ఆటంకాలు సృష్టించడంపై ప్రణీత్ ఆంటీలియా నిర్వాహకులకు హైడ్రా నోటీసులు ఇచ్చింది. హైడ్రా నోటీసుపై ప్రణీత్ అంటీలియా హైకోర్టును ఆశ్రయించారు.. "డ్యూ ప్రొసీజర్ ఫాలో అవ్వాలని హైకోర్టు హైడ్రాకు సూచించింది.. ఈ మేరకు ఇరుపక్షాలు పిలిచి చర్చించింది.. హెచ్‌ఎండిఏ అనుమతిచ్చిన లేఅవుట్ గేటెడ్ కమ్యూనిటీ కాదని హైడ్రా నిర్ధారించుకుని.. గేటెడ్ కమ్యూనిటీ నిబంధనల మేరకు రోడ్లుకూడా కేటాయింపులు జరగ లేదని హైడ్రా గ్రహించింది.. హైకోర్టు సూచనల మేరకు నోటీసులు యిచ్చి రోడ్డుకు అడ్డంగా నిర్మించిన ప్రహరీనీ సోమవారం హైడ్రా తొలగించింది.. వెంటనే హెచ్‌ఎండిఏ బిటి రోడ్డును కూడా వెంటనే చేపట్టి సోమవారం సాయంత్రానికి పూర్తి చేసిందని హైడ్రా అధికారులు తెలిపారు.. మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా దుండిగల్ మండలంలోని మల్లంపేట - బాచుపల్లి గ్రామాల మధ్య నెలకొన్న ఈ వివాదానికి తెరపడింది..



హైదరాబాద్ మహానగరంలో పెరుగుతున్న జనాభా తోపాటు, మాస్టర్ ప్లాన్ రోడ్లు ఆక్రమణలు ట్రాఫిక్ సమస్యలకు ప్రధాన కారణంగా మారుతున్నాయి.. ఒకప్పుడు మల్లంపేట్ విలేజ్ అయినప్పటికీ, కాలక్రమేణా తీవ్రమైన ట్రాఫిక్ జామ్‌లకు కేంద్రంగా మారింది.. దీనికి తోడు మల్లంపేట్ ఎగ్జిట్-4 నిర్మించిన తరువాత ట్రాఫిక్ సమస్య మరింత ఎక్కువైంది.. ప్రణీత్ అంటీలియా ప్రహరీగోడ తొలగింపుతో ఈ సమస్యకు కొంతవరకే పరిష్కారం చూపుతుంది.. రాబోయే కాలంలో ట్రాఫిక్ సమస్య కథ మొదటికే వచ్చే అవకాశం లేకపోలేదు.. ఇప్పటికైన మల్లంపేట్‌లో ఉన్న మాస్టర్ ప్లాన్ 100 ఫీట్ల రోడ్లు కాపాడితేనే భవిష్యత్తులో ట్రాఫిక్ ఇబ్బందులకు చెక్ పెట్టడానికి సులభంగా ఉంటుందని స్థానికులు కోరుతున్నారు..



మళ్ళీ వివాదాలకు తావివ్వకుండా శరవేగంగా బీటి రోడ్డు పనులు..

### 5 కిలో మీటర్లు తగ్గిన దారి..

మల్లంపేట ఔటర్ రింగురోడ్డు ఎగ్జిట్ నుంచి బాచుపల్లి క్రాస్ రోడ్స్ మీదుగా ప్రగతినగర్ కు కేవలం 3 కిలోమీటర్లు మాత్రమే ప్రయాణిస్తే సరిపోతోంది. కాని దారి మధ్యలో ప్రణీత్ ఆంటీలియాలో నిర్మించిన అడ్డుగోడతో 8 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వచ్చేది. సోమవారం ప్రహరీ తొలగడంతో ఆ దూరం 3 కిలోమీటర్లకు తగ్గింది. మల్లంపేట ఎగ్జిట్ నుంచి మల్లంపేట విలేజ్, ప్రణీత్ లీఫ్‌కాలనీ, ఆకాష్ వెంచర్, డ్రీం వ్యాలీ కాలనీ, గ్రీన్‌పార్కు కాలనీ, సాయినగర్ కాలనీ, బృందావన్ కాలనీ, ఏపీఆర్ కాలనీ, ఇందిరమ్మకాలనీ, లక్ష్మి శ్రీనివాస్ కాలనీ, హెచ్ ఎండీఏ, ప్రణీత్ ఆంటీలియా, బాచుపల్లి చౌరస్తా మీదుగా ప్రగతినగర్‌కు కేవలం 3 కిలోమీటర్ల రాజమార్గంలో రాడానికి అవకాశం లభించింది..

**దుండిగల్, పెన్ పవర్, మార్చి 9:** మల్లంపేట్- బాచుపల్లి నడుమ 100 ఫీట్ల మాస్టర్ ప్లాన్ రహదారి ఉన్నప్పటికీ, దుండిగల్ టౌన్‌ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యం 40 ఫీట్ల రోడ్డుకే పరిమితమైంది.. గత బీఆర్ఎస్ హయాంలో చోట నాయకునికి కూడా అధికార యంత్రాంగం దాసోహం గురించి అందరికీ తెలిసిందే..! రోడ్లను ఆక్రమించిన అక్రమ నిర్మాణాలకు, స్థానిక నేతల సిఫార్సులు, దుండిగల్ మున్సిపల్ నిధులు రూ.7.5 లక్షలతో నిర్మించిన సీసీరోడ్డుకు అడ్డంగా, మాజీ కౌన్సిలర్ మాదాసు వెంకన్న గేటు నిర్మాణంపై చర్యలు తీసుకోవాలంటే అధికారులకు చెమటలు పట్టి ఉద్యోగం నుండి తీసేస్తారో ఏమో అన్నంతగా భయపడి వదిలేశారు.. అదేచోట 100 ఫీట్ల రహదారి రోడ్డు విస్తరణ పనులను ఆ మాజీ కౌన్సిలర్ అడ్డుకున్నట్టు అధికారులు చెప్పిందే.. దౌర్భాగ్యం ఏమిటంటే, 100 ఫీట్ల రోడ్డు ఆక్రమణలను, అక్రమ కట్టడాలను అడ్డుకోకుండా, సెటిల్మెంట్‌లకే ప్రాధాన్యత ఇచ్చిన దుండిగల్ సర్కిల్ మున్సిపల్ అధికారులు.. చివరికి చేసేదేమిలేక "100 ఫీట్ల రోడ్డును- 40 ఫీట్ల రోడ్డుకే పరిమితం చేశారు.. అప్పుడు రోడ్డు ఆక్రమణలకు.. ఆతర్వాత రోడ్డు కుదింపుకు దుండిగల్ మున్సిపల్ అధికారులే కీలక పాత్ర..

# తీరప్రాంతాల భద్రతతో సుసంపన్న భారతం

**హైదరాబాద్ పెన్ పవర్:** 10 మార్చి 1969న "కేంద్రీయ పారిశ్రామిక భద్రత దళం" లేదా "సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సిఐఎస్ఎఫ్)" చట్టం ద్వారా ఏర్పడడంతో ప్రతి ఏట 10 మార్చిన "సిఐఎస్ఎఫ్ వ్యవస్థాపక దినం" పాటించుట ఆనవాయితీగా మారింది. కేంద్ర ప్రభుత్వ ప్రధాన సంస్థలైన విమానాశ్రయాలు, నౌకాశ్రయాలు, పవర్ ప్లాంట్లు, మెట్రో వర్క్స్, పారిశ్రామిక మౌళిక వనరులు, చమురు రిఫైనరీలు, స్టీల్ల ప్లాంట్లు, తీవ్రవాద అదుపు, సైబర్ భద్రత, అత్యవసర సేవలు, విప్పి భద్రత, ప్రభుత్వ సంస్థలు లాంటి పలు ప్రధాన భద్రతా విధులను నిర్వహిస్తున్న సిఐఎస్ఎఫ్ సేవలు అనిర్వచనీయం. ప్రారంభంలో 2,800 మంది సిబ్బందితో మొదలైన సిఐఎస్ఎఫ్ నేడు 1,48,371 మందితో అమూల్య భద్రత సేవలను విస్తరిస్తున్నారు. సిఐఎస్ఎఫ్ సిబ్బంది అంకితభావం, ధైర్య సాహసాలు, త్యాగాలను సిఐఎస్ఎఫ్ వ్యవస్థాపక దినం వేదికగా గుర్తించడం జరుగుతుంది. ప్రభుత్వరంగ సంస్థలతో పాటు ముఖ్య పరిశ్రమలకు నిరంతరం భద్రతను కల్పిస్తున్న సిబ్బంది నిస్వార్థ సేవలను ప్రస్తుతించడం మన కనీస కర్తవ్యం అని సదా భావించాలి. నేడు నిర్వహిస్తున్న 57వ సిఐఎస్ఎఫ్ వ్యవస్థాపక దినం-2026 ఇతివృత్తంగా "తీర ప్రాంత భద్రత, సుసంపన్న భారతం (సేఫ్ కోస్ట్: ప్రాస్పరస్ భారత్)" అనబడే అంశం తీసుకొని ప్రచారం చేయడం జరుగుతుంది. ఈ సందర్భంగా గుజరాత్, పశ్చిమ బెంగాల్‌ల నుంచి రెండు జట్లుగా 125 మంది సైక్లిస్టులు 6,553 కిమీ సైరిల్ ర్యాలీని 07 మార్చి నుంచి 31 మార్చి వరకు నిర్వహించి చివరకు కన్యాకుమారి చేరనున్నారు. సిఐఎస్ఎఫ్ వ్యవస్థాపక దినం వేదికగా వీరులకు సన్మానాలు, అవార్డుల వితరణలు, పెరేడ్లు, ప్రసంగాలు, కార్యశాలలు, అవగాహన కార్యక్రమాలు, ఉత్సవాలు నిర్వహించడం జరుగుతుంది. ఇదే వేదికగా యువతను భద్రతా సేవల వైపు ఆకర్షించడంతో పాటు ఆయా రంగాల్లో దాగిన ప్రమాదాలను కూడా అవగాహన చేసుకోవాలని ప్రచారం చేస్తారు. దేశ పౌరులు ఏ బాధ్యతాయుత విధులు నిర్వహించినా వారికి తగిన గుర్తింపుతో పాటు దేశాభివృద్ధి జరుగుతుందని గమనించాలి. సిఐఎస్ఎఫ్ సంస్థ సిబ్బంది సేవలను గుర్తిస్తూ, వారికి మన సంఘీభావాన్ని తెలియజేద్దాం.

# దానం పై వేటు... పక్కా ?

**హైదరబాద్, మార్చి9, పెన్ పవర్:**
ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత పిటీషన్ పై విచారణ ముగిసింది. స్పీకర్ గడ్డం ప్రసాదరావు తీర్పును రిజర్వ్ చేశారు. ఈరోజుతో అనర్హత ఎమ్మెల్యేల పిటీషన్లపై విచారణ ముగిసింది. మొత్తం పది మంది ఎమ్మెల్యేలు తమ పార్టీ నుంచి కాంగ్రెస్ లోకి మారినట్లు బీఆర్ఎస్ వారిపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ నేతలు సుప్రీంకోర్టును ఆశ్రయించారు.ఇప్పటి వరకూ ఎనిమిది మంది ఎమ్మెల్యేలు పార్టీ మారినట్లు ఆధారాలు లేవని స్పీకర్ గడ్డం ప్రసాదరావు తీర్పు చెప్పారు. ఇక కడియం శ్రీహరి, దానం నాగేందర్ విషయంలోనే తీర్పు చెప్పాల్సి ఉంది. అయితే కడియం శ్రీహరి విషయంలో ఏమో గాని దానం నాగేందర్ పై మాత్రం ఖచ్చితంగా అనర్హత వేటు పడే అవకాశాలున్నాయని చెబుతున్నారు.దానం నాగేందర్ తో పాటు కాంగ్రెస్ పార్టీ కూడా అందుకు సిద్ధమయినట్లే సమాచారం. సుప్రీంకోర్టులో కేసు ఉన్నందున దానం నాగేందర్ విషయంలో అనర్హత వేటు పడటం ఖాయమన్న అభిప్రాయం సర్వత్రా వినిపిస్తుంది. సాంకేతికంగా ఆధారాలుండటం వల్లనే దానం నాగేందర్ అనర్హత వేటు నుంచి తప్పించుకోలేరని న్యాయ నిపుణులు కూడా చెబుతున్నారు. 2023 లో జరిగిన తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో గెలిచిన ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ తర్వాత కాంగ్రెస్ పార్టీకి మద్దతుదారుగా నిలిచారు. అయితే మిగిలిన ఎమ్మెల్యేలు కూడా కండువాలు కప్పుకున్నప్పటికీ వారికి కాంగ్రెస్ పార్టీ సభ్యత్వం మాత్రం ఇవ్వలేదు. దానం నాగేందర్ విషయం మాత్రం



డిఫరెంట్.ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ మాత్రం బీఆర్ఎస్ గుర్తుపై ఎమ్మెల్యే ఎన్నికల్లో గెలిచి 2024 లోజరిగిన పార్లమెంటు ఎన్నికల్లో సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. దీంతో దానం నాగేందర్ సాంకేతికంగా కాంగ్రెస్ లో చేరినట్లేనని న్యాయనిపుణులు కూడా అభిప్రాయపడుతున్నారు. అందుకే తొలి నుంచి దానం నాగేందర్ ఒక్కరిపై వేటు పడే అవకాశాలున్నాయని ప్రచారం జరుగుతుంది. మరొకవైపు ఇప్పటికే హైదరాబాద్ నగరంలో కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచిన నేపథ్యంలో ఖైరతాబాద్ కు కూడా ఉప ఎన్నికలు జరిగే అవకాశం ఉందని మాత్రం రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతుంది. అయితే అనర్హత వేటుపడినా ఆరునెలల్లో ఉప ఎన్నిక జరగాల్సి ఉంటుంది. అయితే స్పీకర్ నిర్ణయం ఎలా ఉంటుందన్నది ఆసక్తికరంగా మారింది

# విజయడైరీకి ఏపీ కష్టాలు... పడిపోయిన నెయ్యి అమ్మకాలు




**హైదరబాద్, మార్చి 9, పెన్ పవర్:** తెలుగు రాష్ట్రాల్లో దశాబ్దాలుగా పాడి రైతులకు భరోసాగా, కోట్లాది మంది వినియోగదారులకు నాణ్యమైన పాల ఉత్పత్తులకు చిరునామాగా వెలుగొందిన 'విజయ' బ్రాండ్ నేడు తీవ్రమైన సంక్షోభంలో కూరుకుపోయింది. ఒకప్పుడు ప్రభుత్వ రంగ సంస్థగా తిరుగులేని ఆదరణ పొందిన ఈ సంస్థ, ప్రస్తుతం కల్తీ ఆరోపణలు, రాజకీయ వివాదాల సుడిగుండంలో చిక్కుకుని తన ఉనికిని కాపాడుకోవడానికి పోరాడుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో గత ప్రభుత్వ హయాంలో మొదలైన ఈ కల్తీ వ్యవహారం, ఇప్పుడు సరిహద్దులు దాటి తెలంగాణలోని విజయ డెయిరీ ప్రతిష్టను కూడా మసకబారుస్తోంది. కేవలం కొందరి స్వార్థం కోసం దశాబ్దాల చరిత్ర కలిగిన ఒక బ్రాండ్‌ను ఫ్రాంచైజీల పేరిట ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడమే ఈ వినాశనానికి మూలకారణమని విశ్లేషకులు భావిస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో విజయ డెయిరీ కార్యకలాపాలను విస్తరించే క్రమంలో ప్రవేశపెట్టిన ఫ్రాంచైజీ విధానం అక్రమార్కులకు వరంగా మారింది. ప్రభుత్వ పర్యవేక్షణ నామమాత్రంగా మారడంతో, నాణ్యతా ప్రమాణాలను గాలికి వదిలేసి కేవలం లాభాలే ధ్యేయంగా ఫ్రాంచైజీలు పనిచేశాయి. ఈ క్రమంలోనే తక్కువ ధరకు లభించే పామాయిల్ లేదా ఇతర జంతువుల కొవ్వులను కలిపిన కల్తీ నెయ్యిని విజయ లేబుల్‌తో మార్కెట్లోకి విడుదల చేశారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా తిరుమల లడ్డూ ప్రసాదం నెయ్యి కల్తీ వ్యవహారం వెలుగులోకి రావడంతో, అప్పట్లో సరఫరా అయిన విజయ నెయ్యి నాణ్యతపై కూడా అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఈ ప్రభావం కేవలం ఆంధ్రప్రదేశ్‌కే పరిమితం కాకుండా, పొరుగు రాష్ట్రమైన తెలంగాణలోని విజయ ఉత్పత్తుల అమ్మకాలపై కూడా తీవ్ర ప్రభావం చూపింది.తెలంగాణలోని విజయ డెయిరీ ( లాభాల్లో ఉన్నప్పటికీ, ఏపీలో జరిగిన పరిణామాల వల్ల ఇక్కడి వినియోగదారుల్లో కూడా అభద్రతాభావం నెలకొంది. విజయ పాలు లేదా నెయ్యి అంటే కళ్ళు మూసుకుని కొనే ప్రజలు, ఇప్పుడు ఇతర ప్రైవేట్ బ్రాండ్ల వైపు మొగ్గు చూపుతున్నారు. దీనివల్ల మార్కెట్‌లో విజయ ఉత్పత్తుల వాటా క్రమంగా తగ్గుతోంది. అమ్మకాలు పడిపోవడంతో దాని ప్రభావం నేరుగా క్షేత్రస్థాయిలో ఉన్న పాడి రైతులపై పడుతోంది. డెయిరీకి వచ్చే పాల సేకరణ తగ్గడం వల్ల రైతులు తమ పాలను ప్రైవేట్ డైరీలకు తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇది గ్రామీణ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయడమే కాకుండా, సహకార రంగంపై రైతులకు ఉన్న నమ్మకాన్ని సడలిస్తోంది.ఈ మొత్తం వ్యవహారంలో పర్యవేక్షక లోపం స్పష్టంగా కనిపిస్తోంది. సాధారణంగా ప్రభుత్వ బ్రాండ్ అంటే ప్రజల్లో ఒక రకమైన భరోసా ఉంటుంది. కానీ ఫ్రాంచైజీలకు ప్యాకేజింగ్, తయారీ బాధ్యతలను అప్పగించినప్పుడు, ప్రభుత్వం తరపున నిరంతర

తనిఖీలు నిర్వహించడంలో వైఫల్యం చెందారు. కేవలం కమీషన్ల కోసమే ప్రాధాన్యత ఇవ్వడంతో నాణ్యత అనే అంశం అప్రధాన్యంగా మారింది. ప్రైవేట్ వ్యక్తులు ప్రభుత్వ ముద్రను వాడుకుంటూ కల్తీకి పాల్పడటం అనేది ముమ్మాటికీ వ్యవస్థాగత వైఫల్యమే. రాజకీయ నాయకుల అండదండలతోనే ఇటువంటి అక్రమాలు సాధ్యమవుతాయని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోకపోవడం వల్లే ఈ పరిస్థితి ఇక్కడి దాకా వచ్చిందని విమర్శలు వస్తున్నాయి.ప్రస్తుత తరుణంలో విజయ బ్రాండ్ తన పూర్వవైభవాన్ని సంతృప్తి పరుచుకోవాలంటే సమూలమైన మార్పులు అవసరం. రాజకీయాలకు అతీతంగా, కల్తీకి పాల్పడిన ఫ్రాంచైజీల లైసెన్స్‌లను రద్దు చేయడంతో పాటు, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి. అలాగే తెలంగాణ ప్రభుత్వం కూడా తన డెయిరీ ఉత్పత్తుల నాణ్యతను నిరూపించుకోవడానికి అత్యాధునిక ల్యాబ్‌ల ద్వారా ప్రతి బ్యాచ్‌ను పరీక్షించి, ఆ రిపోర్టులను బహిరంగంగా అందుబాటులో ఉంచాలి. సహకార రంగాన్ని కాపాడుకోవడం అంటే కేవలం ఒక సంస్థను కాపాడుకోవడం కాదు, దాని వెనుక ఉన్న లక్షలాది మంది రైతుల జీవనోపాధిని కాపాడటమే. ప్రభుత్వం తక్షణమే స్పందించి గట్టి చర్యలు తీసుకోకపోతే, అద్భుతమైన చరిత్ర కలిగిన విజయ బ్రాండ్ కేవలం ఒక జ్ఞాపకంగా మిగిలిపోయే ప్రమాదం ఉంది.

# ట్రెండింగ్ బ్రిడ్జిగా సంతోషనగర్ స్టీల్ బ్రిడ్జి

**హైదరాబాద్, మార్చి 9, పెన్ పవర్:** హైదరాబాద్ లోని చంచల్‌గూడ టూ సంతోషన్ నగర్ ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టేందుకు నిర్మిస్తున్న సంతోష్ నగర్ స్టీల్ బ్రిడ్జ్ పూర్తవ్వకముందే తెలుగు రాష్ట్రాల్లో ట్రెండింగ్ బ్రిడ్జిగా వార్తల్లో నిలిచింది. ఒళ్లు గగుర్పొడిచేలా, అత్యంత ప్రమాదకరంగా సాగుతున్న బ్రిడ్జ్ నిర్మాణ పనులు, సేఫ్టీ లేకుండా బ్రిడ్జ్ పై కార్మికులు చేస్తున్న విన్యాసాలు, అత్యంత బరువైన గిడ్డర్లను బ్రిడ్జిపై తీసుకెళ్తున్న వీడియోలు పెను దుమారం రేపాయి. కార్మికుల ప్రాణాలతోపాటు తేడా వస్తే బ్రిడ్జి క్రింద ప్రయాణిస్తున్న వాహనదారులు తలలు కూడా పుచ్చకాయల్లా పగిలేలా ఉన్నాయంటూ వీడియోలు వైరల్ అయ్యాయి. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సైతం ట్విట్టర్ వేదికగా స్టీల్ బ్రిడ్జ్ నిర్మాణ పనులపై తీవ్ర విమర్శలు చేశారు. సీన్ కట్ చేస్తే ఇప్పుడు బ్రిడ్జ్ నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ముఖ్యంగా గిడ్డర్లు వంటి అత్యంత బరువైన ఇనుప పిల్లర్ల అమరిక రాత్రి వేళల్లో ఎవరి కంట పడకుండా చేసేందుకు నిర్మాణ సంస్థ సిద్ధమైయ్యింది.ఇంతలా వార్తల్లో చక్కర్లు కొట్టిన సంతోష్ నగర్ స్టీల్ బ్రిడ్జి, ఇక్కడ స్థానికులకు మాత్రం దశాబ్దాల నాటి కల. సంతోష్ నగర్ టూ సైదాబాద్ మీదుగా చంచల్ గూడ వెళ్లాలంటే కేవలం 3 కిలోమీటర్ల దూరం 30 నుండి 40 నిమిషాలకు పైగా సమయం పట్టేది. అంతలా ట్రాఫిక్ కష్టాలతో ఇక్కడ వాహనదారులు పట్టపగలే చుక్కలు చూసేవారు. ఈ స్టీల్ బ్రిడ్జ్ నిర్మాణం పూర్తయితే కేవలం ఐదే ఐదు నిమిషాల్లో రివ్వుమంటూ దూసుకుపోవచ్చంటూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. హైదరాబాద్ సిటీలో సంతోష్ నగర్ స్టీల్ బ్రిడ్జ్ రెండవ అతి పెద్ద స్టీల్ బ్రిడ్జి కావడం మరో ప్రత్యేకతగా చెప్పవచ్చు. సంతోష్ నగర్, యాదగిరి సినిమా థియేటర్ వద్ద నుండి మొదలై, చంచల్ గూడ జైలు దాటే వరకూ 3.8 కిలోమీటర్ల మేర ఈ బ్రిడ్జి నిర్మాణం, మూడు ట్రాఫిక్ సిగ్నల్స్ దాటి, చంచల్ గూడ జంక్షన్ మీదుగా వెళుతుంది. అత్యంత రద్దీగా ఉంటే నల్గొండ ఎక్స్ రోడ్ మీదుగా సంతోష్ నగర్ వైపు వచ్చే వాహనదారులకు ఈ నిర్మాణం పూర్తయితే ట్రాఫిక్ కష్టాలకు మోక్షం లభించినట్లే..650 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఈ స్టీల్ బ్రిడ్జ్ కు గత బీఆర్ఎస్ హయాంలోనే శంకుస్థాపన చేశారు. నాలుగేళ్ల క్రితమే పనులు ప్రారంభమైనా తీవ్ర జాప్యం జరుగుతోంది. అతి కష్టం మీద నిర్మాణ పనులు ఓ కొలిక్కి వచ్చాయనుకుంటున్న సమయంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో వార్తల్లోకెక్కింది సంతోష్ నగర్ స్టీల్ బ్రిడ్జ్. ఈ స్టీల్ బ్రిడ్జ్ పూర్తయితే సైదాబాద్ నుండి సంతోషనగర్ వైపు వచ్చే వాళ్లు, ఇక్కడి నుండి చంపాపేట్, సైదాబాద్ వెళ్లాలన్నా మూడు ప్రధాన మార్గాలకు పెద్ద జంక్షన్ కావడంతో ఈ బ్రిడ్జ్ వల్ల ఎంతో ఉపయోగం ఉంటుంది. ఇబ్రహీంపట్నం బస్సులు మిధాని వెళ్లాలన్నా, కోటి వెళ్లాలన్నా ఇదే ప్రధాన రహదారి.సైదాబాద్ లో ఇరుకు రోడ్లు, ఇక్కడ మార్కెట్ కూడా నిత్యం రద్దీగా ఉంటం వల్ల , ఈ బ్రిడ్జి పూర్తయితే 90శాతం ఈ ప్రాంతంలో ట్రాఫిక్ తగ్గిపోతుంది. సంతోష్ నగర్ టూ మలక్ పేట్ ఇప్పుడు 5నిమిషాల్లో వెళ్లిపోతారు. గతంలో గంట సమయం పట్టేది. - విజయేంద్ర రెడ్డి, సంతోష్ నగర్..ఆర్టీసీ బస్సులు, నల్గొండ వెళ్లే వాహనాలు ఈ రహదారి మీదుగా వెళుతుండటంతో ఈ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య విపరీతంగా ఉంది. రోడ్ క్రాస్ చేసేవాళ్లు అనేసార్లు ప్రమాదాలకు గురవుతున్నారు. స్టీల్ బ్రిడ్జ్ పూర్తయితే చాల ఉపయోగం ఉంటుంది. మలక్ పేట్ , చాదర్ ఘాట్ మార్గాల్లో ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టినట్లవుతుంది. వివిధ జిల్లాల నుండి వచ్చేవాళ్లకు సైదాబాద్ మార్కెట్ కు రావాలంటే నరకం చూసేవాళ్లు. ఇప్పుడు ఆ పరిస్దితి మారుతుంది. - ఎం.ఏ. రజాక్, సైదాబాద్..మాధన్నపేట వద్ద విపరీతంగా ట్రాఫిక్ జామ్ అవుతుంది.స్కూల్స్, ఇంజరీరింగ్ కాలేజీలు ఉండటంతో ట్రాఫిక్ సమస్య మరింత ఎక్కువగా ఉంటుంది. ఈ స్టీల్ బ్రిడ్జ్ పూర్తయితే చాలా ఉపయోగం ఉంటుంది. ముఖ్యంగా సంతోష్ నగర్ నుండి మలక్ పేట్ వెళ్లాలంటే ఉదయం, సాయంత్రం వేళల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎప్పుడో పూర్తవ్వాల్సిన ఈ బ్రిడ్జ్ నిర్మాణం ఇన్నాళ్లు పట్టింది.

## కామేపల్లిలో రోడ్డు ప్రమాదం.. యువకుడి మృతి

**పాలేరు, మార్చి 9 పెన్ పవర్:** కామేపల్లి క్రాస్ రోడ్డు సమీపంలో రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఊట్కూరుకు చెందిన దుగ్గి సాయి (22) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఎదురెదురుగా వస్తున్న రెండు మోటార్ సైకిళ్లు ఢీకొనడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో షేక్ అఖిల్ పాషా, మరో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని వెంటనే చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

## పజా పాలనా ప్రగతి పాలనలో భాగంగా వైద్య శిబిరం



**నర్సంపేట, మార్చి 9 పెన్ పవర్:** వరంగల్ జిల్లా నెక్కొండలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజా పాలన ప్రగతి పాలనలో భాగంగా వైద్య శిబిరాన్ని నెక్కొండ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి ప్రారంభించారు. స్థానికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో సబ్ ఇన్స్పెక్టర్ మహేందర్, డాక్టర్ నుశ్రత్ తన్వీర్, డ్యూటీ డాక్టర్ సుమన్, మాజీ సొసైటీ చైర్మన్ కొమ్మారెడ్డి రవీందర్ రెడ్డి, ఇతర వైద్యులు, ప్రజలు, ఆరోగ్య కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

## ఉద్యాన పంటలపై రైతులకు అవగాహన



**భూపాలపల్లి, మార్చి 9 పెన్ పవర్:** చిట్యాల మండలంలోని కైలాపూర్, రామచంద్రాపూర్ గ్రామ శివారుల్లో సోమవారం జిల్లా ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో రైతులకు ఉద్యాన పంటల సాగుపై అవగాహన, శిక్షణ కార్యక్రమం జరిగింది. జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఏ. సునీల్ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ఉద్యాన పంటల సాగు విధానాలు యాజమాన్యంపై రైతులకు సూచనలు చేశారు. కూరగాయలు, పండ్ల తోటలు, ఆయిల్ పామ్ వంటి పంటల ద్వారా తక్కువ భూమిలో ఎక్కువ ఆదాయం పొందవచ్చని, డ్రిప్ సాగుతో నీటి పొదుపుతో పాటు ఉత్పత్తి పెరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## గోవిందరావుపేట హోటల్ దూరిన తాచుపాము

**ములుగు, మార్చి 9 పెన్ పవర్:** సోమవారం ములుగు జిల్లా గోవిందరావుపేట మండల కేంద్రంలోని ఓ హోటల్ లో భారీ నాగుపాము కలకలం సృష్టించింది. ప్రధాన రహదారిపై ఉన్న టిఫిన్ సెంటర్ లోకి పాము రావడంతో హోటల్ నిర్వాహకులు, టిఫిన్ తింటున్న ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. స్నేక్ క్యాచర్ కు సమాచారం అందడంతో, వారు చాకచక్యంగా బుసలు కొడుతున్న త్రాచు పామును పట్టుకుని అడవిలో వదిలిపెట్టారు.

## విద్యుత్ షాక్ తగిలి కార్మికుడు అక్కడికక్కడే దుర్మరణం

**వరంగల్ ఈస్ట్, మార్చి 9 పెన్ పవర్:** వరంగల్ దేశాయిపేటలో విషాద ఘటన చోటుచేసుకుంది. నూతన భవన నిర్మాణ పనులు చేస్తుండగా ఓ కార్మికుడికి విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు కొనసాగుతోంది. భవన నిర్మాణ పనుల సమయంలో విద్యుత్ తీగలు తగలడంతో ఘటన జరిగినట్లు స్థానికులు తెలిపారు. మృతదేహాన్ని వరంగల్ ఎంజీఎం లోని మార్చురీ కి తరలించారు.

## గంజాయి వినియోగం ఆనవాళ్ల కోసం తనిఖీలు

**మహబూబాబాద్, మార్చి 9 పెన్ పవర్:** మహబూబాబాద్ జిల్లాలో గంజాయి వినియోగంపై ఆనవాళ్లు కనుగొనేందుకు పోలీసులు సోమవారం విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. పులి గోపాల్ రెడ్డి నగర్, ఓసి క్లబ్ వంటి ప్రాంతాల్లో నార్కోటిక్ డాగ్-మాక్స్ సహాయంతో పోలీసులు సోదాలు నిర్వహించారు. గంజాయి సరఫరా చేసినా, తీసుకున్నా కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

## వరంగల్‌కు 100.. నిజామాబాద్‌కు 51 ఈ-బస్‌ల మంజూరు

-3 పేజి తరువాయి

నుంచి తమకు ఎలాంటి ప్రతిపాదనలూ అందలేదని స్పష్టంచేశారు. రాష్ట్రానికి కేటాయించిన బస్సుల్లో ఇప్పటివరకూ ఒక్కటికూడా అక్కడికి తరలించలేదన్నారు. ఈ బస్‌ల నిర్వహణకు అవసరమైన నిర్మాణ, విద్యుత్తు పరమైన మౌలికవసతుల అభివృద్ధి తర్వాతే వాటిని క్షేత్రస్థాయికి తరలించనున్నట్లు చెప్పారు.

**మూడేళ్లలో గోల్కొండకు 47 లక్షలు, చార్మినార్‌కు 35 లక్షలమంది పర్యాటకులు**

2022-25 మధ్య కాలంలో గోల్కొండకు 47.41 లక్షల మంది, చార్మినార్‌కు 35.85 లక్షల మంది, వరంగల్‌కు 3.52 లక్షల మంది పర్యాటకులు వచ్చినట్లు కేంద్ర పర్యాటకశాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ చెప్పారు. ఆయన సోమవారం లోక్‌సభలో అడిగిన ఓ ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. సందర్శకులకు టికెట్ల విక్రయం ద్వారా ఈ మూడేళ్లలో గోల్కొండ నుంచి రూ.15.30 కోట్లు, చార్మినార్ నుంచి రూ.9.30 కోట్లు, వరంగల్ నుంచి రూ.73.71 లక్షల ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు.

# అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

**ఆదిలాబాద్, మార్చి 9 పెన్ పవర్:** ఆదిలాబాద్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్ పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించిన ఆయన, వాటిని పరిశీలించి సత్వరమే పరిష్కారమయ్యేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో స్రవంతి కూడా పాల్గొన్నారు.

# జీవితంపై విరక్తితో వ్యక్తి ఆత్మహత్య..

**బోథ్, మార్చి 9 పెన్ పవర్:** కాసిపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని స్టేషన్ పెద్దనపల్లికి చెందిన సామల లక్ష్మణ్ (36) తన ఇంట్లోని సీలింగ్ ఫ్యాన్ కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. మృతుడి అన్న కొడుకు ఈ విషయాన్ని లక్ష్మణ్ కొడుకుకు తెలియజేశారు. మృతుడి భార్య స్వాతి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

# మ్యాదరిపేటలో కరెంట్ షాక్‌తో ఇద్దరు దుర్మరణం

**నిర్మల్, మార్చి 9 పెన్ పవర్:** మంచిర్యాల జిల్లా, దండేపల్లి మండలం మ్యాదరిపేటలో విషాదకర సంఘటన చోటుచేసుకుంది. ఇండియన్ పెట్రోల్ బాంక్ నుండి ఇనుప స్టాండ్ తరలిస్తుండగా, ప్రమాదవశాత్తు 11కేవీ వైర్లకు తగలడంతో మ్యాదరిపేట గ్రామపంచాయతీ మాదాపూర్ కు చెందిన చల్ల లక్ష్మీనారాయణ విద్యుత్ ఘాతానికి గురయ్యారు. ఆయనను కాపాడడానికి ప్రయత్నించిన నాగరాజు (పల్లె) కూడా విద్యుత్ షాక్‌తో మరణించారు. గంగాధర్ (కాసిపేట్) స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# డివైడర్ ను ఢీకొని ఇద్దరు యువకులు మృతి

**ముథోల్, మార్చి 9 పెన్ పవర్:** నిర్మల్ జిల్లా కేంద్రంలోని బైంసా రోడ్డులో అర్ధరాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. మంజులాపూర్ నుండి నిర్మల్ వైపు వస్తున్న ద్విచక్ర వాహనం అదుపుతప్పి డివైడర్ ను ఢీకొనడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. మృతులు మంజులాపూర్ కు చెందిన సృజన్ (33), నటరాజ్ నగర్ కు చెందిన కపుల్ (34) గా గుర్తించారు. వీరి మృతదేహాలను ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించిన పోలీసులు, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# కరీంనగర్ కేబుల్ బ్రిడ్జి వద్ద లారీ బోల్తా

**కరీంనగర్, మార్చి 9 పెన్ పవర్:** కరీంనగర్ నగరంలోని కేబుల్ బ్రిడ్జి జంక్షన్ వద్ద సోమవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. అతివేగంగా దూసుకువచ్చిన ఒక భారీ లారీ అదుపుతప్పి, జంక్షన్ వద్ద ఉన్న విగ్రహాల దిమ్మెను బలంగా ఢీకొని పల్టీ కొట్టింది. ఈ ఘటనలో లారీ ఒక పక్కకు పూర్తిగా బోల్తా పడింది. ప్రమాదానికి లారీ అతివేగమే ప్రధాన కారణమని ప్రాథమికంగా తెలుస్తోంది. సమాచారం అందిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలను సేకరిస్తున్నారు.

# మహిళల కోసం చిల్లపల్లిలో ప్రత్యేక ఆరోగ్య శిబిరం




**మానకొండూరు, మార్చి 9 పెన్ పవర్:** చిల్లపల్లి గ్రామంలోని ఆరోగ్య ఉపకేంద్రంలో స్వయం సహాయక సంఘం(రాఊఉ) మహిళల కోసం ప్రత్యేక ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 40 రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని చిల్లపల్లి, దుబ్బపల్లి, సిరిపురం, బెస్తపల్లి గ్రామపంచాయతీలకు చెందిన మహిళల కోసం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చిల్లపల్లి సర్పంచ్ గోపు సంతోష్ కుమార్ ఆరోగ్య శిబిరాన్ని సందర్శించి, నిర్వహిస్తున్న పరీక్షల గురించి వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మహిళలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని ఆయన సూచించారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

**హుజూరాబాద్, మార్చి 9 పెన్ పవర్:** మేడిపల్లి మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన ముక్కెర నరేష్ (26) మంగళవారం రాత్రి కొడిమ్యాల మండలం దమ్మయ్య పేట నుండి తిరుగు ప్రయాణంలో ఉండగా, మల్యాల మండలం గొర్రెగుండెం వద్ద బైక్ అదుపుతప్పి కిందపడిపోయాడు. ఈ ప్రమాదంలో తలకు బలమైన గాయాలవడంతో నరేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అతని మృతితో కుటుంబంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

# ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఒకేరోజు నలుగురు మృతి

**చొప్పదండి, మార్చి 9 పెన్ పవర్:** నిన్న ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో వేర్వేరు కారణాలతో నలుగురు వ్యక్తులు ఆత్మహత్య చేసుకున్నారు. బైక్ కొనివ్వలేదన్న మనస్తాపంతో గోపాల్రావుపేట్కు చెందిన సాయిని రిత్విక్, కుటుంబ కలహాలతో మల్యాలలో రాయకొండ అశోక్, చెరువులో దూకి సిరిసిల్లకు చెందిన నల్ల రామకృష్ణరెడ్డి, కాలునొప్పి భరించలేక ధర్మారం మండలం తండా (బి)లో భూక్య దేలు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఈ సంఘటనలు జిల్లాలో కలకలం సృష్టించాయి.

# పదోన్నతి నేపథ్యంలో సన్మానం



**సిరిసిల్ల, మార్చి 9 పెన్ పవర్:** సిరిసిల్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అగ్రహారం)లో బోటనీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ టి. శంకర్ ప్రొఫెసర్ గా పదోన్నతి పొందిన సందర్భంగా కళాశాల స్టాఫ్ క్లబ్ ఆధ్వర్యంలో ఘన సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో స్టాఫ్ క్లబ్ సెక్రటరీ జి. శ్రీధర్ రావు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ టి. లావణ్య, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ శోభారాణి, డాక్టర్ కృష్ణ ప్రసాద్, డాక్టర్ కే వై కరుణ, వై. నరసయ్య, తిరుపతితో పాటు అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు. ఈ సన్మానం డాక్టర్ శంకర్ సాధించిన అకడమిక్ విజయానికి గుర్తింపుగా జరిగింది.

# నడిరోడ్డుపై ఉన్న విద్యుత్ స్తంభాల తొలగింపు

**ఖమ్మం, మార్చి 9 పెన్ పవర్:** ఖమ్మం నగరంలోని మామిళ్లగూడెం రామాలయం రోడ్డులో నడిరోడ్డుపై ఉన్న విద్యుత్ స్తంభాలను అధికారులు సోమవారం తొలగించారు. ఇటీవల సీసీ రోడ్డు నిర్మాణం సమయంలో స్తంభాలను తొలగించకుండా పనులు పూర్తి చేయడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. స్థానికుల ఫిర్యాదుతో స్పందించిన కార్పొరేషన్ అధికారులు, ప్రస్తుతం ఆ స్తంభాలను రోడ్డు పక్కకు మారుస్తున్నారు.

# శాస్త్రోక్తంగా విగ్రహ ప్రతిష్టపన




**నిజామాబాద్ అర్బన్, మార్చి 9 పెన్ పవర్:** నిజామాబాద్ నగరంలోని కంఠేశ్వర్ ప్రాంతంలో నూతనంగా నిర్మించిన ఇందూర్ ఫుడ్ శ్రీ భగదాంబ ? సేవాలాల్ మహారాజ్ దేవాలయ విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించడం ఆనందదాయకమని, సమాజంలో ఐక్యత, శాంతి, సౌభ్రాతృత్వం పెంపొందించడంలో దేవాలయాలు కీలక పాత్ర పోషిస్తాయని ఆయన పేర్కొన్నారు. జగదాంబ తల్లి మరియు సేవాలాల్ మహారాజ్ కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

# అద్భుత ఆవిష్కరణ దూరవాణి

**హైదరాబాద్ పెన్ పవర్:** నేడు మనం వాడుతున్న ఫోన్లకు మాతృక అయిన "టెలిఫోన్" అనేదాన్ని కనిపెట్టింది అమెరికాకు చెందిన "అలెగ్జాండర్ గ్రాహెంబెల్" అని మనలో చాలామందికి తెలిసే ఉంటుంది. టెలీ ఫోను అంటే... టెలీ అనగా దూర, ఫోను అంటే వాణి... దూరవాణి అని అర్థం. ఇది సాధారణంగా ఇద్దరు, మరికొన్ని సమయాలలో ముగ్గురు లేదా అంతకంటే ఎక్కువ మంది సంభాషించు కునేందుకు ఉపయోగిస్తుంటారన్న సంగతి మనకు తెలిసిందే. అలెగ్జాండర్ గ్రాహెంబెల్ స్కాట్లాండులోని ఎడిన్‌బర్గ్ అనే ప్రాంతంలో మార్చి 3, 1847వ సంవత్సరంలో జన్మించాడు. ఆయన తండ్రి పేరు అలెగ్జాండర్ మెల్‌విల్లే బెల్ (ప్రొఫెసర్) కాగా, తల్లి పేరు ఎలిజా గ్రేస్ గ్రాహెంబెల్. చిన్న వయసు నుంచే సహజంగానే అనేక విషయాల పట్ల ఆసక్తి ఎక్కువగా ఉండేది. ముఖ్యంగా గ్రాహెంబెల్ కు ఆ రోజుల్లోనే పరిశీలనా శక్తి అధికంగా ఉండేది. తన పక్కింట్లో నివాసముండే తన స్నేహితుడు బెన్ హెర్డ్‌మెన్ సహాయంతో గ్రాహెంబెల్ 12 ఏళ్ల ప్రాయంలోనే "ఇన్వెంట్" అనే పేరుతో చిన్న వర్క్‌షాప్‌ను నిర్వహించాడు. తల్లి క్రమేణా వినికిడి శక్తిని కోల్పోవడంతో ఆమెతో మాట్లాడే క్రమంలో సంజ్ఞలతో భావ వ్యక్తీకరణలో ఆరితేరాడు. ఆమె నుదిటి ఎముకకు దగ్గరగా ఒక రకమైన ఉచ్ఛారణతో మాట్లాడే ప్రయత్నంలో ధ్వని శాస్త్రాన్ని అర్థం చేసుకున్నాడు. బెల్‌లోని విజ్ఞాన తృష్ణకు తల్లి చెవిటితనం కూడా ఓ కారణం. ఆపై ఎడింబరో విశ్వ విద్యాలయంలో ధ్వని, వినికిడి శాస్త్రాలు చదివి అమెరికాలోని బోస్టన్ విశ్వ విద్యాలయంలో 'గాత్ర సంబంధిత శరీర శాస్త్రం' (వోకల్ ఫిజియా లజీ)లో ప్రొఫెసర్‌గా చేరాడు. భార్య సైతం వినికిడి శక్తిని కోల్పోవడంతో బధిరుల కోసం పరిశోధనలు చేసి, వారు వినగలిగే శబ్ద పరికరాలను రూపొందించాడు. పగలంతా బోధిస్తూ, రాత్రంతా మేలుకుని ప్రయోగాలు చేసేవాడు. ఆ కృషి కారణంగానే తీగల ద్వారా శబ్ద తరంగాలను పంపగలిగే టెలిఫోన్‌ను కనిపెట్ట గలిగాడు. లోహపు తీగ చుట్టబడిన ఒక శాశ్వత అయస్కాంతం దగ్గర పల్చని ఇనుప రేకును కంపింపజేస్తే, కంపనాల తీవ్రతకు అనుగుణంగా తీగలో విద్యుత్ ప్రవాహం ఏర్పడు తున్నట్లు బెల్ కనుగొన్నా డు. శబ్దాన్ని ప్రసారం చేయటానికి ఈ సిద్ధంతం బాగా ఉపకరిస్తుందని గ్రహించాడు. థామస్ వాట్సన్ అనే మెకానిక్ తో బాటు దీనికి సంబంధించిన ప్రయోగాలు చేసుకుంటూ అతడు పచ్చిక బయళ్ళలో, మైదానాల్లో, బీడు భూముల్లో తిరుగుతుండే వాడు. జీవితంలో ఎన్నో ఒడిదుడు కులు, అపజయం వెక్కిరించాయి. ప్రోత్సహించేవారు కరువయ్యారు. ఎటు చూసినా నిరాశా నిస్పృహలే తారసిల్లాయి. టెలిఫోన్ ద్వారా నోటిమాటల్ని దూర ప్రదేశాలకు అందించే కృషి చేస్తున్నానని చెబితే నలుగురు నవ్విపోతారేమో అని భయ పడుతూ అజ్ఞాతంగా కాలం గడిపేవాడు. కాబోయే మామ కూడా ఇది అంతా ఒక పగటి కల అని కొట్టి పారేశాడు. 1875 జూన్ లో ఒకరోజు వర్క్ షాప్ కి ఇటూ, అటూ ఉన్న రెండు గదుల్లో ప్రసారిణి, రిసీవర్ లను వుంచి బెల్, వాట్సన్ ప్రయోగాలు చేస్తుండగా ఒకదాని ఇనుపరేకు అయస్కాంతానికి అతుక్కు పోయింది. దాన్ని లాగాలని వాట్సన్ ప్రయత్నించినపుడు బెల్ వద్ద వున్న ఇనుపరేకు కూడా కంపించసాగింది. ఇనుపరేకు దగ్గర చెవి ఉంచగా శబ్దం కూడా వినబడింది. ఒక పక్క ఇనుపరేకును అయస్కాంతానికి చాలా దగ్గరగా ఉంటే ప్రయోగ ఫలితాలు సంతృప్తి కరంగా ఉంటాయని వాళ్ళూ గ్రహించారు. ఇలా కొన్ని నెలలు కృషి చేశాక మొదటి పటిష్ఠమైన టెలిఫోన్ నిర్మించారు. బాటరీ అవసరం లేకుండా ప్రసారిణిలో ఉత్పత్తి అయ్యే అల్ప విద్యుత్ వల్లనే ఇది పనిచేయసాగింది. 1876 మార్చి 10న టెలిఫోన్ ప్రసారిణి బెల్ ఇంటి రెండో అంతస్తు లోనూ, రిసీవర్ ని మొదటి అంతస్తు లోనూ, అమర్చి బెల్ ఫోన్ లో ఇలా మాట్లాడాడు.---"మిస్టర్ వాట్సన్, మీతో పనుంది, పైకి రండి" ---.

ఫోన్ లో మాట్లాదిన తొలి పలుకులుగా ఈ పదాలు ప్రసిద్ధి కెక్కాయి. ఒకటి రెండు నిముషాల్లో మెట్లెక్కి రొప్పుతూ, రోజుతూ వాట్సన్ బెల్ వద్దకు పరుగెత్తి వచ్చి "ఫోన్ పనిచేస్తుంది. మీ మాటలు నాకు వినబడ్డాయి."?అని అరిచాడు. ఇలా కనిపెట్టినదే టెలీఫోను. దీనిని 1876 మార్చి 10న గ్రాహెంబెల్ మొదటిసారిగా ఉపయోగిస్తూ, వాట్సన్‌తో మాట్లాడారు. దీనిపై 1876లో

ఆయనకు లభించిన పేటెంట్ అమెరికాలోనే శాస్త్రరంగంలో మొదటిది. గ్రహంబెల్ ను చాలామంది టెలిఫోన్ ఆవిష్కర్తగా గుర్తుంచుకున్నా ఆయన వివిధ రంగాలలో ఆసక్తిని కనబరచాడు. ఆప్టికల్ టెలి కమ్యూ నికేషన్స్, హైడ్రోఫాయిల్స్, ఏరోనా టిక్స్ రంగాల్లో కూడా అనేక ఆవిష్కరణలు చేశాడు. నేషనల్ జియోగ్రాఫిక్ సొసైటీ వ్యవస్థాప కుల్లో గ్రాహంబెల్ కూడా అయన ఒకరు. 1880 వ సంవత్సరంలో టెలిఫోన్ ఆవిష్కరణకు గాను ఫ్రెంచి ప్రభు త్వం ప్రధానం చేసే వోల్టా పురస్కా రాన్ని గెలుచుకున్నాడు. దీని విలువ 50,000 ఫ్రాంకులు ( సుమారు 10,000 డాలర్లు). తన జీవిత కాలమంతా రకరకాల పరిశోధనలతో గడిపిన గ్రాహెంబెల్ తన 75 సంవత్సరాల వయసులో చక్కెర వ్యాధికి గురై, 1922 ఆగస్టు 2వ తేదీన మరణించాడు.

# సామాజిక ఉద్యమకారిణి సావిత్రి ఫూలే

**హైదరాబాద్ పెన్ పవర్:** మహిళా హక్కులే మానవ హక్కులని తొలిసారిగా నినదించినది సావిత్రిబాయి ఫూలే. కుల వ్యవస్థకు, పితృస్వామ్యానికి వ్యతిరేకంగా, శూద్రుల, అస్పృశ్యుల, మహిళల సకల హక్కుల కోసం పోరాటం సల్పిన అభ్యుదయవాది ఆమె. కులమత భేదాలకు అతీతంగా సమాజాన్ని ప్రేమించిన ప్రేమ మూర్తి. సమాజపు కట్టు బాట్లను, బ్రాహ్మణవాద సంప్రదాయాలను, ఆధిపత్య వర్గాలను ధిక్కరించి భారత దేశపు మొట్ట మొదటి ఉపాధ్యాయు రాలుగా పాఠశాలలు ప్రారంభించిన ధీశాలి. అంటరాని తనానికి వ్యతిరేకంగా పోరాటం చేసిన సమ న్యాయవాది. మహిళా శిరోముండ నానికి వ్యతిరేకంగా పోరాడిన సాంప్రదాయ వ్యతిరేకి. భర్త పూలే చితికి తానే స్వయంగా నిప్పుపెట్టి కొత్త సంప్రదాయానికి తెరలేపిన సంస్కరణ వాది. భారతదేశ చరిత్రలో భర్త చితికి భార్య నిప్పు పెట్టిన తొలి సంఘటన ఇదే. సావిత్రి ఫూలే (3 జనవరి 1831 ? 10 మార్చి 1897) గొప్ప సంఘ సంస్కర్త, నిమ్న వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన జ్యోతీరావ్ ఫూలే భార్య. ఆధునిక విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యపడుతుందని నమ్మిన ఆమె తన భర్తతో కలసి 1848 జనవరి 1న పూణేలో మొట్టమొదటగా బాలికల పాఠశాలను ప్రారంభించారు. కుల వ్యవస్థకు, పితృస్వామ్యానికి వ్యతిరేకంగా, శూద్రుల, అస్పృశ్యుల, మహిళల సకల హక్కుల కోసం పోరాటం చేయటం తమ సామాజిక బాధ్యతగా ఆ దంపతులు విశ్వసించారు. నూతన వ్యవస్థ కోసం, ప్రాణాల్ని సైతం ఫణంగా పెట్టి సమాజంలోని కులతత్వం, పురుషాధిక్యత ధోరణులకు వ్యతిరేకంగా సమష్టిగా పోరాటం చేసారు. కలిగిన చాలామందికి ఆమె కేవలం జ్యోతిరావు పూలే భార్యగా మాత్రమే తెలుసు. కానీ ఆమె ఆధునిక భారత దేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు. పీడిత ప్రజలు ముఖ్యంగా స్త్రీల విద్యాభివృద్ధికి కృషి చేసిన తొలితరం మహిళా ఉద్యమకారిణి. సావిత్రీ బాయి మహారాష్ట్ర సతారా జిల్లాలో నయాగావ్ అనే గ్రామంలో 1831 జనవరి 3 న ఒక రైతు కుటుంబంలో జన్మించారు. ఆమె కుటుంబానికి తెలంగాణ ప్రాంతంతో బంధుత్వం ఉంది. బంధువులు నిజామాబాద్ జిల్లా లో బోధన్, నాందేడ్ కొండల్ వాడి ప్రాంతంలో , అదిలాబాద్ ప్రాంతపు చుట్టుపక్కల మున్నూరు కాపులు వారికి చుట్టాలు. ఆమె తన 9వ యేట 12 ఏళ్ళ జ్యోతిరావు పూలెను 1840లో వివాహ మాడారు. నిరక్షరాస్యురాలిగా ఉన్న ఆమెకు భర్త జ్యోతిరావు పూలే మొదటి గురువు. భర్త ప్రోత్సాహంతోనే ఇంట్లోనే అక్షరాభ్యాసం చేసి విద్యావంతు రాలైనారు. అహ్మద్ నగర్ లో ఉపాధ్యాయ శిక్షణ పొంది 1848 లో భర్త జ్యోతిరావుతో కలిసి క్రింది కులాల బాలికల కోసం పూణేలో మొదటి పాఠశాలను ప్రారంభించారు. ఆ పాఠశాల నడపటం ఉన్నత, అగ్రవర్ణాలకు నచ్చలేదు. దీంతో ఆమెపై వేధింపులకు, భౌతిక దాడులకు పూనుకున్నారు. పాఠశాలకు నడిచే దారిలో ఆమెపై బురద చల్లడం, రాళ్ళు విసరడం, అసభ్య పదజాలాన్ని వాడటం వంటివి చేశారు. బురదతో మలినమైన చీరను పాఠశాలకు వెళ్లిన తరువాత మార్చుకుని, మరలా వచ్చేటప్పుడు బురద చీరను కట్టుకుని వచ్చే వారు. ఎవరైనా అడిగినప్పుడు ధైర్యంగా "నా విధిని నేను నిర్వహిస్తున్నాను" అని చెప్పే వారు. ఆమె సాగించిన విద్యా ఉద్యమానికి తక్కువ సమయం లోనే సహకారం గుర్తింపు లభించాయి. ఒక ముస్లిం వ్యక్తి తన ఇంటిని బడికి కేటాయించాడు. కొంత మంది పుస్తకాలు సేకరించారు. మోరోవిఠల్, వాల్వేకర్, దియోరావ్ వంటి ప్రముఖులు పాఠశాల నిర్వహణకు సహకరించారు. 1851లో మరో పాఠశాల ప్రారంభించారు. ఉపాధ్యాయురాలిగా అట్టడుగు వర్గాలు, మహిళలకు చదువు లాంటి హక్కులు నిరాకరింపబడిన దేశంలో ఆనాటి సమాజపు కట్టుబాట్లను, సనాతన సంప్రదాయాలను, ఆధిపత్య వర్గాలను ధిక్కరించి భారతదేశపు మొట్టమొదటి ఉపాధ్యాయు రాలుగా పాఠశాలలు ప్రారంభించి,12 మే 1848న దేశంలో బహుజనులకు మె?ట్టమె?దటి పాఠశాల ప్రారంభించారు. సమాజంలో ఎన్ని అవమానాలు ఎదురైనా మడమ తిప్పని ధీశాలి ఆమె. కేవలం 4 సంవత్సరాలలోనే గ్రామీణ ప్రాంతాల్లో 20 పాఠశాలలను ప్రారంభించి ఉచిత విద్యను అందించారు. దళితుల, స్త్రీల విద్యా వ్యాప్తికి కృషి ప్రారంభించే నాటికి ఆమె వయస్సు 18 ఏళ్ళు మాత్రమే. ఆమె జీవిత కాలంలో మొత్తం 52 పాఠశాలలు ప్రారంభించారు.

అయితే ఈ క్రమంలో అనేక దాడులను, అవమానాలను ఎదుర్కొనడమే కాక, 1849లో పూలే, సావిత్రీబాయి దంపతు గృహ బహిష్కారానికి గురి అయినారు. సామాజిక విప్లవకారిణిగా ఆమె మానవ హక్కుల గురించి ఇతర సామాజిక సమస్యల గురించి స్త్రీలను చైతన్య పరచడానికి 1852లో మహిళా సేవామండల్ పేరున మహిళా సంఘాన్ని కూడా స్థాపించింది. లింగ సమస్యలకు తోడుగా, కుల పితృస్వామ్య వ్యవస్థల అణచి వేతకు వ్యతిరేకంగా స్త్రీల సాధికారిత కోసం ఆ సంస్థ కృషిచేసింది. కులవ్యవస్థగా నిర్మాణమైన సమాజంలో సత్యాన్ని శోధించడానికి 1873 లో తన భర్త మహాత్మా పూలేతో కలసి "సత్యశోధక్ సమాజ్ "ను ప్రారంభించి బాల్య వివాహాలకు, మూఢ నమ్మకాలకు, సతీ సహగమనానికి వ్యతిరేకంగా, వితంతువు పునఃర్వివాహల కొరకు అసమాన వ్యవస్థకు వ్యతి రేకంగా బలమైన ఉధ్యమం నడిపారు. బాల్యం లోనే వైధవ్యాన్ని అనుభవించే ఎంతో మంది ఆడపిల్లలకు అన్నం పెట్టి ఆశ్రయం కల్పించారు. గర్భవతులైన వారికి పురుళ్లు పోసి వారి కళ్లల్లో వెలుగు చూసారు. అలా పురుడు పోసుకుని తన వద్దేవదిలేసి పోయిన ఓ బిడ్డను అక్కున చేర్చుకున్నారు. యశ్వంత్ గా నామకరణం చేసి తమ ఆశయాలకు, ఆకాంక్షలకు అనుగుణంగా పెంచి పెద్ద చేసారు. వితంతువులకు శిరోముండనం చేయడాన్ని తీవ్రంగా ఖండించి, క్షురకులను చైతన్య పరిచి వితంతువులకు శిరో ముండనం చేయబోమంటూ క్షురకుల చేత 1860లో సమ్మె చేయించారు. తరువాత 1873 సెప్టెంబరు 24న "సత్యసోధక్ సమాజ్" అనే సామాజిక, ఆధ్యాత్మిక సంస్థను ప్రారంభించి, ఉద్యమాన్ని నడిపారు. ఆ సత్యసోధక్ సమాజ్ మహిళా విభాగం సావిత్రీబాయి నేతృత్వంలో నడిచేది. వివాహాలు వంటి శుభ కార్యాలను పురోహితులు లేకుండా నిర్వహించే విధానాన్ని ఈ సంస్థ ప్రారంభించింది. 1873 డిసెంబరు 25న భార్యను కోల్పోయిన ఒక యువకునికి తన స్నేహితురాలి కుమార్తెతో సత్యసోధక్ సమాజ్ ఆధ్వర్యన సావిత్రీబాయి వివాహం జరిపించారు. 1868 నుంచి సావిత్రీబాయి అంటరాని తనానికి వ్యతిరేకంగా పోరాడారు. 1870లో ఒకసారి 1896లో మరోసారి దేశంలో తీవ్ర దుర్భిక్షం ఏర్పడి నప్పుడు పూలే దంపతులు చేసిన కృషి అనన్య సామాన్యం. కరువు వాతపడిన కుటుంబాల లోని అనాథ బాలలను దాదాపు 2,000 మందిని అక్కున చేర్చుకున్నారు. తమ పాఠశాల ల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ప్రారంభించా రు. సావిత్రిబాయి సంఘ సంస్కర్తగానే గాదు, రచయిత్రిగా కూడా పేరెన్నిక గన్నా రు. 1854లోనే ఆమె తన కవితా సంపుటి 'కావ్యఫూలే'ను, మరో కవితా సంపుటి 'పావన కాశీ సుభోధ్ రత్నాకర్'ను 1891లో ప్రచురించారు. ఆమె ఉపన్యాసాల్లో కొన్ని 1892లో పుస్తక రూపంలో వచ్చాయి. జ్యోతీరావు పూలే 1890 నవంబరు 28న మరణించడంతో సావిత్రీబాయి అంతులేని దుఃఖ సాగరంలో మునిగి

పోయి కూడా, దుఃఖంలోనుంచే మరో ఆదర్శానికి శ్రీకారం చుట్టారు. తన భర్త పూలే చితికి తానే స్వయంగా నిప్పుపెట్టి కొత్త సంప్రదాయానికి తెరలేపారు. భారతదేశ చరిత్రలో భర్త చితికి భార్య నిప్పు పెట్టిన తొలి సంఘటన ఇదే. పూలే మరణాంతరం సత్యసోధాక్ సమాజ్ భాద్యతను స్వీకరించి నడిపించారు. 1897 లో ప్లేగు వ్యాధి, పూణే నగరాన్ని వణికించింది. నగరమంతా ఎడారిగా మారింది. జనమంతా దగ్గర్లోని అడవుల్లోకి పారిపోయారు. అయినా సావిత్రీబాయి పూలే కొడుకు యశ్వంత్ తో కల్సి వ్యాధి గ్రస్తులకు సేవ చేసారు. 1896-97లో సంభవించిన తీవ్ర కరువు, ప్లేగు వ్యాఓధి మహారాష్ట్ర జనజీవనాన్ని అతలాకుతలం చేశాయి. ఈ పరిస్థితుల్లో కరువు ప్రాంతాల్లోని దళితులు పేదలకు జోలెపట్టి విరాళాలు సేకరించి అందించారు. ప్లేగువ్యాధి సోకిన పేదలకు దగ్గరుండి సేవలందించారు. 1890వ దశకంలో ప్లేగు వ్యాధి బారినపడిన పిల్లల కోసం వైద్య శిబిరాలు నిర్వహించారు. దుర్భరమైన కరువు పరిస్థితుల్లో కూడా రోజుకు 2 వేల మంది పిల్లలకు భోజనాలు పెట్టించారు. ప్లేగు వ్యాధి సోకిన మాంగ్ లాంటి కులాలకి చెందిన దళిత చిన్న పిల్లలని తన చంకన వేసుకొని చికిత్స చేసి కాపాడారు. చివరికి ఆ ప్లేగు వ్యాధే ఆమెకు సోకి మార్చి 10, 1897 లో మరణించారు. ఆమె దత్తపుత్రుడు యశ్వంత్ అంత్యక్రియలు జరిపించాడు. సావిత్రి బాయి జయంతిని భారతదేశ "మహిళా ఉపాధ్యాయుల దినోత్సవం"గా జరుపు కుంటారు. 1997లో భారత ప్రభుత్వం సావిత్రిబాయి జ్ఞాపకార్థం తపాలా స్టాంపును విడుదల చేసింది. పూణే విశ్వ విద్యాలయానికి సావిత్రిబాయి పేరు పెట్టారు.

# కేడర్ లో నిర్లిప్తత

**తిరుపతి, మార్చి 8, పెన్ పవర్:** కూటమిలోని ప్రధాన పక్షమైన తెలుగుదేశం పార్టీలో క్రమ శిక్షణ అనేది నేడు కనిపించడం లేదు. గతంలో మాదిరిగా ఆ పార్టీ నేతలు ఉండటం లేదన్నది అందరికీ అర్ధమయింది. పాత నీరు పోయి కొత్త నీరు వచ్చి చేరడంతోనే ఈ పరిస్థితులు ఏర్పడ్డాయని పలువురు సీనియర్ నేతలు సయితం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. టిక్కెట్లను ఖరారు చేసే సమయంలోనే తగిన జాగ్రత్తలు తీసుకుని ఉంటే ఇప్పుడు ఈ ఇబ్బందులు తప్పేవి కదా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఒకటి కాదు..రెండు కాదు.. అనేక నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు ఇటువంటి పరిస్థితుల్లోనే ఉన్నారు. కానీ ఎవరిపైనా చర్యలు లేవు. అలాగే ఎవరిని పిలిచి గట్టిగా మందలించిన పాపాన పోలేదని పార్టీ కార్యకర్తలే సోషల్ మీడియాలో వ్యాఖ్యానిస్తున్నారు. తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్, గుంటూరు తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే మహ్మద్ నజీర్ అహ్మద్ వంటి వారిపై అనేక ఆరోపణలు వచ్చాయి. వీరంతా కొత్త వారేనని గుర్తు చేస్తున్నారు. కొత్తగా ఎమ్మెల్యేలు టిక్కెట్లను పొంది గెలిచిన వారు మాత్రమే ఇలాంటి ఆరోపణలు ఎదుర్కొంటున్నారని, సీనియర్ నేతలు అందరూ వివాదాలకు దూరంగా ఉంటున్నారని చెబుతున్నారు. అలాంటి వారికి వచ్చే ఎన్నికల్లో టిక్కెట్ ఇవ్వకపోవచ్చు. కానీ ఈ మూడేళ్లలో పార్టీకి జరిగే డ్యామేజీ సంగతేంటని పలువురు తెలుగుదేశం పార్టీ అభిమానులు సోషల్ మీడియాలో ప్రశ్నిస్తున్నారు. మరొకవైపు పార్టీ క్యాడర్ నుంచి కూడా పలు ప్రశ్నలు సోషల్ మీడియా వేదికగా వినిపిస్తున్నాయి. పార్టీ ని పట్టించుకుంటారా లేదా లోకేశ్, చంద్రబాబు నాయుడు ఇలాంటి వి పదే పదే రీపీట్ అవటానికి కారణం మీరే నంటూ వేలు చూపుతున్నారు. ఈ రెండేళ్లలో చంద్రబాబు, లోకేశ్ లు కష్టపడి ఎన్ని కంపెనీలు ఆంధ్రప్రదేశ్ కు తెచ్చినప్పటికీ, ఉద్యోగాలను కల్పించినప్పటికీ, రోడ్లు ఎంత అభివృద్ధి చేసిన కూడా లోపం ఎక్కడ ఉంది.? కమ్యూనికేషన్ వ్యవస్థ బాగా లేదని వారు నిలదీస్తున్నారు. ఐఏఎస్, ఐపీఎస్ లు ఓట్లు వేయించరు,వాళ్ళ మాటలు విని మోసపోకండి మళ్ళీ మళ్ళీ అంటూ పోస్టులు పెడుతున్నారు. గ్రూప్ రాజకీయాలని కట్టడి చేయాలని, పార్టీ కోసం కొంత సమయం కేటాయించాలని కోరుతున్నారు. అలాగే టీడీపీ సోషల్ మీడియా కూడా పెద్దగా యాక్టివ్ గా లేదని, దానికి గ్లూకోజ్ ఇచ్చే ప్రయత్నం చేయాలని కోరుతున్నారు. సోషల్ మీడియా వారియర్స్ తో ఒక ఫొటో దిగేతే వారు యాక్టివ్ అవుతారని లోకేశ్, చంద్రబాబును కోరుతున్నారు. మరి చంద్రబాబు, లోకేశ్ ఏ రకంగా స్పందిస్తారన్నది చూడాలి.

# నిలిచిపోయిన రొయ్యల, చేపల కంటైనర్లు



**విశాఖపట్టణం, మార్చి 8, పెన్ పవర్:** యుద్ధ జ్వాలలు ఇప్పుడు తెలుగు రాష్ట్రాల రైతులకు ఆందోళన కలిగిస్తున్నాయి. మిడిల్ ఈస్ట్‌లో అమెరికా, ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు కేవలం పెట్రోల్ ధరలకే పరిమితం కాకుండా.. ఆంధ్రప్రదేశ్ ఆక్వా రంగాన్ని, తెలంగాణ పౌల్ట్రీ రంగాన్ని నిలువునా ముంచేస్తున్నాయి. గల్ఫ్, యూరప్ దేశాలకు వెళ్లాల్సిన సముద్ర ఉత్పత్తుల ఎగుమతులు అమాంతం ఆగిపోయాయి. తాజా నివేదికల ప్రకారం.. సుమారు 300 మిలియన్ డాలర్ల విలువైన సీ ఫుడ్ కంటైనర్లు వివిధ పోర్టుల్లో నిలిచిపోయాయి. ఈ భారీ నష్టంలో దాదాపు 60 శాతం వాటా ఒక్క ఆంధ్రప్రదేశ్‌దే కావడం ఆందోళనకరం. విశాఖపట్నం, ముంబై పోర్టుల నుంచి గల్ఫ్ దేశాలకు వెళ్లాల్సిన రొయ్యలు, చేపల కంటైనర్లు కదలడం లేదు. ఎర్ర సముద్రం, స్ట్రెయిట్ ఆఫ్ హార్మూజ్ మార్గాల్లో దాడుల భయంతో షిప్పింగ్ నిలిచిపోయిందిఒకవైపు ఎగుమతులు ఆగిపోతుంటే.. మరోవైపు షిప్పింగ్ కంపెనీలు చార్జీలను రెట్టింపు చేశాయి. ఒక్కో కంటైనర్‌పై 1500 నుండి 4000 డాలర్ల వరకు ఎమర్జెన్సీ సర్‌చార్జీలు వసూలు చేస్తున్నాయి. ముఖ్యంగా రొయ్యలు పాడవకుండా ఉంచే రిఫ్రిజిరేటెడ్ కంటైనర్ల అద్దెలు విపరీతంగా పెరిగిపోయాయి. "అమెరికా టారిఫ్‌ల దెబ్బ నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న తరుణంలో.. ఈ యుద్ధం మా వెన్ను విరిచింది" అని సీ ఫుడ్ ఎక్స్‌పోర్టర్స్ అసోసియేషన్ తెలిపింది. కోల్డ్ స్టోరేజీలు నిండిపోవడంతో, స్థానిక మార్కెట్‌లో వ్యాపారులు కొనుగోళ్లు నిలిపివేశారు. దీనివల్ల పల్లెల్లో రొయ్యల ధరలు దారుణంగా పడిపోయే ప్రమాదం కనిపిస్తోంది.యుద్ధం ప్రభావం కేవలం సముద్ర ఉత్పత్తులపైనే కాదు మన పౌల్ట్రీ రంగంపై కూడా తీవ్రంగా పడింది. హైదరాబాద్, నామక్కల్ ప్రాంతాల నుంచి గల్ఫ్ దేశాలకు వెళ్లాల్సిన గుడ్ల ఎగుమతులు నిలిచిపోయాయి. ఎగుమతులు ఆగడంతో స్థానిక మార్కెట్‌లో గుడ్ల నిల్వలు పెరిగి, ధరలు పడిపోతున్నాయి. దీనివల్ల పౌల్ట్రీ రైతులకు రోజుకు కోట్లాది రూపాయల నష్టం వాటిల్లుతోంది. భారత హలాల్ మాంసం ఎగుమతుల్లో సగానికి పైగా వాటా గల్ఫ్ దేశాలదే. ఇప్పుడు ఇన్సూరెన్స్ రేట్లు పెరగడం, కంటైనర్లు ముంబై పోర్టులోనే ఆగిపోవడంతో వేలాది టన్నుల మాంసం పాడైపోయే పరిస్థితి ఏర్పడింది. పెట్రోల్ రేట్ల గురించి సామాన్యుడు భయపడుతుంటే.. అంతర్జాతీయ వాణిజ్య మార్గాలు మూసుకుపోవడంతో తెలుగు రైతు తన పెట్టుబడి ఎక్కడ సముద్రం పాలవుతుందోనని బిక్కుబిక్కుమంటున్నాడు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఎగుమతిదారులకు, రైతులకు అండగా నిలవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**అరటిపై ప్రభావం**

వెంకీ పెళ్లి సుబ్బి చావుకు వచ్చినట్లుంది అరటి రైతుల పరిస్థితి. ఎక్కడో అమెరికా ఇరాన్ పై దాడి చేసి యుద్ధం చేస్తుంటే ఆ ప్రభావం కర్నూలు జిల్లా అరటి రైతులకు తీవ్రంగా పడింది వారి పాలిట శాపంగా మారింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో రైతులు అరటి పంటలు భారీగా సాగు చేస్తున్నారు. నాలుగు నెలల క్రితం కన్ను ఒకటి వెయ్యి నుంచి 2000 ఉండే ది. అరటి కోసే కూలీలకు కూడా ఆ ధర సరిపోక రైతులు ఎక్కడపడితే అక్కడ పారవేశారు. ఇంకా కొన్ని అయితే పశువులకు మేతగా వేశారు. ఆ తర్వాత పుంజుకుని టన్ను అరటి 25 వేల వరకు వెళ్ళింది. ఇరాన్ పై అమెరికా దాడి చేయకముందు వరకు ఆ ధర పలికింది. ఖర్చులన్నీ కూడా కరెంటు రైతులకు ఎకరాలు రెండు లక్షలకు పైగా మిగిలేది. గల్ఫ్ యుద్ధంతో ఒక్కసారిగా పడిపోయింది . టన్ను అరటి ధర 10 వేలు కూడా రావడం లేదని, రెండు మూడు రోజుల వివాదిలోని 60 శాతం పైగా ధర పడిపోవడం తప్ప రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇరాన్ సహా గల్ఫ్ కంట్రీస్ కి యుద్ధం కారణంగా ఆ దేశాలకి అరటి ఎగుమతులు నిలిచిపోవడంతో ధర పతనమైనట్టు వ్యాపారులు రైతులు చెప్పున్నారు. ధర కోసం వేచి చూస్తే పొలంలోని అరటి మాగిపోయే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు

# కిం కర్తవ్యం.. జగన్ అంతర్మధనం



**విజయవాడ, మార్చి 8, పెన్ పవర్:** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాజకీయ ప్రస్థానం ఇప్పుడు అత్యంత క్లిష్ట దశకు చేరుకుంది. అక్రమాస్తుల కేసులు, వివేకా హత్య కేసు విచారణ మరియు తాజా లిక్కర్ స్కామ్ పరిణామాలు ఆయనను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. విచారణ సంస్థలు దర్యాప్తును వేగవంతం చేయడంతో, జగన్ తన రాజకీయ భవిష్యత్తుపై తీవ్ర ఆందోళనలో ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది.గత కొంతకాలంగా ఏపీ రాజకీయాలకు దూరంగా ఉంటున్న జగన్, బెంగళూరు ప్యాలెస్‌కే పరిమితమవ్వడం వెనుక పెద్ద వ్యూహమే ఉందని తెలుస్తోంది. అక్కడ ఆయన నిర్వహిస్తున్న రహస్య సమావేశాలు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి. పబ్లిక్ లైఫ్‌లో కనిపించకుండా, తెర వెనుక ఎవరిని కలుస్తున్నారు? ఎందుకు కలుస్తున్నారు? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. తనపై ఉన్న కేసుల తీవ్రతను తగ్గించుకోవడానికి ఢిల్లీ స్థాయిలో ప్రభావం చూపగల మధ్యవర్తుల ద్వారా ఆయన భారీగా లాబీయింగ్ నడుపుతున్నట్లు సమాచారం.చట్టపరమైన చిక్కుల నుంచి బయటపడేందుకు జగన్ ఎంతటి రాజకీయ రాజీకైనా సిద్ధపడుతున్నారని విశ్లేషకులు భావిస్తున్నారు. తన రక్షణ కోసం ఆయన పడుతున్న తాపత్రయం, క్షేత్రస్థాయిలో పార్టీ క్యాడర్‌ను ఆందోళనకు గురిచేస్తోంది. పార్టీ పరిస్థితి గందరగోళంలో ఉన్న సమయంలో అధినేత వ్యక్తిగత కేసుల కోసం ప్రాకులాడటంపై వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఒకప్పుడు బలమైన నేతగా ముద్ర వేయించుకున్న జగన్, ఇప్పుడు ప్రత్యక్ష పోరాటం కంటే తెర వెనుక రాజకీయాలకే మొగ్గు చూపుతుండటంతో ఆయన ఇమేజ్ మసకబారుతోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.అవినీతి కేసులు, దర్యాప్తు సంస్థల ఉచ్చు.. వెరసి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాజకీయ భవిష్యత్తు ఇప్పుడు ఒక అగమ్యగోచర స్థితిలో పడిందనే చర్చ రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది. ఒకవైపు లిక్కర్ స్కామ్ సెగలు తాకుతుండటం, మరోవైపు వివేకా హత్య కేసు విచారణ కీలక దశకు చేరుకోవడం, వీటికి తోడు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న అక్రమాస్తుల కేసులు ఇప్పుడు కొలిక్కి వస్తుండటంతో జగన్ తీవ్ర ఆందోళనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ భయమే ఆయన్ని ఏపీ రాజకీయాలకు దూరం చేసి, బెంగళూరు ప్యాలెస్‌కే పరిమితమయ్యేలా చేస్తోందని తెలుస్తోంది.గత కొద్ది రోజులుగా జగన్ బెంగళూరు వేదికగా జరుపుతున్న రహస్య సమావేశాలు ఇప్పుడు పెద్ద ఎత్తున చర్చకు దారితీస్తున్నాయి. పబ్లిక్ లైఫ్ నుంచి అకస్మాత్తుగా మాయమై, అక్కడ ఎవరిని కలుస్తున్నారు? ఎందుకు కలుస్తున్నారు? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. అధికారిక కార్యక్రమాలు లేకపోయినా, ఆయన అత్యంత రహస్యంగా కొందరు కీలక వ్యక్తులతో భేటీ అవుతున్నారని, తనపై ఉన్న కేసుల తీవ్రతను తగ్గించుకోవడానికి తెర వెనుక భారీ లాబీయింగ్ నడుపుతున్నారని సోషల్ మీడియాలో కథనాలు గుప్పుమంటున్నాయి. చట్టపరమైన చిక్కుల నుంచి తప్పించుకోవడానికి ఆయన చేయని ప్రయత్నం లేదని టాక్.ముఖ్యంగా ఢిల్లీ స్థాయిలో చక్రం తిప్పగల కొందరు మధ్యవర్తుల ద్వారా జగన్ రాయబారాలు నడుపుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. విచారణ సంస్థల నుంచి తనకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఉండేందుకు, అవసరమైతే రాజకీయంగా ఎలాంటి రాజీకైనా ఆయన సిద్ధపడుతున్నారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ క్రమంలోనే ఆయన బెంగళూరు నుంచి నేరుగా కొన్ని రహస్య ప్రాంతాలకు వెళ్లి, కీలక నేతలతో టచ్‌లోకి వెళ్తున్నారనే వార్తలు వైఎస్ఆర్‌సీపీ క్యాడర్‌ను కూడా కలవరపెడుతున్నాయి. పార్టీ పరిస్థితి గాలిలో దీపంలా ఉంటే, అధినేత మాత్రం తన వ్యక్తిగత కేసుల రక్షణ కోసం ప్రాకులాడటం పట్ల వ్యతిరేకత వ్యక్తమవుతోంది.జగన్ చుట్టూ ఇప్పుడు కేసుల ఉచ్చు గట్టిగానే బిగుసుకుంటోంది. గతంలో ఎన్నడూ లేనంతగా ఆయనలో వణుకు కనిపిస్తోందని, అందుకే ప్రత్యక్ష పోరాటం కంటే తెర వెనుక రాజకీయాలకే ఆయన మొగ్గు చూపుతున్నారని సమాచారం. ఈ రహస్య ఆపరేషన్లు ఆయనకు ఎంతవరకు ఊరటనిస్తాయనేది పక్కన పెడితే, ఒక బలమైన నాయకుడిగా ప్రజల్లో ఉన్న ఇమేజ్ మాత్రం ఈ పలాయన వాదం వల్ల మసకబారుతోంది. మరి ఈ లాబీయింగ్ ఫలిస్తుందా లేక చట్టం తన పని తాను చేసుకుపోతుందా అన్నది రాబోయే రోజుల్లో తేలనుంది.

## భూజాన వేసుకొని నడిపించిన బొత్స



**విజయవాడ, మార్చి 8, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ప్రస్తుతం వైఎస్ఆర్‌సీపీ పరిస్థితి విచిత్రంగా మారింది. పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఒకవైపు, సీనియర్ నేత బొత్స సత్యనారాయణ మరో వైపు అన్నట్టుగా వ్యవహారం సాగుతోంది. ముఖ్యంగా అసెంబ్లీ సమావేశాల సమయంలో జగన్ అనుసరిస్తున్న తీరు సొంత పార్టీ క్యాడర్‌లోనే తీవ్ర అసహనానికి దారితీస్తోంది. రాష్ట్రంలో కీలకమైన చర్చలు జరుగుతున్నప్పుడు, ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన సమయంలో జగన్ రెడ్డి ఏపీలో ఉండకుండా బెంగళూరు ప్యాలెస్‌కే పరిమితం కావడం ఆయన పలాయన వాదానికి నిదర్శనమని సొంత పార్టీ వారే తేల్చేస్తున్నారు.అధినేత లేని లోటును భర్తీ చేస్తూ, మండలిలో ప్రభుత్వాన్ని ఢీకొట్టడంలో బొత్స సత్యనారాయణ అసలైన 'ఫైటర్'అనిపించుకున్నారు. అనారోగ్య కారణాలతో ఆసుపత్రిలో చేరినప్పటికీ, కోలుకున్న వెంటనే నేరుగా సభకు వచ్చి అధికార పక్షంపై విరుచుకుపడటం బొత్సలోని రాజకీయ పట్టుదలను చాటిచెబుతోంది. ఒకవైపు వయసు, మరోవైపు అనారోగ్యం ఉన్నా సరే.. బాధ్యత గల ప్రతిపక్ష నేతగా ఆయన చూపుతున్న చొరవ ఇప్పుడు వైఎస్ఆర్‌సీపీ శ్రేణుల్లో హాట్ టాపిక్ అయింది. అధినేత రారు.. సీనియర్ నేత అస్వస్థతలోనూ పోరాడుతున్నారు అనే చర్చ క్యాడర్‌లో బలంగా వినిపిస్తోంది.అసెంబ్లీకి వెళ్లడం ఇష్టం లేక, కూటమి సర్కార్ అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పలేకనో జగన్ రెడ్డి బెంగళూరుకు వెళ్లిపోవడం ఆయన రాజకీయ చేతకానితనాన్ని' సూచిస్తోంది. ప్రతిపక్ష నేతగా ఉండాల్సిన కనీస బాధ్యతను కూడా గాలికొదిలేసి, సోషల్ మీడియా పోస్టులకే పరిమితం కావడం కార్యకర్తలను నిరాశకు గురి చేస్తోంది. క్షేత్రస్థాయిలో పార్టీ కోసం దెబ్బలు తింటున్న వారు, కేసులపాలవుతున్న వారు.. తమ నాయకుడు ఇలా పారిపోతుంటే ఎవరి కోసం పోరాడాలని ప్రశ్నించుకుంటున్నారు. జగన్ లోపించిన ధైర్యం, బొత్సలో స్పష్టంగా కనిపిస్తుండటంతో నాయకత్వ మార్పు గురించిన అంతర్గత చర్చలు మొదలయ్యాయి.రాజకీయాల్లో ఓటమి సహజం, కానీ ఓటమి తర్వాత మైదానం విడిచి పారిపోవడం నాయకత్వ లక్షణం అనిపించుకోదు. జగన్ రెడ్డి ఒకవైపు బెంగళూరులో విశ్రాంతి తీసుకుంటుంటే, బొత్స సత్యనారాయణ ఆసుపత్రి బెడ్ నుంచి వచ్చి సభలో గర్జిస్తున్నారు. ఈ పరిణామాలు వైఎస్ఆర్‌సీపీలో జగన్ పట్టు కోల్పోతున్నారనే సంకేతాలను ఇస్తున్నాయి. పార్టీ ఉనికిని కాపాడటానికి ఒక సీనియర్ నేత ప్రాణాలకు తెగించి పోరాడుతుంటే, వారసత్వంగా వచ్చిన అధికారాన్ని కాపాడుకోలేక జగన్ చేస్తున్న పలాయన ప్రదర్శన పార్టీని పాతాళానికి తొక్కేసే ప్రమాదం ఉంది.

## తెరపైకి బీసీ రిజర్వేషన్ అంశం

**విజయవాడ, మార్చి 9, పెన్ పవర్:** కర్ణుడు పెళ్ళికి సవాలక్ష కారణాలు అన్నట్టు మొన్నటి ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ ఓడిపోవడానికి అనేక కారణాలు ఉన్నాయి. ముఖ్యంగా ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ అనేది దారుణంగా దెబ్బతీసింది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని. దశాబ్దాల చరిత్ర కలిగిన ఆంధ్రప్రదేశ్లో పట్టాదారు పాసుపుస్తకాలపై ముఖ్యమంత్రి ఫోటో వేసుకోవడం ఎప్పుడూ లేదు. కానీ తొలిసారిగా జగన్మోహన్ రెడ్డి ఫోటో వేయడంతో ప్రజల్లో ఒక రకమైన అభద్రతాభావం ఏర్పడింది. దానిని హైలెట్ చేసుకుంటూ ముందుకు సాగింది కూటమి. ప్రజల్లో బలమైన చర్చ జరిగేందుకు పెద్ద ఎత్తున ప్రచారం నడిచింది. ప్రజల్లోకి ఆ అంశం బలంగా వెళ్లడం.. బాహాటంగా వ్యతిరేకించడంతో.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి దారుణ ఓటమి ఎదురైంది. ముఖ్యంగా తటస్తులు, ఏ పార్టీతో సంబంధం లేని వారు కూడా ఈ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ను దారుణంగా వ్యతిరేకించారు. జగన్మోహన్ రెడ్డి పై ఉన్న భయంతో కూటమి పార్టీలకు ఓటు వేశారు. అయితే ఇప్పుడు సీన్ మారింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షంలోకి వచ్చింది. గతంలో కూటమి పట్టుకున్న ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ మాదిరిగా.. కూటమి ప్రభుత్వ వైఫల్యాన్ని పట్టుకోవాలని చూస్తోంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. కానీ కూటమి పట్టు చిక్కడం లేదు. దీంతో ఎంతవరకు కాపు రాజకీయం, అంబటి రాంబాబు లాంటి వారిపై కేసులతో ఇబ్బంది పెడుతున్నారని.. వైసీపీ నేతలను అరెస్టు చేస్తున్నారని.. రెడ్బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని ఆరోపణలు చేస్తున్నారు. ప్రజల్లోకి వెళ్లే బలమైన ఆయుధాన్ని మాత్రం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టుకోలేకపోతోంది. ఇది నిజంగా ఆ పార్టీకి లోటు. అయితే అధికారపక్షంగా ఉన్న కూటమి ఎన్నికలకు అవసరమైన ప్రచార అస్త్రాలను ఇప్పటికే సంపాదించుకుంది. వాటితోనే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని దెబ్బతీయాలని చూస్తోంది.టీటీడీ లడ్డు తయారీకి సంబంధించి నెయ్యి కల్తీ వ్యవహారం.. వచ్చే ఎన్నికల వరకు సజీవంగా ఉంచేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో నెయ్యి కల్తీ జరిపారు అన్నది ప్రత్యేక దర్యాప్తు బృందం తేల్చింది. కానీ ఎంతవరకు ప్రభుత్వ పెద్దలు చెప్పినట్టు జంతు కొవ్వు కలపలేదు కదా అని ప్రశ్నిస్తోంది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ. కానీ పామాయిల్ తో కూడిన రసాయనాలతో నెయ్యి తయారు చేశారని.. అసలు పాలతో తయారుచేసిన నెయ్యి కాదని సిట్ తేల్చింది. ఎంతవరకు జంతు కొవ్వు అన్న ఆరోపణ చేశారు కాబట్టి.. అందులో కలపలేదని సిట్ తేల్చింది కాబట్టి తామేదో బయటపడ్డామని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. కానీ వైసీపీ హయాంలో తప్పు జరిగిందని మెజారిటీ ప్రజలు ఒక నిర్ణయానికి వచ్చారు. అందుకే ఈ అంశాన్ని సజీవంగా ఉంచాలని భావిస్తోంది కూటమి. వచ్చే ఎన్నికల్లో ఇదొక ప్రచార అస్త్రంగా మారుతుందని భావిస్తోంది.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని హిందుత్వవాదంతో వచ్చే ఎన్నికల్లో దెబ్బతీయాలని చూస్తోంది కూటమి. అందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేసుకుంటుంది. ప్రస్తుతం వివిధ పీఠాధిపతులు, హిందూ మతానికి చెందిన పెద్దలు మీడియా ముందుకు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పై వ్యతిరేక ప్రచారం చేస్తున్నారు. ఏకంగా చిన్న జీయర్ స్వామి లాంటివారు అమరావతిని మార్చాలని కొందరు ప్రయత్నించారని.. భగవంతుడే కాపాడుకున్నాడంటూ వ్యాఖ్యానించారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. హిందుత్వవాదం ఎక్కడ వినిపిస్తే అక్కడ బిజెపి అనుబంధ సంస్థలు వాలిపోతాయి. ఇప్పుడు కేంద్రంలో బిజెపి నేతృత్వంలో ప్రభుత్వం పవర్ఫుల్ గా ఉంది. కచ్చితంగా వచ్చే ఎన్నికల నాటికి హిందుత్వవాదం అనేది ఏపీలో కచ్చితంగా ప్రభావం చూపుతుంది.

మరోవైపు బీసీ రిజర్వేషన్ల అంశం అనేది కూటమికి ఒక ప్రచార అస్త్రంగా మారనుంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో 32 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేసి ప్రజల్లోకి బలంగా వెళ్లనుంది కూటమి. 2021లో వైసీపీ హయాంలో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగాయి. అప్పుడు బీసీ రిజర్వేషన్లు అమలు చేసే అవకాశం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చిక్కింది. కానీ ఆ పని చేయలేదు. పైగా బీసీ వాదంతో ముందుకెళ్లిన జగన్మోహన్ రెడ్డిని దారుణంగా ఓడించారు బీసీలు. ఇప్పుడు రిజర్వేషన్లు ఖరారు చేయడం ద్వారా బీసీలను శాశ్వతంగా తనవైపు ఉంచుకోవాలని కూటమి బావిస్తోంది. మరోవైపు మద్యం కుంభకోణం కేసును సైతం చివరి వరకు తీసుకెళ్లేందుకు కూటమి నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు సగం మాత్రమే దర్యాప్తు జరిగిందని స్వయంగా సీఎం చంద్రబాబు ప్రకటించారు. తద్వారా ఇదో ఎన్నికల అస్త్రంగా మారనుంది. ప్రతిపక్షానికి అవసరమైన ఎన్నికల అస్త్రాలు సమకూరుతాయి. కానీ ఏపీలో మాత్రం అందుకు విరుద్ధంగా అధికార పక్షానికి చిక్కడం విశేషం.

## స్ట్రెయిట్ ఆఫ్ హార్మూజ్ మూసివేత..
### భారంగా మారుతున్న ఆయిల్

**న్యూఢిల్లీ, మార్చి 9, పెన్ పవర్:** ఇరాన్, అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధం రోజు రోజుకూ తీవ్రం అవుతోంది. అందరూ ఊహించినట్లుగానే యుద్ధం ప్రారంభం అయిన వెంటనే ఇరాన్ ఆర్మూజ్ జలసంధి మూసివేసింది. ఇక యుద్ధం ప్రారంభమైన తర్వాత ఎవరూ ఊహించని విధంగా ఇరాన్ గల్ఫ్ దేశాలపై దాడి చేపట్టింది. ఈ పరిణామాలు ఆయిల్ సంక్షోభానికి దారితీస్తున్నాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేస్తున్నాయి. షేర్ మార్కెట్లను కుంగదీస్తున్నాయి.ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్స్ బలగాలు మోహరించిన ఈ సంకీర్ణ జలమార్గం ప్రపంచ చమురు రవాణాలో 20% భాగస్వామి. రోజుకు 20 మిలియన్ బ్యారెళ్లు, సంవత్సరానికి 500 బిలియన్ డాలర్ల విలువైన వాణిజ్యం ఆగిపోయింది. వెడల్పు కేవలం 32 కిమీతో పరిమితమైన సంధి ఇప్పుడు ప్రమాదకర ప్రాంతంగా మారింది.యుద్ధం తర్వాత ఇరాన్ గల్ఫ్ దేశాలపై దాడి చేసింది. మొదట ఖతార్‌ను టార్గెట్ చేసింది. ఆ దేశంలోని రాస్ లఫాన్ పారిశ్రామిక కేంద్రంపై ఇరాన్ క్షిపణి దాడి చేయడంతో ఖతార్ గ్యాస్, చమురు కార్ఖానాలను నిలిపివేసింది. ప్రపంచ ఎల్ఎన్జీ సరఫరాలో 20% ఈ దేశం బాధ్యత వహిస్తుంది. ఆసియా మార్కెట్‌లకు 82% ప్రభావం. దీంతో ఇంధన ధరలు ఐరోపాలో 54%, ఆసియాలో 39% ృపెరిగాయి.ఖతార్ నుంచి 42% ఇంధనం భారత్‌కు సరఫరా అవుతుంది. అయితే భారత్ 5 వారాల నిల్వలతో తాత్కాలిక ఊపిరి పీల్చుకుంటోంది. శ్రీలంక, పాకిస్తాన్, బంగ్లాదేశ్ వంటి పొరుగు దేశాలు తీవ్ర ఇబ్బందుల్లో పడుతున్నాయి. చైనాకు కూడా భారీ నష్టం. దీర్ఘకాలంలో ఇంధన ధరలు, దిగుమతి ఖర్చులు పెరిగి ఆర్థిక ఒత్తిడి తీవ్రమవుతుంది.సరుకు పడవలు, ఓడలు ఆగిపోవడంతో అంతర్జాతీయ వాణిజ్యం దెబ్బతింది. స్టాక్ మార్కెట్లలో క్షీణత, ఎనర్జీ రంగాల్లో అస్థిరత పెరిగాయి. ఇరాన్ వ్యూహం ప్రపంచ దేశాలను అమెరికా వ్యతిరేక ఒత్తిడికి దోహదపడుతోందిఈ సంక్షోభం ఆయిల్ ధరలను రెట్టింపు చేస్తూ ద్రవ్యోల్బణాన్ని రేకెత్తించవచ్చు. గల్ఫ్ మిత్రదేశాల ఉత్పత్తి పునరుద్ధరణకు వారాలు పట్టవచ్చు; ఇది పర్యటక, ఉత్పాదక రంగాలను ప్రభావితం చేస్తుంది. భారత్ వంటి దేశాలు వైవిధ్యీకరణ ప్రణాళికలను వేగవంతం చేయాలి.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

## బ్రిటన్ ప్రధానికి ట్రంప్ హెచ్చరికలు

**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్‌పై వ్యంగాస్త్రాలు సంధించారు. అమెరికా ఇప్పటికే విజయం సాధించిన యుద్ధంలోకి ఇప్పుడు బ్రిటన్ తన యుద్ధ విమాన వాహక నౌకలను పంపాల్సిన అవసరం లేదంటూ ట్రంప్ ఘాటుగా వ్యాఖ్యానించారు. ట్రూత్ సోషల్ వేదికగా స్పందించిన ట్రంప్.. "ఒకప్పుడు మా గొప్ప మిత్రదేశమైన యునైటెడ్ కింగ్‌డమ్.. ఇప్పుడు మధ్యప్రాచ్యానికి రెండు యుద్ధ నౌకలను పంపాలని తీవ్రంగా ఆలోచిస్తోంది. సరే ప్రధాని స్టార్మర్.. కానీ ఇప్పుడు మాకు వాటితో అవసరం లేదు. అయితే ఈ విషయాన్ని (సమయం మించిపోయాక స్పందించడాన్ని) మేము గుర్తుంచుకుంటాం. మేం ఇప్పటికే గెలిచేశాక.. మాతో కలిసేవాళ్లు మాకు అవసరం లేదు" అంటూ హెచ్చరికతో కూడిన చురకలు అంటించారు. అంతేకాకుండా అగ్రరాజ్యం ఒంటరిగానే శత్రువును మట్టి కరిపించిందనే ధీమాను కూడా వ్యక్తం చేశారు. ఇరాన్ తన పొరుగు దేశాలకు క్షమాపణలు చెప్పిందని, ఇకపై దాడులు చేయబోమని హామీ ఇచ్చిందని ట్రంప్ వెల్లడించారు. "అమెరికా, ఇజ్రాయెల్ జరిపిన కనికరం లేని దాడుల వల్లే ఇరాన్ ఈ నిర్ణయానికి వచ్చింది. వేల ఏళ్ల చరిత్రలో ఇరాన్ పొరుగు దేశాల చేతిలో ఓడిపోవడం ఇదే మొదటిసారి. ఇన్నాళ్లూ మధ్యప్రాచ్యంలో అందరినీ భయపెట్టే 'బుల్లీ'లా ఉన్న ఇరాన్.. ఇప్పుడు ఒక 'లూజర్' (ఓడిపోయిన దేశం)గా మారింది. ఆ దేశం పూర్తిగా కుప్పకూలిపోయే వరకు లేదా లొంగిపోయే వరకు ఇదే పరిస్థితి కొనసాగుతుంది" అని ట్రంప్ విశ్లేషించారు. ఇంతటితో ఆగకుండా ఇరాన్‌కు ట్రంప్ ఆఖరి హెచ్చరిక జారీ చేశారు. ఇరాన్ తన పద్ధతి మార్చుకోకపోతే.. ఇప్పటి వరకు లక్ష్యంగా చేసుకోని ప్రాంతాలపై కూడా దాడులు చేస్తామని, అవి అత్యంత భయంకరంగా ఉంటాయని హెచ్చరించారు. "నేడు ఇరాన్ చాలా గట్టి దెబ్బ తినబోతోంది. పూర్తి విధ్వంసం, చావు తప్పదని గుర్తుంచుకోవాలి" అంటూ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. తన నాయకత్వంలోనే పశ్చిమాసియా ప్రశాంతంగా మారుతోందని, ఇందుకు అందరూ తనకు 'థాంక్యూ' చెబుతున్నారని ట్రంప్ తనను తాను ప్రశంసించుకున్నారు.

## పశ్చిమాసియా ఉద్రిక్తతలపై రాజ్యసభలో కేంద్రం కీలక ప్రకటన

**హైదరాబాద్ పెన్ పవర్:** పశ్చిమాసియాలో పరిస్థితులు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని యుద్ధ పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేస్తున్నామని కేంద్ర మంత్రి జైశంకర్ అన్నారు. తాజా పరిస్థితులను ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. భారతీయుల రక్షణ కోసం ప్రత్యేక చర్యలు చేపట్టామని, సంబంధిత శాఖలన్నింటికీ తగిన చర్యలు తీసుకోవాలని సూచించామన్నారు. పశ్చిమాసియాలో పరిస్థితులపై ఇవాళ కేంద్రం రాజ్యసభలో ప్రకటన చేసింది. ఈ సందర్భంగా పెద్దల సభలో మాట్లాడిన మంత్రి జైశంకర్ శాంతికి ఎలాంటి విఘాతం కలిగినా ప్రపంచం మొత్తం ఆ ప్రభావం ఉంటుందని చర్చలు, దౌత్యపరంగా సమస్య పరిష్కారం అవుతుందని భారత్ నమ్ముతోందని చెప్పారు. ఉద్రిక్తతలు తగ్గించేందుకు చర్చలు జరుపుతున్నట్టు వెల్లడించారు. మార్చి 1న సీసీఎస్ సమావేశం నిర్వహించామన్నారు. ఇరాన్ లోని భారతీయుల భద్రతకు ఎంబసీ అన్ని చర్యలు తీసుకుంటోందని తెలిపారు. పరిస్థితులు చక్కబడగానే టెహ్రాన్‌లోని భారతీయ విద్యార్థులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తామని వెల్లడించారు. గల్ఫ్ దేశాల్లో నివసిస్తున్న భారతీయుల రక్షణకు చర్యలు చేపట్టామని కోటి మంది భారతీయులు గల్ఫ్ దేశాల్లో నివసిస్తున్నారని వెల్లడించారు. గల్ఫ్ లో చిక్కుకున్న వారిని భారత్ రప్పించేందుకు ప్రత్యేక విమానాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇరాన్ కు వెళ్లొద్దని జనవరిలోనే భారతీయులుక సూచించామన్నారు. భారత్ ఇంధన అవసరాల విషయంలో పశ్చిమాసియా కీలకం. క్రూడాయిల్ ధర పెరుగుదలపై అప్రమత్తంగా ఉన్నామని చెప్పారు. గల్ఫ్ దేశాలు భారత్ కు ముఖ్యమైన వాణిజ్య భాగస్వాములు గల్ఫ్ దేశాల్లో ఉన్న భారత ఎంబసీలు ఎప్పటికప్పుడు అడ్వైజరీలు జారీ చేస్తున్నాయన్నారు. గల్ఫ్ దేశాలతో భారత ప్రభుత్వం చర్చలు జరుపుతోందన్నారు. భారతీయుల కోసం హెల్ప్ లైన్ నెంబర్లు ఏర్పాటు చేశామన్నారు. భారత్ రావాలనుకునేవారి కోసం విమాన సర్వీసులు అందుబాటులో ఉన్నాయన్నారు. దోహా, జోర్డాన్ లో ఉన్న వారికి సహాయం అందజేస్తున్నట్లు వెల్లడించారు. ఇరాన్ విదేశాంగ శాఖ మంత్రితో మాట్లాడినట్లు చెప్పారు.

## లోక్‌సభ మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా



**హైదరాబాద్ పెన్ పవర్:** దాదాపు నెల రోజుల విరామం తర్వాత పార్లమెంట్ బడ్జెట్ మలి విడత సమావేశాలు సోమవారం ఉదయం ఆరంభమయ్యాయి. అయితే, సభ ప్రారంభం కాగానే ఇటీవల మృతి చెందిన సభ్యులకు లోక్‌సభ సంతాపం ప్రకటించింది. అనంతరం స్పీకర్ సభను మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు. మధ్యాహ్నం తిరిగి సభ ప్రారంభమైన తర్వాత అసలు రాజకీయ పోరు మొదలయ్యే అవకాశం ఉంది. ఈ విడత సమావేశాల్లో అత్యంత కీలకమైన అంశం స్పీకర్ ఓం బిర్లాపై విపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం. స్పీకర్ పక్షపాతంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ కాంగ్రెస్ సహా ఇతర విపక్షాలు ఈ తీర్మానాన్ని నోటీసుగా ఇచ్చాయి. మధ్యాహ్నం 12:15 గంటలకు ఈ తీర్మానంపై చర్చ జరిగే అవకాశం ఉంది.

## నేడు స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానం!

**హైదరాబాద్ పెన్ పవర్:** పార్లమెంట్ బడ్జెట్ మలి విడత సమావేశాలు సోమవారం (మార్చి 9) నుంచి పునఃప్రారంభం అయ్యాయి. ఈ దఫా సమావేశాలు అత్యంత వాడివేడిగా సాగే అవకాశం కనిపిస్తోంది. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై నేడు సభలో కీలక చర్చతో పాటు ఓటింగ్ జరిగే అవకాశం ఉంది. జనవరి 28న రాష్ట్రపతి ప్రసంగంతో ప్రారంభమైన బడ్జెట్ తొలి విడత సమావేశాలు తీవ్ర గందరగోళం మధ్య ఫిబ్రవరి 12న ముగిశాయి. 2020 నాటి భారత్–చైనా సరిహద్దు ఘర్షణలపై మాజీ ఆర్మీ చీఫ్ ఎం.ఎం. నరవణే రాసిన (ఇంకా ప్రచురితం కాని) పుస్తకంలోని అంశాలను ప్రస్తావించేందుకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి స్పీకర్ అనుమతి నిరాకరించడంతో ఫిబ్రవరి 2 నుంచి సభలో రగడ మొదలైంది. విపక్షాల ఆందోళనల నడుమ రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ఫిబ్రవరి 4న ప్రధాని మోదీ సభలో ప్రసంగించలేకపోయారు. అనూహ్యంగా ఆ మరుసటి రోజు (ఫిబ్రవరి 5న) ప్రధాని ప్రసంగం లేకుండానే స్పీకర్ ఆ తీర్మానాన్ని చదివి, మూజువాణి ఓటుతో ఆమోదించడం జరిగిపోయాయి. కాంగ్రెస్ ఎంపీలు ప్రధాని కూర్చునే స్థానం వద్దకు వెళ్లి 'అవాంఛనీయ చర్య'లకు పాల్పడే ముప్పు ఉందన్న పక్కా సమాచారంతోనే ప్రధానిని సభకు రావొద్దని తాను కోరినట్లు స్పీకర్ అప్పట్లో వివరణ ఇవ్వగా, కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ ఆ వాదనను తీవ్రంగా ఖండించారు. ఇదే క్రమంలో సభలో అనుచిత ప్రవర్తనకు గాను 8 మంది విపక్ష సభ్యులపై బడ్జెట్ సమావేశాలు ముగిసే వరకు సస్పెన్షన్ వేటు పడింది.

# న్యూయార్క్ మేయర్ నివాసం వద్ద పేలుడు పదార్థాల కలకలం



**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికాలోని అత్యంత రద్దీ నగరమైన న్యూయార్క్‌లో ఒక్కసారిగా ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఎవరూ ఊహించని విధంగా న్యూయార్క్ నగర తొలి ముస్లిం మేయర్ జోహ్రాన్ మమ్దానీ అధికారిక నివాసమైన 'గ్రేసీ మాన్షన్' లక్ష్యంగా పేలుడు కుట్ర జరిగింది. ముఖ్యంగా రెండు విరుద్ధ నిరసన బృందాల మధ్య ఘర్షణలు తీవ్రరూపం దాల్చిన సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. అప్రమత్తమైన పోలీసులు ఇద్దరు ప్రధాన నిందితులను అదుపులోకి తీసుకున్నారు. పవిత్ర రంజాన్ మాసంలో మేయర్ మమ్దానీ నివాసం వెలుపల రెండు వర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఇన్‌ఫ్ల్యూయెన్సర్ జేక్ లాంగ్ ఆధ్వర్యంలో జరిగిన ఇస్లాం వ్యతిరేక నిరసనను అడ్డుకునేందుకు సుమారు 125 మందితో కూడిన మరొక బృందం 'డ్రైవ్ ది నాజీస్ అవుట్ ఆఫ్ న్యూయార్క్' పేరుతో ఎదురు నిరసన చేపట్టింది. ఈ క్రమంలోనే మధ్యాహ్నం 12.15 గంటల సమయంలో ఒక నిరసనకారుడు పెప్పర్ స్ప్రే ప్రయోగించడంతో ఉద్రిక్తతలు తలెత్తాయి. వెంటనే 18 ఏళ్ల ఓ యువకుడు తన వద్ద ఉన్న అనుమానాస్పద పేలుడు పరికరాన్ని వెలిగించి నిరసన ప్రాంతం వైపు విసిరాడు. అయితే అది గాల్లో ప్రయాణిస్తూ.. మంటలు, పొగను చిమ్ముతూ పోలీస్ బారికేడ్లను తాకి, అధికారులకు కేవలం కొద్ది అడుగుల దూరంలోనే పడిపోయింది. ఆ తర్వాత మరో 19 ఏళ్ల యువకుడి వద్ద నుంచి రెండో పరికరాన్ని తీసుకుని వెలిగించేందుకు ప్రయత్నిస్తుండగా పోలీసులు వారిని చాకచక్యంగా పట్టుకున్నారు. పోలీసు కమిషనర్ జెసికా టిష్ వెల్లడించిన వివరాల ప్రకారం.. స్వాధీనం చేసుకున్న రెండు పరికరాలు ఫుట్‌బాల్ కంటే కొంచెం చిన్నగా ఉన్నాయి. ఒక గాజు జార్‌కు నల్లటి టేప్ చుట్టి, అందులో బోల్టులు, స్క్రూలు, వెలిగించేందుకు వీలుగా ఒక 'హాబీ ఫ్యూజ్' అమర్చినట్లు చెప్పారు. ఇవి నిజంగా పనిచేసే పేలుడు పదార్థాలా లేక కేవలం భయపెట్టేందుకు తయారు చేసినవా అనే కోణంలో బాంబు స్క్వాడ్, ఎఫ్‌బీఐ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ దాడి ప్రయత్నం జరిగిన సమయంలో మేయర్ మమ్దానీ, ఆయన భార్య రామా దువాజీ నివాసంలోనే ఉన్నప్పటికీ.. అదృష్టవశాత్తు వారికి ఎలాంటి గాయాలు కాలేదు. ప్రస్తుతం వారిద్దరూ సురక్షితంగానే ఉన్నారని మేయర్ ప్రతినిధి జో కాల్వెల్లో ధృవీకరించారు. మేయర్ నివాసాన్ని లక్ష్యంగా చేసుకోవడం హేయమైన చర్య అని ఆయన ఖండించారు. ప్రస్తుతం ఆ ప్రాంతమంతటా భద్రతా బలగాలను మోహరించారు. స్నిఫర్ డాగ్స్ సహాయంతో పరిసర ప్రాంతాల్లో ఎక్కడైనా మరిన్ని పేలుడు పదార్థాలు ఉన్నాయేమోనని పోలీసులు క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు. న్యూయార్క్ గవర్నర్ కేథీ హోచుల్ ఈ ఘటనపై స్పందిస్తూ.. "న్యూయార్క్‌లో శాంతియుత నిరసనలకు తావుంది. కానీ ద్వేషానికి, హింసకు ఇక్కడ చోటు లేదు" అని స్పష్టం చేశారు. అంతేకాకుండా ప్రస్తుతం పశ్చిమాసియాలో జరుగుతున్న యుద్ధంతో ఈ ఘటనకు ఎలాంటి సంబంధం లేదని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు.

## సామాన్యుడిపై ప్రత్యక్ష దాడి దేశవ్యాప్త నిరసనలకు పిలుపు




**హైదరాబాద్ పెన్ పవర్:** పశ్చిమాసియా సంక్షోభ పరిస్థితులను సాకుగా చూపి వంటగ్యాస్ ధరలను అమాంతం పెంచేసి..కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం సామాన్యులపై ప్రత్యక్ష దాడికి పాల్పడిందని మహిళాలోకం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వంటగ్యాస్ ధరల పెంపుదలను కానుకగా ఇచ్చిన మోడీ సర్కార్ తీరును నిరసించింది. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో ఆదివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఐద్వా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు పికె శ్రీమతి టీచర్, కనినికా ఘోష్ మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సాధికారతను సమర్థించే రోజని, అయితే దేశంలోని వంటగదుల్లో వాస్తవికత వేరే కథను చెబుతోందని అన్నారు. ఉపశమనం కలిగించే బదులు, గ్యాస్ ధరలను 60 శాతం పెంచి దేశంలోని మహిళలకు అణిచివేత, ఆర్థిక భారం రూపంలో కేంద్ర ప్రభుత్వ పెద్దలు 'బహుమతి' ఇచ్చారని విమర్శించారు. ఉజ్వల వంటి సంక్షేమ పథకాల విజయాన్ని కేంద్రం ప్రచారం చేస్తున్నప్పటికీ, ధరల పెంపు ఆ పేద లబ్దిదారులనూ వదిలిపెట్టదని చెప్పారు. సబ్సిడీ లేని ఎల్‌పిజి ఒకే ఏడాదిలో రూ.110 పెరిగిందని, ఈ వారం వాణిజ్య సిలిండర్ ధర రూ.114.50 పెరిగిందని తెలిపారు. ఈ 'ఇంధన ఆధారిత ద్రవ్యోల్బణం' రెండు వైపులా పదును గల కత్తి లాంటిదని విమర్శించారు. ఇది ఇంట్లో వండిన ఆహార పదార్థాల ధరను పెంచుతూ, ఇప్పటికే తగ్గిపోతున్న వాస్తవ ఆదాయాలతో కుంగిపోతున్న మధ్యతరగతి, శ్రామిక ప్రజలకు అవసరమైన వస్తువుల ధరలను పెంచుతుందన్నారు. ఈ అస్థిరతకు మూలం.. పెరుగుతున్న పశ్చిమాసియా వివాదంలో ఉందని, బ్రెంట్ ముడిచమురు ఒకేవారంలో దాదాపు 27 శాతం పెరగడం, ఎల్ఎన్‌జి సరఫరా అంతరాయం ఎదుర్కొంటున్నందున, ఇండియా ఇంధన భద్రత ముట్టడిలో ఉందన్నారు. అయితే, ఈ సంక్షోభం పాశ్చాత్య ఆధిపత్యానికి 'లొంగిపోవడాన్ని' ప్రతిబింబిస్తుందని విమర్శించారు. మోడీ ప్రభుత్వం ప్రజల ప్రయోజనాలను విస్మరిస్తూ ప్రపంచ ఆధిపత్య ప్రయోజనాలకు సేవ చేస్తోందని తెలిపారు.

## ఎండలతో పాటే మండనున్న ఏసీల ధరలు




**హైదరాబాద్ పెన్ పవర్:** ఎండలు అప్పుడే మండుతున్నాయి.. ఎయిర్ కండీషనర్ (ఏసీ) కొనుక్కుని ఉపశమనం పొందుదామనుకుంటే, కంపెనీలు ధరలు పెంచేస్తున్నాయి. ఏసీ తయారీలో కీలకమైన రాగి వంటి ముడి పదార్థాల ధరలు పెరగడం, డాలరుతో పోలిస్తే రూపాయి బలహీనపడటం, ఇంధన వినియోగానికి సంబంధించి ఏసీ స్టార్‌రేటింగ్ ప్రమాణాలు మారడం ఇందుకు కారణమని కంపెనీలు చెబుతున్నాయి. కొన్ని విడిభాగాలను విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నందున, రూపాయి విలువ తగ్గే కొద్దీ కంపెనీలకు భారం పెరుగుతోంది. కొత్త ప్రమాణాలకు అనుగుణంగా రూపొందించేందుకు, తయారీ వ్యయాలు అధికమవుతున్నాయన్నది కంపెనీల వాదన. ఫలితంగా ఏసీల ధరలు 5–15% పెరిగే అవకాశం ఉంది. డైకిన్, వోల్టాస్, బ్లూస్టార్, ఎల్‌జీ, హయర్, మిత్సుబిషి కంపెనీలు తమ అన్ని మోడళ్ల ఏసీల ధరలు పెంచుతున్నట్లు ప్రకటించాయి.

దేశీయంగా ఏడాదికి 1.35 కోట్ల ఏసీలు అమ్ముడవుతున్నాయని అంచనా. బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ నూతన నిబంధనలు ఈ ఏడాది జనవరి 1 నుంచి అమల్లోకి వచ్చాయి. దీంతో కొత్త 5–స్టార్ రూమ్ ఏసీ, పాత మోడల్ కంటే 10% విద్యుత్‌ను ఆదా చేసే అవకాశం ఉంది.

## పతనమైన బంగారం .. స్థిరంగానే వెండి




**హైదరాబాద్ పెన్ పవర్:** గతవారంలో శుక్రవారం వరకూ పతనమవుతూ వచ్చిన బంగారం ధర.. శనివారం భారీగా పెరిగింది. తాజాగా బంగారం రేటు మళ్లీ తగ్గింది. 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1960 తగ్గగా..రూ.1,61,680కి దిగొచ్చింది. 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1800 తగ్గగా.. రూ.1,48,200కి పతనమైంది. దీంతో కొనుగోలు దారులు బంగారం కొనుగోలుకు మక్కువ చూపుతున్నారు.

కిలో వెండి ధర రూ.2,90,000 వద్ద స్థిరంగా కొనసాగుతోంది. అంతర్జాతీయ మార్కెట్లో లాభాల స్వీకరణ, డాలర్ బలపడటం వంటి కారణాల వల్ల ధరలు తగ్గుతున్నాయి. ప్రస్తుతం స్టాక్ మార్కెట్లు భారీగా పతనమవుతున్నాయి. మార్కెట్లు అనిశ్చితిగా ఉన్నప్పుడు బంగారం ఎప్పుడూ సురక్షితమైన పెట్టుబడిగా మారుతుంది. మదుపరులు బంగారంపై పెట్టుబడులు పెంచితే.. ధరలు పెరిగే ఛాన్స్ ఉంది.

## వంటగ్యాస్ ధరల పెంపును ఉపసంహరించుకోవాలి

**హైదరాబాద్ పెన్ పవర్:** వంటగ్యాస్ ధరల పెంపును తక్షణమే ఉపసంహరించుకోవాలని సిపిఎం పొలిట్‌బ్యూరో డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. గృహావసరాల, వాణిజ్య గ్యాస్ సిలిండర్ల రెండింటి ధరలను భారీగా పెంచడాన్ని ఈ ప్రకటనలో పొలిట్‌బ్యూరో తీవ్రంగా వ్యతిరేకించింది. ఉజ్వల పథకం లబ్ధిదారులను కూడా విడిచిపెట్టకుండా గృహావసరాల గ్యాస్ వినియోగదారులపై రూ. 60 పెంపు క్రూరమైనదని విమర్శించింది. వాణిజ్య గ్యాస్ సిలిండర్‌పై రూ. 114.50 పెంపు కూడా చివరికి వినియోగదారులపై పడుతుందని పేర్కొంది. ఇప్పటికే నిరంతర ధరల పెరుగుదల, క్షీణిస్తున్న వాస్తవ ఆదాయాలతో కుంగిపోతున్న మధ్యతరగతి, శ్రామిక ప్రజలపై ఈ పెంపులు మరింత భారాన్ని మోపుతాయని విమర్శించింది. సిలిండర్లపై పన్నుల ద్వారా వచ్చే ఆదాయాన్ని వదులుకోవడానికి ప్రభుత్వం నిరాకరించడం దాని ప్రజా వ్యతిరేక స్వభావాన్ని బహిర్గతం చేస్తుందని పొలిట్‌బ్యూరో స్పష్టం చేసింది. పశ్చిమాసియా వివాదం ఈ గ్యాస్ ధరల పెంపునకు కారణమమని మోడీ ప్రభుత్వం సమర్థించుకోవడం దాని స్వయంకృత అపరాధాన్ని కప్పిపుచ్చుకోవడానికి క్రూరమైన ప్రయత్నం తప్ప మరొకటి కాదని విమర్శించింది. నిజానికి ఇది ట్రంప్ ప్రభుత్వ యుద్ధోన్మాద విధానాల ముందు మోడీ ప్రభుత్వం లొంగిపోవడం, దేశ ప్రజల ప్రయోజనాలను విస్మరిస్తూ అమెరికా ప్రపంచ ఆధిపత్య ప్రయోజనాలకు సేవ చేయడానికి మోడీ ప్రభుత్వ సంసిద్ధతను ప్రతిబింబిస్తుందని విమర్శించింది. ఈ ధరల పెంపును తక్షణమే ఉపసంహరించుకోవాలని ఈ ప్రకటనలో సిపిఎం డిమాండ్ చేసింది.

## రాజీనామా కారణాలను సరైన సమయంలో వెల్లడిస్తా

**హైదరాబాద్ పెన్ పవర్:** గవర్నర్ పదవికి తాను రాజీనామా చేయడానికి కారణాలను తగిన సమయంలో బయటపెడతానని, అంతవరకు అది రహస్యమేనని పశ్చిమబెంగాల్ మాజీ గవర్నర్ సి.వి.ఆనందబోస్ చెప్పారు. అన్నీ ఆలోచించే ఆ పదవికి రాజీనామా చేశానని చెప్పారు. క్రికెట్ భాషలో చెప్పాలంటే బెంగాల్‌లో తాను 12 సెంచరీలు చేసినట్లేనని, 1,200 రోజులకు పైగా ఆ పదవిలో కొనసాగానని తెలిపారు. ఆట ఎప్పుడు ముగియాలనేది కూడా నియమాల్లో ఉంటుందని నర్మగర్భంగా చెప్పారు. ఢిల్లీకి బయల్దేరడానికి ముందే తాను రాజీనామా చేశానని వెల్లడించారు. దిల్లీ నుంచి ఆదివారం కోల్‌కతాకు తిరిగివచ్చిన ఆయన.. విమానాశ్రయంలో విలేకరులతో మాట్లాడారు. శాసనసభ ఎన్నికల్లో ఓటు వేసేందుకు బెంగాల్‌కు వస్తానన్నారు. "ప్రవేశం ఉన్నచోట నిష్క్రమణ కూడా ఉంటుంది. ఇంతకాలం సేవలందించడం చాలు.

# భారత దేశంలో 308కి చేరిన అపర కుబేరులు



దేశంలో అధిక ధరలతో ప్రజల ఆదాయాలు సన్నగిల్లుతుండగా, కుబేరుల సంఖ్య భారీగా పెరుగుతోంది. హురున్ గ్లోబల్ రిచ్ లిస్ట్ 2026 నివేదిక ప్రకారం.. భారత్ ఇప్పుడు 308 మంది బిలియనీర్లతో ప్రపంచంలోనే మూడవ స్థానంలో నిలిచింది. గడిచిన ఏడాదిలో భారత్‌లో 57 మంది కొత్త బిలియనీర్లు పుట్టుకొచ్చారు. మొత్తం 308 అపర కుబేరుల సగటు సంపద సుమారు రూ.36,570 కోట్లుగా నమోదయ్యింది. వీరందరి మొత్తం సంపద 10 శాతం పెరిగి రూ.112.6 లక్షల కోట్లకు చేరింది. ఇందులో 199 మంది సంపద పెరగ్గా, 109 మంది సంపదలో మార్పు లేకుండా ఉంది. భారతీయ బిలియనీర్లలో 7 శాతం మంది మహిళలు ఉన్నారు. ఇక హెచ్‌సిఎల్ టెక్నాలజీస్ ఛైర్‌పర్సన్ రోష్ని నాడార్ మల్హోత్రా రూ.3.2 లక్షల కోట్లతో మూడో స్థానంలో నిలవడమే కాకుండా.. టాప్ 10 జాబితాలో ఉన్న ఏకైక మహిళగా గుర్తింపు పొందారు. రిలయన్స్ అధినేత ముకేష్ అంబానీ రూ.9.8 లక్షల కోట్ల సంపదతో ఆసియాలోనే అత్యంత సంపన్న వ్యక్తిగా ఉన్నారు. గౌతమ్ అదానీ రూ.7.5 లక్షల కోట్లతో రెండో స్థానంలో కొనసాగుతున్నారు. హెల్త్‌కేర్ రంగంలో అత్యధికంగా 53 మంది కొత్త బిలియనీర్లు నమోదయ్యారు. ఇంధన రంగంలో ఎనిమిదిమంది బిలియనీర్లు ఉన్నప్పటికీ, అత్యధికంగా రూ.18.3 ట్రిలియన్ల సంపదను ఈ రంగం కలిగి ఉంది. 95 మంది బిలియనీర్లతో ముంబయి భారత్‌లో అగ్రస్థానంలో కొనసాగుతోంది. హెల్త్‌కేర్, ఎనర్జీ వంటి కీలక రంగాలు ఈ అపర కుబేరులకు కాసుల వర్షం కురిపిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో సామాన్యుడి పరిస్థితి మాత్రం దయనీయంగా మారుతోంది. బిలియనీర్ల సంపద 10 శాతం పెరిగినప్పటికీ.. పెరుగుతున్న ద్రవ్యోల్బణం, నిరుద్యోగం సామాన్యుడి కొనుగోలు శక్తిని హరిస్తున్నాయి. ముఖ్యంగా హెల్త్‌కేర్, ఆటో విడిభాగాలు, ఎనర్జీ రంగాల్లో కొత్త కుబేరులు పుట్టుకొస్తున్న తరుణంలోనే అదే ఆరోగ్య సేవలు సామాన్యుడికి అత్యంత ఖరీదైనవిగా మారుతుండటం గమనార్హం. ముంబయి వంటి మెట్రో నగరాలు సంపదకు కేంద్రాలుగా మారుతుండగా, గ్రామీణ భారతం ఇప్పటికీ కనీస మౌలిక సదుపాయాల కోసం పోరాటం చేస్తూనే ఉంది. బిలియనీర్ల సంఖ్య పెరగడం ముమ్ముందు రాబోయే ఆర్థిక అసమానతలకు హెచ్చరికలా అనేది ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. 308 మంది కుబేరులు ఉండటం కన్నా, కోట్లాది మంది పేదరికం నుండి బయటపడటమే నిజమైన అభివృద్ధి అని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## మరోసారి పెరిగిన క్రూడ్ ఆయిల్ ధర





మిడిల్ ఈస్ట్ దేశాల్లో జరుగుతున్న యుద్ధం నేపథ్యంలో అంతర్జాతీయ ఇంధన మార్కెట్ తీవ్ర ఒడిదుడుకులు ఎదుర్కొంటోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 100 డాలర్ల మార్కును దాటి 101.19 డాలర్లకు చేరుకుంది. ఇది ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ఒక పెద్ద హెచ్చరిక అని ఆర్థిక రంగ నిపుణులు విశ్లేషిస్తున్నారు. గత నాలుగేళ్ల కాలంలో చమురు ధరలు ఈ స్థాయికి చేరుకోవడం ఇదే మొదటిసారి. ముఖ్యంగా ఇరాన్ సుప్రీం లీడర్‌గా మొజ్తీబా ఖమేనీ బాధ్యతలు చేపట్టడంతో ఇరాన్ ప్రయోజనాల కోసం ఆయన మరిన్ని కఠిన నిర్ణయాలు తీసుకుంటారనే నేపథ్యంలో ఈ పెరుగుదల నమోదైనట్టు తెలుస్తోంది. అలాగే ప్రపంచ చమురు సరఫరాకు అత్యంత కీలకమైన హార్మూజ్ జలసంధి గుండా రవాణా నిలిచిపోతుందేమోనన్న భయం పెట్టుబడిదారులను వెంటాడుతోంది. చమురు ధరలు 100 డాలర్లు దాటడం వల్ల భారతదేశం వంటి దిగుమతులపై ఆధారపడే దేశాలపై తీవ్ర ప్రభావం పడుతుంది. భారత్ తన చమురు అవసరాలలో దాదాపు 85% దిగుమతుల ద్వారానే తీర్చుకుంటుంది. ముడి చమురు ధరలు పెరిగితే దేశంలో పెట్రోల్, డీజిల్, ఒఖఉ ధరలు పెరగడమే కాకుండా, రవాణా ఖర్చులు ఖరీదై నిత్యావసర వస్తువుల ధరలు కూడా ఆకాశాన్ని తాకుతాయి. ఇది ద్రవ్యోల్బణానికి దారితీసి సామాన్యుడి జేబుకు చిల్లు పెడుతుంది. రూపాయి విలువ పడిపోవడం, కరెంట్ అకౌంట్ డెఫిసిట్ పెరగడం వంటి ఆర్థిక సవాళ్లను దేశం ఎదుర్కోవాల్సి ఉంటుంది. యుద్ధం గనుక సుదీర్ఘ కాలం కొనసాగితే, చమురు ధరలు మరింత పెరిగి బ్యారెల్‌కు 120-130 డాలర్ల వరకు వెళ్లవచ్చని మార్కెట్ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. గల్ఫ్ దేశాల నుండి చమురు ఉత్పత్తి తగ్గడం లేదా రవాణా మార్గాల్లో ఆటంకాలు కలగడం వల్ల ప్రపంచవ్యాప్తంగా ఆయిల్ క్రైసిస్ ఏర్పడే అవకాశం ఉంది. ఈ పరిస్థితుల్లో భారత్ తన వ్యూహాత్మక చమురు నిల్వలను ఉపయోగించుకోవాల్సి రావచ్చు. అలాగే రష్యా వంటి ప్రత్యామ్నాయ దేశాల నుండి రాయితీపై చమురు పొందేందుకు దౌత్యపరమైన చర్చలు జరపాల్సి ఉంటుంది. రాబోయే రోజుల్లో మిడిల్ ఈస్ట్ పరిణామాలు ప్రపంచ మార్కెట్ల భవిష్యత్తును నిర్ణయించబోతున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## భారీ నష్టాల్లో సెన్సెక్స్, నిఫ్టీ దేశీయ స్టాక్ మార్కెట్లు క్రాష్..



పశ్చిమాసియా యుద్ధం, క్రూడ్ ఆయిల్ ధరల పెరుగుదల ఎఫెక్ట్ దేశీయ స్టాక్ మార్కెట్లపై భారీగా పడింది. స్టాక్ మార్కెట్లు కుప్పకూలడంతో మదుపరులు ఆందోళన చెందుతున్నారు. నిఫ్టీ ట్రేడింగ్ 700 పాయింట్లకు పైగా నష్టాలతో ప్రారంభమవ్వగా.. 2300 పాయింట్లకు పైగా నష్టాల్లో సెన్సెక్స్ ట్రేడింగ్ మొదలైంది. ట్రేడింగ్ స్టార్టింగ్ సెషన్స్ లోనే భారీ నష్టాలు కనిపించడంతో బ్యాంకింగ్ రంగంపై తీవ్ర ప్రభావం పడింది. ఫార్మా, ఆటోమొబైల్ రంగాలు కూడా నష్టాల్లోనే ట్రేడ్ అవుతున్నాయి. సెన్సెక్స్ టాప్ 30 ఇండెక్స్ సూచీలో షేర్లన్నీ నష్టాల్లోనే ఉండటంతో దేశీయ స్టాక్ మార్కెట్లలో బ్లడ్ బాత్ కనిపిస్తోంది. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు భగ్గుమన్న నేపథ్యంలో స్టాక్ సూచీలు కుప్పకూలాయి. పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితులు, ముడి చమురు ధరల పెరుగుదల భారత స్టాక్ మార్కెట్లపై పెను ప్రభావాన్ని చూపాయి. సోమవారం ట్రేడింగ్‌లో దేశీయ సూచీలు భారీగా కుప్పకూలాయి. ముడి చమురు ధరలు పెరగడం వల్ల షేర్లు.. ముఖ్యంగా బ్యాంకింగ్ రంగానికి చెందిన షేర్ల లాభాల మార్జిన్లు తగ్గుతాయన్న భయంతో పతనమయ్యాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గేవరకు వోలటాలిటీ ఇలాగే కొనసాగే అవకాశం ఉందని మార్కెట్ విశ్లేషకులు చెప్తున్నారు.

# ఏఐతో ఆదాయం ఆర్జిస్తున్నారు





ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) సాధారణ వినియోగంలోకి వస్తున్న నేపథ్యంలో పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు పోతాయని, ముఖ్యంగా గణనీయమైన సంఖ్యలో వైట్-కాలర్ ఉద్యోగాలు ఉండవంటూ రకరకాల ఆందోళనలు ఇప్పటికీ వినిపిస్తూనే ఉన్నాయి. అయితే, ఏఐ మానవ జీవితంతో ఎంత విప్లవాత్మక మార్పులను తీసుకువస్తుందో, దానికి అనుగుణంగా కొన్ని ఉద్యోగాలు పోతాయి, కొత్తవి పుట్టుకొస్తాయని నిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలో ప్రముఖ బ్యాంక్‌బజార్ ఆస్పిరేషన్ ఇండెక్స్ నిర్వహించిన ఓ అధ్యయనంలో ఏఐ ఇప్పటికే చాలామంది ఉద్యోగుల ఆర్థిక జీవితాలను మెరుగుపరిచిందని తేల్చింది. ఈ నివేదిక ప్రకారం, 22 నుంచి 45 ఏళ్ల వయస్సున్న ఉద్యోగుల్లో 40 శాతం కంటే ఎక్కువ మంది ఇప్పటికే ఏఐ కారణంగా తమ ఆదాయం, ఉత్పాదకత పెరిగిందని స్పష్టం చేస్తున్నారు. ఏఐ సాధనాలు ఎక్కువ ఆదాయం ఆర్జించేందుకు, మరింత సమర్థవంతంగా పనిచేయడానికి సహాయ పడుతున్నాయని 42 శాతం మంది చెప్పారు. ఇదే సమయంలో ఏఐ సంబంధిత మార్పుల వల్ల తమ ఆదాయంపై ప్రభావం పడిందని 12 శాతం మంది చెప్పగా, 8 శాతం మంది ఏఐ టూల్స్‌పై ఎక్కువ ఆధారపడటం వల్ల ఆర్థికంగా నష్టపోయినట్టు తెలిపారు. అయితే, ఏఐతో కలిసి పనిచేసేందుకు తమ స్కిల్స్ పెంచుకున్న వారు ఎక్కువ ప్రయోజనాలు పొందినట్టు నివేదిక స్పష్టం చేసింది. చాలామంది కెరీర్ మధ్యలో ఉన్న ప్రొఫెషనల్స్ తమ ఉద్యోగాల్లో ఏఐని ఉపయోగించడం వల్ల పనితీరు గతంలో కంటే బాగుందని ఎక్కువ మంది ఉద్యోగులు అంగీకరిస్తున్నారు. మరోవైపు, ఏఐ-సంబంధిత స్కిల్స్ లేదా అందుకు తగిన ప్రణాళిక లేనివారు తమ ఆదాయంపై ఆశలు సన్నగిల్లుతున్నట్టు చెబుతున్నారు. ఉద్యోగులతో పాటు కంపెనీలు కూడా క్రమంగా ఏఐ వినియోగాన్ని సద్వినియోగం చేసుకుంటున్నాయని మరో నివేదికలో తేలింది. ముఖ్యంగా చిన్న, మధ్య తరహా సంస్థలు ఏఐ ఉపయోగించి, కార్యకలాపాలను విస్తరించి ఆదాయం ఆర్జిస్తున్నాయి. సేల్స్‌ఫోర్స్ రూపొందించిన ఈ నివేదిక ప్రకారం, ఆటోమేటెడ్ సర్వీస్ చాట్‌బాట్స్, మార్కెటింగ్, కంటెంట్ కోసం కంపెనీలు ఎక్కువ ఖర్చు చేయడానికి సిద్ధంగా ఉన్నాయి. ఏఐ కోసం చేసిన ఈ ఖర్చు ద్వారా తమ ఆదాయం గణనీయంగా పెరిగిందని 90 శాతానికి పైగా కంపెనీలు స్పష్టం చేశాయి.

# ఈ చమురు ధరల పెరుగుదల స్వల్పకాలికమే



అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా ఇరాన్‌పై జరిపిన దాడుల నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు భగ్గుమంటున్నాయి. అయితే ఈ ధరల పెరుగుదల కేవలం స్వల్పకాలికమేనని, ప్రపంచ భద్రత, శాంతి కోసం మనం చెల్లించే "చిన్న మూల్యం" మాత్రమేనని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన ఆదివారం తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రుత్ సోషల్'లో ఒక పోస్ట్ చేశారు. 'ఇరాన్ అణు ముప్పు పూర్తిగా తొలగిపోయిన వెంటనే చమురు ధరలు వేగంగా పడిపోతాయి. అమెరికా, అలాగే ప్రపంచ భద్రత, శాంతి కోసం ఈ మాత్రం స్వల్పకాలిక ధరల పెరుగుదలను భరించడం చాలా చిన్న విషయం' అని ట్రంప్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. కాగా, గత కొన్ని రోజులుగా ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్త దాడులు ప్రారంభించినప్పటి నుంచి చమురు ధరలు భారీగా పెరిగాయి. మార్చి 1983 తర్వాత ఒకే వారంలో ఈ స్థాయిలో ధరలు పెరగడం ఇదే తొలిసారి అని అంతర్జాతీయ మీడియా స్పష్టం చేసింది. మధ్యప్రాచ్యంలో యుద్ధ వాతావరణం కారణంగా చమురు ఉత్పత్తి, రవాణాకు తీవ్ర ఆటంకాలు ఏర్పడుతున్నాయి. దీంతో ఆదివారం నాటికి చమురు ధరలు ఏకంగా బ్యారెల్‌కు 100 డాలర్ల మార్క్‌ను దాటాయి. గత మూడున్నరేళ్ల కాలంలో చమురు ధరలు ఈ స్థాయికి చేరడం ఇదే ప్రథమం. ఇంధన ధరల పెరుగుదలపై అమెరికా ఇంధన శాఖ మంత్రి క్రిస్ రైట్ స్పందిస్తూ.. గ్యాస్ స్టేషన్ల వద్ద అమెరికన్లకు ఈ ధరల భారం మరికొన్ని 'వారాల పాటు' తప్పకపోవచ్చని అంగీకరించారు. అయితే, ఈ ఇబ్బంది నెలల తరబడి ఉండబోదని, కొద్ది వారాల్లోనే పరిస్థితులు చక్కబడతాయని ప్రజలకు భరోసా ఇచ్చారు.

# మోదీ, జిన్‌పింగ్‌ల భేటీ తర్వాత సంబంధాల్లో కొత్త అధ్యాయం మొదలైంది




భారత్, చైనా దేశాలు ఒకరికొకరు ముప్పు అని భావించకుండా అభివృద్ధికి తోడ్పడే అవకాశంగా చూడాలని చైనా విదేశాంగ శాఖ మంత్రి వాంగ్ యీ అన్నారు. ఈ రెండు దేశాలు పరస్పరం ప్రత్యర్థుల్లా కాకుండా భాగస్వాములుగా ఉండాలని అన్నారు. వార్షిక మీడియా సమావేశంలో సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అంతర్గత విషయాల్లో జోక్యం చేసుకోకుండా సంబంధాలను మెరుగుపరుచుకునే అంశంలో ఇరుదేశాలు కట్టుబడి ఉండాలని అన్నారు. పొరుగు దేశాలుగా, గ్లోబల్ సౌత్ సభ్యులుగా భారత్, చైనా దీర్ఘకాలిక సంబంధాలను కలిగి ఉన్నాయని ఆయన అన్నారు. పరస్పర విశ్వాసం, సహకారం అనేవి రెండు దేశాల అభివృద్ధికి ప్రయోజనకరంగా ఉంటాయని అన్నారు. విభజనవాదం, ఘర్షణలు అభివృద్ధిని దెబ్బతీస్తాయని సూచించారు. రెండేళ్ల క్రితం కజాన్ వేదికగా భారత ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌ల సమావేశం అనంతరం భారత్, చైనా సంబంధాల్లో కొత్త అధ్యాయం మొదలైందని అన్నారు. గత ఏడాది తియాంజిన్‌లో మోదీ, జిన్‌పింగ్ మరోసారి భేటీ అయ్యారని, ఇది రెండు దేశాల మధ్య సంబంధాలను మరింత మెరుగుపరిచాయని అన్నారు. ద్వైపాక్షిక వాణిజ్యం రికార్డు స్థాయికి చేరుకోవడం, ప్రజల మధ్య సంబంధాలు మెరుగుపడటం వంటివి ఇరుదేశాలకూ ప్రయోజనం చేకూర్చాయని అన్నారు. ఇరు దేశాలు సత్సంబంధాలు, స్నేహాన్ని కాపాడుకోవాలని సూచించారు. సరిహద్దు ప్రాంతాల్లో శాంతి, స్థిరత్వం కొనసాగాలని, అభివృద్ధిపై దృష్టి సారించాలని ఆయన అన్నారు.

# సారీ చెప్పిన కొద్దిసేపటికే పొరుగు దేశాలకు ఇరాన్ వార్నింగ్

పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా తన పొరుగు దేశాలపై జరిపిన దాడులకుఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజిష్కియాన్ శనివారం క్షమాపణలుచెప్పిన విషయం తెలిసిందే. అయితే, కొద్ది గంటల్లోనే యూటర్న్ తీసుకుని..పక్క దేశాలకు ఇరాన్ వార్నింగ్ ఇచ్చింది. ఇరాన్ న్యాయవ్యవస్థ చీఫ్ మాట్లాడుతూ.. ఇరాన్‌కు శత్రువులుగా ఉన్న దేశాలకు.. తమ భూభాగాలను దాడులకు వినియోగించుకోడానికి అవకాశం కల్పిస్తున్న పొరుగు దేశాలపై దాడులు కొనసాగుతాయని హెచ్చరించారు. 'మన దేశంపై దాడులకు అవసరమైన స్థావరాలను శత్రువులకు అందిస్తున్న ప్రాంతీయ పొరుగు దేశాలను ఇస్లామిక్ రిపబ్లిక్ లక్ష్యంగా చేసుకోవడం కొనసాగిస్తుంది' అని ఆయన ఉద్ఘాటించారు. "ఇరాన్ సాయుధ దళాల నుంచి వచ్చిన ఆధారాలు పశ్చిమాసియాలోని కొన్ని దేశాల భౌగోళిక ప్రాంతాలు శత్రువుల వినియోగానికి బహిరంగంగా, రహస్యంగానో అనుకూలంగా ఉన్నాయని చూపుతున్నాయి" అని తాత్కాలిక నాయకత్వ మండలి సభ్యుడు అయిన ఘోలామ్‌హోస్సేన్ మొహ్సేని ఎజీ అన్నారు. 'ఈ లక్ష్యాలపై భారీ దాడులు కొనసాగుతాయి' అని ఆయన అన్నారు. కాగా, పెజిష్కియాన్ క్షమాపణలు చెప్పిన కాసేపటికే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్..వారిని ఎగతాళి చేస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టిన విషయం తెలిసిందే. ఇరాన్ తోక ముడిచిందని, ఇక అది ఎలాంటి దాడులు చేయలేదని ఎద్దేవా చేశారు. అంతేకాదు, భారీ దాడులు తప్పవని హెచ్చరించారు. గతవారం అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త దాడులతో ఇరాన్ ప్రతీకార దాడులు ప్రారంభించింది. ఈ క్రమంలో పశ్చిమాసియాలోని అమెరికా స్థావరాలపై దాడులు చేస్తోంది. అమెరికా మిత్రులైన గల్ఫ్ దేశాల్లో ఈ స్థావరాలు ఉండటంతో ఇరాన్ వాటిని టార్గెట్ చేసింది. దీంతో క్షిపణులు, డ్రోన్‌లతో విధ్వంసం సృష్టిస్తోంది. ఈ నేపథ్యంలో పొరుగు దేశాలపై తాము

ఉద్దేశపూర్వకంగా దాడులు చేయలేదని ఇరాన్ శనివారం ప్రకటించింది. డ్రోన్లు, క్షిపణులతో దాడులు చేసే ఆలోచన తమకు లేదని క్షమాపణలు చెప్పింది. అంతేకాదు, మీ భూభాగాల నుంచి మాపై దాడులు చేయకుంటే తాము కూడా ఎలాంటి చర్యలకు పాల్పడమని ఇరాన్ అధ్యక్షుడు అన్నారు. దీనిపై తాత్కాలిక నాయకత్వ మండలి నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. కానీ, అంతలోనే మళ్లీ యూటర్న్ తీసుకోవడం గమనార్హం.

# ప్రపంచ దేశాలపై ఒత్తిడి తగ్గించేందుకే.. భారత్‌కు మినహాయింపునిచ్చాం



పశ్చిమాసియాలో ముదురుతున్న యుద్ధ మేఘాలు ప్రపంచ చమురు మార్కెట్‌ను అతలాకుతలం చేస్తున్నాయి. ముఖ్యంగా గల్ఫ్ దేశాల నుంచి చమురు రవాణాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధి మూతపడటంతో ఇంధన ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఈ ఉద్రిక్త పరిస్థితులపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఆదివారం సంచలన వ్యాఖ్యలు చేశారు. చమురు ధరల పెరుగుదలపై తమకేమీ ఆందోళన లేదని.. పరిస్థితిని ఎదుర్కోవడానికి అమెరికా సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. ఎయిర్ ఫోర్స్ వన్ విమానంలో విలేకరులతో మాట్లాడిన ట్రంప్.. పెట్రోల్, డీజిల్ ధరల ఒత్తిడిని తగ్గించడానికి తమ ప్రభుత్వం వద్ద తగినన్ని వనరులు ఉన్నాయని పేర్కొన్నారు. "మా దేశంలో అపారమైన చమురు నిల్వలు ఉన్నాయి. యుద్ధం వల్ల తలెత్తిన ఈ సమస్య చాలా త్వరగా పరిష్కారం అవుతుంది" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గత నెల చివరి నాటికి అమెరికా వద్ద దాదాపు 415 మిలియన్ బారెళ్ల వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలు ఉన్నాయని, అత్యవసరమైతే వాటిని వినియోగిస్తామని ఆయన సూచనప్రాయంగా వెల్లడించారు. అంతేకాకుండా ఇరాన్ యుద్ధం కారణంగా ప్రపంచ ఇంధన భద్రతకు ముప్పు వాటిల్లిన నేపథ్యంలో.. భారత్‌కు అమెరికా స్వల్ప ఉపశమనం కలిగించింది. రష్యా నుంచి చమురు కొనుగోలు చేసేందుకు భారత రిఫైనరీలకు 30 రోజుల తాత్కాలిక మినహాయింపు ఇస్తున్నట్లు అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెసెంట్ వెల్లడించారు. ఇదే విషయాన్ని తాజాగా ట్రంప్ గుర్తు చేస్తూ.. ఒత్తిడి తగ్గించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. అయితే ఇప్పటికే సముద్ర మార్గంలో ఉన్న చమురు రవాణాకు మాత్రమే ఇది వర్తిస్తుందని, దీనివల్ల రష్యాకు పెద్దగా ఆర్థిక ప్రయోజనం ఉండదని కూడా ట్రంప్ పేర్కొన్నారు. భారత్ తమకు అత్యంత ముఖ్యమైన భాగస్వామి అని, భవిష్యత్తులో భారత్ అమెరికా నుంచి చమురు కొనుగోళ్లను పెంచుతుందని తాము ఆశిస్తున్నట్లు ఆయన చెప్పారు. గతంలో రష్యా నుంచి చమురు కొన్నందుకు భారత్‌పై ట్రంప్ 25 శాతం సుంకాలు విధించిన సంగతి తెలిసిందే.

# దానిమ్మ జ్యూస్ తాగుతున్నారా?



ఒక దానిమ్మ పండు వంద వ్యాధులను నయం చేస్తుంది.. ఇది సామెత మాత్రమే కాదు..! వాస్తవం అంటున్నారు ఆరోగ్య నిపుణులు. దానిమ్మ పండుతో పాటు ఈ మొక్కలోని ప్రతి భాగం మనకు ఉపయోగపడుతుంది. అది దానిమ్మ పువ్వు అయినా, దాని బెరడు అయినా, దాని వేర్లు అయినా లేదా దాని పండు అయినా. దానిమ్మ రసం మన శరీరంలోని వివిధ రకాల జీవ, సేంద్రీయ ప్రక్రియలను సానుకూలంగా ప్రభావితం చేసే సామర్థ్యాన్ని కలిగి ఉంది. శాస్త్రీయ అధ్యయనాల ప్రకారం, దానిమ్మలో ఉండే వివిధ పోషకాలు, యాంటీఆక్సిడెంట్లు దీనిని ఔషధ పండుగా చేస్తాయి. లెక్కలేనన్ని ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. దానిమ్మ ఒక సూపర్ ఫుడ్ కంటే తక్కువ కాదు. జ్యూసిగా ఉండి ఎర్రటి విత్తనాలతో నిండిన ఈ పండు యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు, ఖనిజాల నిధి. అందువల్ల, ఇది ఆరోగ్యానికి చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. కానీ, ప్రతి ఉదయం ఖాళీ కడుపుతో దానిమ్మ రసం తాగడం ప్రారంభిస్తే మీ ఆరోగ్యానికి ఎంత మేలు జరుగుతుందో మీకు తెలుసా? అవును, ప్రతి ఉదయం ఖాళీ కడుపుతో దానిమ్మ రసం తాగడం వల్ల శరీరం పోషకాలను వేగంగా గ్రహించి మీ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ఉదయం ఖాళీ కడుపుతో ఒక గ్లాస్ దానిమ్మ రసం తాగడం వల్ల జీర్ణవ్యవస్థ ఉత్తేజితమవుతుందని నిపుణులు సూచిస్తున్నారు. ప్రేగులు శుభ్రపడి, టాక్సిన్లు బయటకు వెళ్లి లివర్ పనితీరు మెరుగుపడుతుందంటున్నారు. ఇందులో విటమిన్ అ, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండి, ఇన్ఫెక్షన్లను తట్టుకునే శక్తిని పెంచి, వాపులను తగ్గిస్తాయి. ఉదయం ఖాళీ కడుపుతో దానిమ్మ రసం తాగడం వల్ల జీర్ణక్రియ సరిగ్గా పనిచేస్తుంది. పేగు ఆరోగ్యం మెరుగుపడుతుంది. దానిమ్మపండు తినడం వల్ల రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. చెడు కొలెస్ట్రాల్ (ఒఆఒ) తగ్గుతుంది. గుండెపోటు, స్ట్రోక్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. దానిమ్మలో విటమిన్ సి, ఫోలేట్ పుష్కలంగా ఉంటాయి. ఇది ఇన్ఫెక్షన్లతో పోరాడటానికి సహాయపడుతుంది. దానిమ్మలో ఉండే మంచి ఫైబర్ కంటెంట్ జీర్ణక్రియను ప్రోత్సహిస్తుంది. మలబద్ధకాన్ని తగ్గిస్తుంది. చక్కెర కలపని తాజా రసాన్ని ఉదయం 100–150 మి.లీ. తాగిన 20–30 నిమిషాల తర్వాత అల్పాహారం తీసుకోవడం మంచిదంటున్నారు. దానిమ్మ శరీరంలో మంటను తగ్గించడంలో సహాయపడుతుంది. దానిమ్మ మొటిమలను తగ్గించడానికి, చర్మాన్ని ప్రకాశవంతం చేయడానికి, వృద్ధాప్య సంకేతాలను నివారించడానికి సహాయపడుతుంది. దానిమ్మపండు క్యాన్సర్ కణాల పెరుగుదలను నిరోధించే సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. అధిక రక్తపోటు (బిపి) ఉన్నవారికి దానిమ్మ మంచి పండు.

# ఫ్రిజ్, మట్టి కుండ నీరు ఆరోగ్యానికి ఏది నిజమైన అమృతం?



ఒకప్పుడు ప్రతి ఇంట్లోనూ వేసవి వచ్చిందంటే మట్టి కుండలే రాజ్యమేలేవి. కాలక్రమేణా ఫ్రిజ్‌లు వచ్చాక ఆ అలవాటు మరుగున పడిపోయింది. కానీ ఫ్రిజ్ నీరు ఇచ్చే చల్లదనం కేవలం నాలుకకే.. అదే మట్టి కుండ ఇచ్చే చల్లదనం మొత్తం శరీరానికి ఆరోగ్యం.. అసలు మట్టి కుండలో నీరు తాగడం వల్ల గ్యాస్ట్రిక్ సమస్యలు ఎలా తగ్గుతాయి? వేసవి కాలం మొదలైందంటే చాలు.. భానుడి భగభగలకు తట్టుకోలేక అందరం చల్లటి నీటి కోసం వెతుకుతాం. ఈ క్రమంలో చాలామంది ఫ్రిజ్‌లో ఉంచిన ఐస్ వాటర్ తాగడానికి మొగ్గు చూపుతారు. అయితే ఫ్రిజ్ నీరు తాత్కాలికంగా ఉపశమనాన్ని ఇచ్చినప్పటికీ.. అది గొంతు నొప్పి, ఇతర ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది. మన పూర్వీకులు అనుసరించిన మట్టి కుండ పద్ధతే వేసవికి అత్యంత సురక్షితమైన, ఆరోగ్యకరమైన మార్గమని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. మట్టి కుండ కేవలం నీటిని చల్లబరచడమే కాదు.. సహజంగా శుద్ధి చేస్తుంది. మట్టిలో ఉండే పోషకాలు నీటిలోని మలినాలను తొలగించి, శరీరంలోని విష పదార్థాలను బయటకు పంపుతాయి. ఇది రోగనిరోధక శక్తిని మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తుంది. మనం తినే ఆహారం వల్ల శరీరంలో అసిడిటీ పెరుగుతుంది. మట్టి సహజంగా ఆల్కలైన్ గుణాన్ని కలిగి ఉంటుంది. మట్టి కుండలోని నీరు తాగడం వల్ల శరీరంలోని జూఊ స్థాయి సమతుల్యంగా ఉంటుంది. దీనివల్ల గ్యాస్ట్రిక్ సమస్యలు, మలబద్ధకం, అసిడిటీ వంటి సమస్యలు దూరమవుతాయి. ప్లాస్టిక్ బాటిల్స్ లేదా ఫ్రిజ్ నీటిలో కెమికల్స్ ఉండే అవకాశం ఉంటుంది. కానీ మట్టి కుండ నీటిలో ఎటువంటి రసాయనాలు ఉండవు. ఈ నీటిలోని ఖనిజాలు జీర్ణక్రియను మెరుగుపరచడమే కాకుండా శరీర జీవక్రియను వేగవంతం చేస్తాయి. వేసవిలో తీవ్రమైన వేడి వల్ల శరీరం త్వరగా డీహైడ్రేషన్‌కు గురవుతుంది. మట్టి కుండ నీటిలో ఉండే పోషకాలు, ఖనిజాలు శరీరాన్ని త్వరగా రీహైడ్రేట్ చేయడంలో సహాయపడతాయి. తద్వారా వడదెబ్బతగలకుండా రక్షిస్తాయి. ఫ్రిజ్ నీరు తాగితే గొంతు నొప్పి లేదా జలుబు చేసే అవకాశం ఉంది. కానీ మట్టి కుండ నీరు గొంతుకు చాలా మెత్తగా ఉంటుంది. శ్వాసకోస ఇబ్బందులు ఉన్నవారికి కూడా ఈ నీరు ఎంతో మేలు చేస్తుంది. ఈ వేసవిలో కృత్రిమమైన చల్లదనం కంటే, ప్రకృతి సిద్ధమైన మట్టి కుండ నీటిని ఎంచుకోండి. ఇది కేవలం దాహాన్ని తీర్చడమే కాదు, మీ శరీరానికి అవసరమైన ఖనిజాలను అందించి మిమ్మల్ని ఆరోగ్యంగా ఉంచుతుంది.

# పుదీనా శక్తి ఏమిటో తెలుసా?




వేసవి కాలంలో చాలా మంది పుదీనా చట్నీని ఇష్టపడతారు.. ఎందుకంటే ఇది శరీరాన్ని చల్లబరుస్తుంది. అయితే, దాని ప్రయోజనాల గురించి కొంతమందికి మాత్రమే తెలుసు. పుదీనా ఆకులలో అనేక విటమిన్లు, ఖనిజాలు ఉంటాయి. జంజ్‌గిర్ చంపా జిల్లా ఆసుపత్రిలోని ఆయుష్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఫణీంద్ర భూషణ్ దివాన్, పుదీనా ఆకులు ఆరోగ్యానికి చాలా ప్రయోజనకరంగా ఉంటాయని వివరించారు. పుదీనా మొక్కలు ఔషధ గుణాలతో సమృద్ధిగా ఉంటాయి . వాటిలో విటమిన్లు, రాగి, మాంగనీస్,కార్బోహైడ్రేట్లు ఉంటాయి. ఇవన్నీ మానవ శరీరానికి అవసరమైనవి. పుదీనా పురాతన వంటకాల మూలికలలో ఒకటి. ఇది ఔషధ గుణాలను కలిగి ఉంటుంది. ముఖ్యంగా పుదీనా ఆరోగ్యకరమైన జీర్ణక్రియకు ప్రయోజనకరంగా పరిగణిస్తారు. ఇది తలనొప్పి, ఉబ్బసం నుండి కూడా ఉపశమనాన్ని అందిస్తుంది. వేసవి కాలంలో ప్రతి ఒక్కరూ వేడి నండి ఉపశమనం కోసం పుదీనా నీటిని తాగాలి. పుదీనాలో యాంటీఆక్సిడెంట్లు, మెంథాల్, ఫైటోన్యూట్రియెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి ఆహారాన్ని జీర్ణం చేయడానికి సహాయపడతాయి. పిప్పరమెంటులోని ముఖ్యమైన నూనెలు బలమైన యాంటీ బాక్టీరియల్, క్రిమినాశక ప్రభావాలను కలిగి ఉంటాయి. ఇవి కడుపు తిమ్మిరిని ఉపశమనం చేస్తాయి. ఆమ్లత్వం, వాయువును తగ్గించడంలో సహాయపడతాయి. పుదీనాను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల ఛాతీ రద్దీని తగ్గిస్తుంది. పుదీనాలోని మిథనాల్ డీకంజెస్టెంట్‌గా పనిచేస్తుంది. ఊపిరితిత్తులలోని శ్లేష్మాన్ని సడలించడానికి, ఉబ్బిన ముక్కు పొరలను కుదించడానికి సహాయపడుతుంది. పుదీనాలో మెంథాల్ ఉంటుంది. ఇది కండరాలను సడలించడానికి, నొప్పిని తగ్గించడానికి సహాయపడుతుంది. పుదీనా రసాన్ని నుదిటిపై రాసుకోవడం వల్ల తలనొప్పి నుండి ఉపశమనం లభిస్తుంది. మార్నింగ్ సిక్‌నెస్‌తో పాటు వచ్చే వికారంకు పుదీనా ఒక ప్రభావవంతమైన చికిత్స. ప్రతిరోజూ ఉదయం కొన్ని పుదీనా ఆకులను తినడం లేదా వాటిని వాసన చూడటం వల్ల గర్భిణీ స్త్రీలు వికారం నుండి బయటపడటానికి సహాయపడుతుంది. పుదీనా బలమైన, తాజా సువాసనను కలిగి ఉంటుంది. ఇది ఒత్తిడిని తగ్గిస్తుంది. శరీరం, మనస్సును రిఫ్రెష్ చేస్తుంది. పుదీనాలో యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీ బాక్టీరియల్ లక్షణాలు ఉన్నాయి. ఇవి చర్మంపై మొటిమలు, మచ్చలకు చికిత్స చేయడంలో సహాయపడతాయి. పుదీనా ఆకులలో అధిక మొత్తంలో సాలిసిలిక్ ఆమ్లం ఉంటుంది. ఇది మొటిమల నిరోధక ఏజెంట్‌గా పనిచేస్తుంది. ఇది ప్రభావవంతమైన చర్మ క్లెన్సర్‌గా కూడా పనిచేస్తుంది. పుదీనాలో యాంటీఆక్సిడెంట్ లక్షణాలు ఉన్నాయి. ఇవి శరీరం నుండి ఫ్రీ రాడికల్స్‌ను తొలగించడంలో సహాయపడతాయి. మీకు స్పష్టమైన, యవ్వన చర్మాన్ని ఇస్తాయి. నోటి పరిశుభ్రత, దంత ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి పుదీనా ఆకులను నమలడం మంచిది. పుదీనాలోని ముఖ్యమైన నూనెలు మీ శ్వాసను తాజాగా ఉంచడంలో సహాయపడతాయి. అదనంగా, పుదీనా నూనె కలిగిన మౌత్ వాష్ వాడటం వల్ల మీ నోటిలోని బ్యాక్టీరియాను చంపి, ఆరోగ్యకరమైన చిగుళ్ళు, దంతాలను అందిస్తుంది. పరిశోధన ప్రకారం, పుదీనా జ్ఞాపకశక్తిని మెరుగుపరుస్తుంది. మెదడు అభిజ్ఞా పనితీరును పునరుద్ధరిస్తుంది. పుదీనాను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల చురుకుదనం, జ్ఞాపకశక్తి నిలుపుదల, ఇతర అభిజ్ఞా విధులను మెరుగుపరచడం ద్వారా మెదడు శక్తిని పెంచుతుంది. ముఖంపై ఉన్న మచ్చలను తొలగించడానికి కూడా పుదీనాను ఉపయోగించవచ్చు. దీనిని గ్రైండ్ చేసి పేస్ట్ లాగా అప్లై చేయడం వల్ల చర్మ సమస్యలు తగ్గుతాయి.

## ఇవి తింటే క్యాన్సర్ పని ఖతమే



మారుతున్న కాలం.. మారుతున్న ఆహారపు అలవాట్లు.. మనకు తెలియకుండానే మనల్ని అనారోగ్యం వైపు నడిపిస్తున్నాయా? అంటే అవుననే అంటున్నాయి తాజా పరిశోధనలు. ఒకప్పుడు వృద్ధాప్యంలో వచ్చే క్యాన్సర్.. నేడు 20 ఏళ్ల యువతను కూడా వదలడం లేదు. నేటి ఆధునిక కాలంలో మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్ల కారణంగా ప్రాణాంతక క్యాన్సర్ బారిన పడుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ముఖ్యంగా గతంలో వృద్ధుల్లో ఎక్కువగా కనిపించే ఈ వ్యాధి, ఇప్పుడు యువతను కూడా కలవరపెడుతోంది. అయితే మనం తీసుకునే ఆహారంలో కొన్ని మార్పులు చేసుకోవడం ద్వారా ఈ ముప్పును గణనీయంగా తగ్గించుకోవచ్చని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. చిలగడదుంపలు కేవలం రుచికరమైనవే కాదు, అద్భుతమైన పోషకాల గని. వీటిలో విటమిన్ ం, ః6, అ తో పాటు బీటా–కెరోటిన్, ఆంథోసైనిన్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి కడుపు, మూత్రపిండాలు, రొమ్ము క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తాయి. ముఖ్యంగా ఊదా రంగు చిలగడదుంపల్లో బ్లూబెర్రీస్ కంటే మూడు రెట్లు ఎక్కువ యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. సాధారణ బ్రోకలీ కంటే మొలకెత్తిన బ్రోకలీ 10 నుండి 100 రెట్లు ఎక్కువ పోషకాలను కలిగి ఉంటుంది. ఇందులో సల్ఫోరాఫేన్ అనే రసాయనం ఉంటుంది. ఇది కణితులకు రక్త ప్రవాహాన్ని అడ్డుకోవడమే కాకుండా, రొమ్ము మరియు ప్రోస్టేట్ క్యాన్సర్ కణాల పెరుగుదలను నిరోధిస్తుంది. ఆఔం నష్టాన్ని నివారించడంలో కివి పండు కీలక పాత్ర పోషిస్తుంది. ఇందులో విటమిన్ సి, ఫైబర్, పాలీఫెనాల్స్ అధికంగా ఉంటాయి. క్యాన్సర్ రావడానికి ప్రధాన కారణమైన ఆఔం డ్యామేజ్‌ను ఈ పండులోని యాంటీఆక్సిడెంట్లు సరిచేస్తాయి. ప్రారంభ దశలో కణజాల నష్టాన్ని నివారించడంలో ఇది మేటి. ప్రతిరోజూ గ్రీన్ టీ తాగడం వల్ల శరీరానికి రక్షణ కవచం లభిస్తుంది. ఇందులో ఎపిగాల్లోకాటెచిన్–3–గాలెట్ అనే శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్ ఉంటుంది. ఇది శరీరంలోని ఫ్రీ రాడికల్స్ అనే టాక్సిన్లను నాశనం చేస్తుంది. క్యాన్సర్ కణాలు ఇతర అవయవాలకు వ్యాపించకుండా అడ్డుకుంటుంది. అధిక ఫైబర్, ప్రోటీన్ కావాలనుకునే వారికి బీన్స్ ఉత్తమ ఎంపిక. వీటిలో ఉండే పీచు పదార్థం జీర్ణక్రియకు ఎంతో మేలు చేస్తుంది. క్రమం తప్పకుండా బీన్స్ తీసుకునే వారిలో రొమ్ము క్యాన్సర్ ప్రమాదం 28శాతం వరకు తగ్గుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి. అలాగే పెద్దప్రేగు క్యాన్సర్‌ను నివారించడంలో ఇవి చాలా ప్రభావవంతంగా పనిచేస్తాయి. క్యాన్సర్‌ను పూర్తిగా అడ్డుకోవడం మన చేతుల్లో లేకపోయినా ఈ ఆహారాలను మన దైనందిన జీవితంలో భాగం చేసుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు బాటలు వేసుకోవచ్చు. సరైన ఆహారం, క్రమబద్ధమైన వ్యాయామమే క్యాన్సర్ నివారణకు తొలి మెట్టు.

## చప్పట్లు కొడితే గుండె జబ్బులు రావా?



మనం సాధారణంగా సంతోషంగా ఉన్నప్పుడో లేదా ఎవరినైనా అభినందించేటప్పుడో చప్పట్లు కొడతాం. కానీ కేవలం 15 నిమిషాల పాటు చప్పట్లు కొట్టడం వల్ల శరీరంలోని ఎన్నో అనారోగ్య సమస్యలు మటుమాయమవుతాయని మీకు తెలుసా? దీనినే క్లాపింగ్ థెరపీ అంటారు. జిమ్‌లో గంటల తరబడి శ్రమించలేకపోయినా, ఈ చిన్న అలవాటు మీ గుండె ఆరోగ్యాన్ని, రోగనిరోధక శక్తిని అద్భుతంగా మెరుగుపరుస్తుంది. మన అరచేతుల్లో దాదాపు 28 ఆక్యుప్రెషర్ పాయింట్లు ఉంటాయి. ఇవి గుండె, ఊపిరితిత్తులు, కిడ్నీలు వంటి వివిధ అవయవాలతో ముడిపడి ఉంటాయి. మనం గట్టిగా చప్పట్లు కొట్టినప్పుడు, ఈ పాయింట్లు ఉత్తేజితమై ఆయా అవయవాల పనితీరును మెరుగుపరుస్తాయి. దీనివల్ల రక్త ప్రసరణ మెరుగుపడి, రక్త నాళాల్లోని అడ్డంకులు తొలగిపోవడానికి సహాయపడుతుంది.రోజూ 15–20 నిమిషాల పాటు చప్పట్లు కొట్టడం వల్ల శరీరంలో చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది. మెరుగైన రక్త ప్రసరణ వల్ల గుండెపై ఒత్తిడి తగ్గి, రక్తపోటు నియంత్రణలో ఉంటుంది. ధమనుల్లో రక్తం గడ్డకట్టకుండా చూడటంలో ఈ చికిత్స అద్భుతంగా పనిచేస్తుంది. చప్పట్లు కొట్టడం వల్ల శరీరంలో తెల్ల రక్త కణాల ఉత్పత్తి పెరుగుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి. దీనివల్ల బాడీ ఇమ్యూనిటీ పెరిగి, వైరల్ ఇన్ఫెక్షన్లు దరిచేరకుండా ఉంటాయి. అంతేకాకుండా ఊపిరితిత్తులకు ఆక్సిజన్ సరఫరా పెరగడం వల్ల ఉబ్బసం, దీర్ఘకాలిక దగ్గు వంటి సమస్యలు తగ్గుతాయి. మెదడులోని హ్యాపీ హార్మోన్లను ఉత్తేజపరిచే శక్తి చప్పట్లకు ఉంది. ఇది ఆందోళన, ఒత్తిడిని తగ్గించి మనసుకు ప్రశాంతతను ఇస్తుంది. మానసిక ఉల్లాసం కోసం ఉదయాన్నే ఈ థెరపీని చేయడం ఎంతో మేలు.

## రోజూ ఓ ముక్క తింటే వయసు పెరిగినా షుగర్, బీపీ హద్దుల్లోనే!

నేటి బిజీ జీవనశైలి, క్రమరహిత ఆహారం, పని ఒత్తిడి వల్ల చిన్న వయసులోనే రక్తపోటు, మధుమేహం వంటి తీవ్రమైన వ్యాధులు వస్తున్నాయి. అటువంటి పరిస్థితిలో ఆహారంలో సహజమైన పోషకాలను చేర్చుకోవడం చాలా ముఖ్యం. అందుకు కలబంద గొప్ప ఎంపిక. నేటి బిజీ జీవనశైలి, క్రమరహిత ఆహారం, పని ఒత్తిడి వల్ల చిన్న వయసులోనే రక్తపోటు, మధుమేహం వంటి తీవ్రమైన వ్యాధులు వస్తున్నాయి. అటువంటి పరిస్థితిలో ఆహారంలో సహజమైన పోషకాలను చేర్చుకోవడం చాలా ముఖ్యం. అందుకు కలబంద గొప్ప ఎంపిక. ఇది శరీరాన్ని లోపల నుంచి ఆరోగ్యంగా ఉంచుతుంది. కలబందలో నీరు పుష్కలంగా ఉండటమే కాకుండా కాల్షియం, సోడియం, విటమిన్ సి కూడా ఉంటాయి. ఇది శరీరాన్ని నిర్విషీకరణ చేయడంలో, రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడుతుంది. కలబంద జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. కలబంద రసం తీసుకోవడం వల్ల జీర్ణవ్యవస్థకు ఉపశమనం లభిస్తుంది. ఇందులో ఉండే ఎంజైమ్‌లు, బయోయాక్టివ్ సమ్మేళనాలు జీర్ణక్రియ ప్రక్రియను వేగవంతం చేస్తాయి. ఇది డయాబెటిస్ వంటి సమస్యల నుంచి కూడా ఉపశమనం కలిగిస్తుంది. కలబందలో యాంటీ–ఆక్సిడెంట్లు, ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. ఇది శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుతుంది. రోగనిరోధక శక్తిని పెంచుతుంది. ఇది తీవ్రమైన అనారోగ్యాలతో పోరాడటానికి సహాయపడుతుంది. చర్మం నిర్జీవంగా మారితే.. అటువంటి వారికి కలబంద ఉత్తమమైనది. ఇందులో ఉండే విటమిన్ సి, విటమిన్ ఇ చర్మాన్ని ఫ్రీ రాడికల్ నష్టం నుంచి రక్షిస్తాయి. సహజమైన మెరుపును తెస్తాయి. అలాగే కలబందలోని పోషకాలు వెంట్రుకలకు చాలా మేలు చేస్తాయి. మీకు చుండ్రు సమస్య ఉంటే కలబందను ఉపయోగించడం వల్ల ఫలితాలు వస్తాయి. కాబట్టి ఆరోగ్య సమస్యలకు మందులపై మాత్రమే ఆధారపడకుండా సహజ నివారణగా కలబంద రసాన్ని వాడటం మంచిది.

# మేము కెన్యా, ఉగాండాను మాత్రమే ఓడించాం.. భారత్ పై గెలవలేమన్న పాక్ మాజీ క్రికెటర్



**హైదరాబాద్ పెన్ పవర్:** 2026 టీ20 వరల్డ్ కప్ ఫైనల్లో భారత్ ఘన విజయం సాధించిన తర్వాత దేశవ్యాప్తంగా సంబరాలు కొనసాగుతుండగా, పాకిస్తాన్‌లో మాత్రం ఈ గెలుపు తీవ్ర చర్చకు దారితీసింది. న్యూజిలాండ్‌పై 96 పరుగుల తేడాతో భారత్ గెలవడంపై పాకిస్తాన్ మాజీ క్రికెటర్ అహ్మద్ షెహ్జాద్ తమ దేశ క్రికెట్ వ్యవస్థపై తీవ్ర విమర్శలు గుప్పించారు. "హార్నా మానా హై" కార్యక్రమంలో మాట్లాడిన షెహ్జాద్.. భారత్ విజయానికి కారణం వారి బలమైన క్రికెట్ వ్యవస్థ.. టీమిండియాలో ప్రతిభతో పాటు సరైన సిస్టమ్ ఉండటంతో కొత్త ఆటగాళ్లు ముందుకు వస్తున్నారని చెప్పారు. కానీ పాకిస్తాన్‌లో ప్రతిభకు కొరత లేదు.. మా సిస్టమ్‌లోనే సమస్య ఉందన్నారు.

**భారత ఆటగాళ్లపై ప్రశంసలు:**

సంజూ శాంసన్, ఇషాన్ కిషన్ వంటి ఆటగాళ్లను అహ్మద్ షెహ్జాద్ ఉదాహరణగా చూపించాడు. టోర్నీలో పెద్దగా అవకాశాలు రాకపోయినా, వచ్చిన ఛాన్స్ ని వారు అద్భుతంగా ఉపయోగించుకున్నారని తెలిపాడు. శాంసన్ ఈ టోర్నీలో ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ గా నిలవడం చాలా గొప్ప విషయం అన్నారు. అలాగే ఫైనల్లో ఒత్తిడిని జయించి అభిషేక్ శర్మ అద్భుతంగా ఆడాడని అతడు ప్రశంసించారు. కేవలం 21 బంతుల్లో 52 పరుగులు చేసి మ్యాచ్ స్వరూపన్నే మార్చేశాడని పేర్కొన్నాడు.

**పాక్ క్రికెట్‌పై వ్యంగ్యం:**

భారత్ జట్టు పెద్ద జట్లతో సిరీస్‌లు ఆడుతూ మెరుగవుతుంటే, పాకిస్తాన్ మాత్రం జింబాబ్వే, కెన్యా, ఉగాండా వంటి జట్లపై గెలిచినప్పుడే ఎక్కువగా సంబరాలు చేసుకుంటుందని అహ్మద్ షెహ్జాద్ విమర్శలు గుప్పించాడు. భారత్ 250 పరుగుల లక్ష్యంతో ఆడుతుంది, కానీ పాకిస్తాన్ అయితే 180 పరుగులు చేస్తే సరిపోతుందని భావించి బౌలర్లపై ఆధారపడుతుందని చెప్పుకొచ్చాడు. అంతేకాకుండా, న్యూజిలాండ్ చివర్లో అడ్డుకోకపోయింటే.. భారత్ స్కోరు 275 వరకు వెళ్లే ఛాన్స్ ఉండేదని తెలిపారు. పాకిస్తాన్‌కు ఒక ప్రత్యేక ర్యాంకింగ్ పెట్టాలి.. అందులో కేవలం కెన్యా, ఉగాండా, జింబాబ్వే లాంటి జట్లే ఉండాలంటూ మాజీ క్రికెటర్ అహ్మద్ షెహ్జాద్ తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు.

# నీళ్లు తాగించాలి, బ్యాట్ అందివ్వడమే మా పని.. టీమ్ మేనేజ్మెంట్‌పై సిరాజ్ సెటైర్లు





**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా తరపున ఆడే హైదరాబాద్ స్టార్ క్రికెటర్, పేసర్ మహమ్మద్ సిరాజ్ తన హాస్యంతో కూడిన సమాధానాలతో ఎప్పుడూ అభిమానులను ఆకట్టుకుంటుంటాడు. తాజాగా టీ20 వరల్డ్ కప్ 2026 విజేతల జట్టులో సభ్యుడైన సిరాజ్ ఇచ్చిన ఒక ఫన్నీ సమాధానం ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఒక ఇంటర్వ్యూలో సిరాజ్‌ను జట్టు విజయంలో తనతో పాటు స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ పాత్ర గురించి ప్రశ్నించారు. దీనికి సిరాజ్ సరదాగా స్పందిస్తూ నవ్వులు పూయించాడు.

**మా పని నీళ్లు పెట్టడం, బ్యాట్ అందివ్వడమే:**

ప్రెజెంటర్ మాట్లాడుతూ.. ప్లేయింగ్ ఎలెవెన్‌లో లేకపోవడం కొంత నిరాశ కలిగించవచ్చు కానీ మీ ఇద్దరి పాత్ర ఎంత ముఖ్యమని డీఎస్పీని అడిగాడు.. దీనికి సిరాజ్ సరదాగా స్పందిస్తూ.. మా పాత్ర చాలా పెద్దది.. బయట కూర్చుని ఆటగాళ్లకు వరుసగా నీళ్లు పెట్టడం, వారికి బ్యాట్లు అందజేయడం, నెట్స్ లో ప్రాక్టీస్ చేసే సమయంలో బౌలింగ్ చేయడమే మా పని అని చెప్పాడు. ఈ సమాధానం చెప్పిన వెంటనే సిరాజ్ కూడా నవ్వుకున్నాడు.

**ఈ విజయం టీమ్ క్రెడిట్ వల్లే:**

సిరాజ్ మాట్లాడుతూ.. ఈ విజయం మొత్తం క్రెడిట్ టీంకే చెందుతుందని చెప్పాడు. జట్టు ఏం నిర్ణయిస్తే అదే మంచిదని తాను నమ్ముతానని పేర్కొన్నాడు. నెట్‌లో బౌలింగ్ చేస్తాం.. టీమ్‌లో పాజిటివ్ వాతావరణం ఉంచుతాం.. ప్రతి ఆటగాడికి ఆడాలని ఉంటుంది.. కానీ టీమ్ కాంబినేషన్ కోసం బయట కూర్చోవాల్సి వస్తే, జట్టు ప్రయోజనం ఏమైనా చేస్తామన్నారు. ఇక్కడ వ్యక్తి కాదు, టీమ్ ముఖ్యమైంది అని తెలిపాడు.

**ఇది దేవుడి స్క్రిప్ట్:**

మరో ప్రశ్నకు సమాధానంగా సిరాజ్ మాట్లాడుతూ.. మొదట తాను జట్టులో లేకపోయినా తర్వాత అకస్మాత్తుగా పిలుపు వచ్చిందని చెప్పారు. ఇది దేవుడి స్క్రిప్ట్.. చివరకు మేము ఛాంపియన్స్ అయ్యామని సిరాజ్ అన్నారు.

# ఐపీఎల్ తర్వాత టీమిండియా షెడ్యూల్.. 2027 ప్రపంచకప్ వరకు ఫుల్ బిజీ




**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 వరల్డ్ కప్ 2026 గెలిచిన తర్వాత మరోసారి చరిత్ర సృష్టించిన భారత జట్టు ఇప్పుడు కొంత విరామం తీసుకోనుంది. స్వదేశంలో జరిగిన ఈ టోర్నీలో టైటిల్‌ను కాపాడుకున్న టీమిండియా వరుసగా మూడోసారి ట్రోఫీని కైవసం చేసుకుంది. అయితే ఇప్పుడు ప్లేయర్స్ అందరూ ఇండియన్ ప్రీమియర్ లీగ్ (IPL) 2026 సీజన్‌పై నజర్ పెట్టారు. ఈ టోర్నీ మార్చి 28వ తేదీ నుంచి ప్రారంభం కానుంది. ఐపీఎల్ ముగిసిన తర్వాత జూన్ నుంచి ఇండియన్ టీమ్ మళ్లీ అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌లతో మళ్లీ బిజీ షెడ్యూల్ ప్రారంభం కానుంది. ఇకపై టీమిండియా దృష్టి ప్రధానంగా 2027 వన్డే వరల్డ్ కప్ పై పడింది. దాంతో పాటు వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (WTC) 2025--27 ఫైనల్ కి చేరుకోవడమే లక్ష్యంగా పెట్టుకుంది.

**అఫ్గానిస్తాన్‌తో తొలి సిరీస్:**

ఐపీఎల్ తర్వాత జూన్‌లో భారత్--అఫ్ఘనిస్తాన్‌తో ఒక టెస్ట్-- మూడు వన్డేలు ఆడనుంది. ఆ తర్వాత ఇంగ్లాండ్, శ్రీలంక, బంగ్లాదేశ్ లాంటి జట్లతో వరుసగా సిరీస్‌లు కొనసాగుతాయి. భారత్‌కు 2026--27 కాలంలో కొన్ని కీలక టోర్నీలు ఉన్నాయి. ముఖ్యంగా న్యూజిలాండ్ టూర్, బోర్డర్--గవాస్కర్ ట్రోఫీ (ఆస్ట్రేలియాతో టెస్ట్ సిరీస్) అనంతరం ఆసియా కప్ టోర్నమెంట్ కీలకంగా మారనుంది.

**టీమిండియా షెడ్యూల్:**

**భారత్ లో అఫ్ఘనిస్తాన్ టూర్**
మ్యాచ్‌లు: 1 టెస్ట్, 3 వన్డేలు
తేదీలు: జూన్ 6 -- జూన్ 20, 2026
వేదిక: భారత్

**ఇంగ్లాండ్ లో భారత్ పర్యటన:**
మ్యాచ్‌లు: 5 టీ20లు, 3 వన్డేలు
తేదీలు: జూలై 1 -- జూలై 19, 2026

**ఇండియా టూర్ ఆఫ్ శ్రీలంక:**
మ్యాచ్‌లు: 2 టెస్టులు, 2 టీ20లు
తేదీలు: ఆగస్టు 2026

**ఇండియా టూర్ ఆఫ్ బంగ్లాదేశ్**
మ్యాచ్‌లు: 3 వన్డేలు, 3 టీ20లు
తేదీలు: సెప్టెంబర్ 1 -- సెప్టెంబర్ 13, 2026

**ఇండియా టూర్ ఆఫ్ అఫ్ఘనిస్తాన్:**
మ్యాచ్‌లు: 3 టీ20లు
తేదీలు: సెప్టెంబర్ 2026

**ఏషియన్ గేమ్స్ 2026:**
ఫార్మాట్: టీ20
తేదీలు: సెప్టెంబర్ 19 - అక్టోబర్ 4
వేదిక: జపాన్

**వెస్టిండీస్ టూర్ ఆఫ్ ఇండియా:**
మ్యాచ్‌లు: 3 వన్డేలు, 3 టీ20లు
తేదీలు: అక్టోబర్ 2026
వేదిక: భారత్

**ఇండియా టూర్ ఆఫ్ న్యూజిలాండ్:**
మ్యాచ్‌లు: 2 టెస్టులు, 3 వన్డేలు, 5 టీ20లు
తేదీలు: అక్టోబర్ -- నవంబర్ 2026
వేదిక: న్యూజిలాండ్


**శ్రీలంక టూర్ ఆఫ్ ఇండియా:**
మ్యాచ్‌లు: 3 వన్డేలు, 3 టీ20లు
తేదీలు: డిసెంబర్ 2026 -- జనవరి 2027
వేదిక: భారత్

**బోర్డర్--గవాస్కర్ ట్రోఫీ (ఇండియా జం ఆస్ట్రేలియా)**
మ్యాచ్‌లు: 5 టెస్టులు
తేదీలు: జనవరి -- ఫిబ్రవరి 2027
వేదిక: భారత్

**కీలక టోర్నీలు**
వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ - జూన్ 2027 (అర్హత సాధిస్తే)
ఆసియా కప్ 2027 (వన్డే ఫార్మాట్) - జూలై 2027, బంగ్లాదేశ్
క్రికెట్ వరల్డ్ కప్ 2027 - అక్టోబర్–నవంబర్ 2027, దక్షిణాఫ్రికా/జింబాబ్వే/నమీబియా

# సమ్మర్ వేళ హీట్ పుట్టిస్తున్న ప్రభాస్ బ్యూటీ!





సీజన్ కి తగ్గట్టుగా ఫాలోవర్స్ ను పెంచుకోవడానికి అటు సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ మరింత క్రేజ్ దక్కించుకుంటున్నారు సెలబ్రిటీలు. ముఖ్యంగా అకౌంట్ ఉంటే చాలు తమ అందాలు ఆరబోస్తూ.. అటు దర్శక నిర్మాతల కంట్లో కూడా పడుతున్నారని చెప్పాలి. ఈ క్రమంలోనే ఎంతోమంది హీరోయిన్స్ సోషల్ మీడియాలో యాక్టివ్గా ఉంటూ గ్లామర్ వలకబోస్తూ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారు . పైగా పబ్లిక్ ఈవెంట్లలో, సినిమా ఫంక్షన్లలో సందడి చేసిన ఈ ముద్దుగుమ్మలు. అందుకు సంబంధించిన ఫోటోలను తాజాగా తమ ఇంస్టాగ్రామ్ ఖాతాల ద్వారా షేర్ చేస్తూ అభిమానులకు మంచి అందాల ట్రీట్ ఇస్తున్నారని చెప్పాలి.

ఇదిలా ఉండగా తాజాగా ప్రభాస్ బ్యూటీగా పేరు దక్కించుకున్న రిద్ధీ కుమార్.. ఇంస్టాగ్రామ్ వేదికగా పంచుకున్న కొన్ని ఫోటోలు సోషల్ మీడియాలో మరింత వైరల్ గా మారుతున్నాయి. హెవీ ఎంబ్రాయిడరీ తో డిజైన్ చేసిన స్లీవ్ లెస్ లెహంగా ధరించిన ఈమె.. ముత్యాలతో అద్భుతంగా రూపొందించిన ఈ డ్రెస్. తన మేనిఛాయతో అందాలు ఒలకబోస్తూ ప్రేక్షకులను మరింత మెస్మరైజ్ చేస్తోంది. ముఖ్యంగా నెక్ ను గ్రీన్ కలర్ స్టోన్ చైన్ తో ఫుల్ ఫిల్ చేసింది. మొత్తానికైతే రిద్ధీ కుమార్ సోషల్ మీడియా వేదికగా షేర్ చేసిన ఫోటోలు సోషల్ మీడియాని షేక్ చేస్తోంది అనడంలో సందేహం లేదు. తన అందాలతో ఉక్కిరిబిక్కిరి చేస్తూ సమ్మర్ వేళ మరింత హీట్ పుట్టిస్తుంది అని అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. ఇకపోతే తాజాగా నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఒక ఈవెంట్ కి హాజరైన ఈమె. అక్కడ వివిధ రంగాలలో అద్భుతమైన ప్రదర్శన కనబరిచి అవార్డులు అందుకున్న మహిళలను కలిసినందుకు తాను ఎంతో గర్వంగా ఫీల్ అవుతున్నాను అంటూ క్యాప్షన్ గా రాసుకొచ్చింది. ఇక ప్రస్తుతం రిద్ధీ కుమార్ షేర్ చేసిన ఈ ఫోటోలు, ఇచ్చిన క్యాప్షన్ సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. మహారాష్ట్రలోని షిర్డీ సమీపంలో ఉన్న కోపర్గావ్ ప్రాంతంలో ఒక సైనిక కుటుంబంలో జన్మించింది. ఈమె తండ్రి భారత సైన్యంలో అధికారి కాగా, ఈమె పూణేలోని ఫెర్గ్యూసన్ కళాశాల నుండి తత్వశాస్త్రంలో బ్యాచిలర్ డిగ్రీ అందుకుంది. సినిమాలోకి రాకముందు మోడల్ గా పనిచేసిన ఈమె.. పలు ఫ్యాషన్ షోలు , ప్రాంతీయ అందాల పోటీల్లో పాల్గొనింది. 2018లో రాజ్ తరుణ్ సరసన లవర్ అనే చిత్రం ద్వారా తెలుగు ప్రేక్షకులను పలకరించిన ఈమె.. ఆ తర్వాత విరాజ్ అశ్విని సరసన అనగనగా ఓ ప్రేమ కథలో కనిపించింది.ఇకపోతే ప్రసిద్ధ క్యాడ్బరీ డైరీ మిల్క్ యాడ్ లో కూడా కనిపించిన రిద్ధీ ఇటీవల ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో వచ్చిన ది రాజా సాబ్ సినిమాలో హీరోయిన్ గా నటించి ఆకట్టుకుంది. ఇందులో రిద్ధీ తో పాటు నిధి అగర్వాల్ , మాళవిక మోహనన్ కూడా నటించిన విషయం తెలిసిందే. అటు టెలివిజన్ సిరీస్ లలో కూడా నటించి ప్రేక్షకులను ఆకట్టుకుంది రిద్ధీ కుమార్.



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965